
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 254

సోమవారం 5-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెస్సీ గోల్... అర్జెంటీనా జగేల్

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో తొమ్మిదోసారి క్వార్టర్ ఫైనల్‌కు అర్జెంటీనా - 12లో



ఆరోగ్య బీమా.. ఆదుకునే నేస్తం

హెల్త్‌ప్లాన్‌తో ఆర్థికంగానూ రక్షణ.. మెరుగైన చికిత్సలకు అవకాశం -13లో



ఇరాన్‌లో 'నైతిక పోలీస్' రద్దు

హిజాబ్ వ్యతిరేక ఆందోళనలతో ఇరాన్ ప్రభుత్వం దిగి వచ్చింది. నైతిక పోలీస్ వ్యవస్థను రద్దు చేసింది.

వివరాలు 6లో



ఎంసీడీ ఎన్నికల్లో 50% పోలింగ్

ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50% పోలింగ్ నమోదైంది. గెలుపు తమ దంటే తమదేనని ఆప్, బీజేపీ అంటున్నాయి.

వివరాలు 6లో



ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్లీనరీ

కాంగ్రెస్ 85వ ప్లీనరీని ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించాలని ఆ పార్టీ స్టీరింగ్ కమిటీ తీర్మానించింది.

వివరాలు 6లో



నేడే రెండో దశ పోలింగ్

రెండో దశ పోలింగ్‌కు గుజరాత్ సిద్ధమైంది. 14 జిల్లాల్లోని 93 స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడు ఢిల్లీకి సీఎం జగన్



ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే జీ–20 సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు సీఎం జగన్ సోమవారం ఢిల్లీకి వెళ్తున్నారు. అజెండాను ఖరారు చేయడానికి అన్ని పార్టీల నాయకులతో ప్రధాని ఈ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు.

వివరాలు 2లో ▸

13వ తేదీన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం



రాష్ట్ర మంత్రి మండలి ఈనెల 13న సమావేశం కానుంది. మంత్రివర్గం ఆమోదం కోసం పంపే ప్రతిపాదనలను ఈనెల 9వ తేదీ సాయంత్రంలోగా పంపాలని అన్ని శాఖలను సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు.

వివరాలు 2లో ▸

చంద్రబాబు హయాంలో యువత నిర్వీర్యం



తన హయాంలో యువతను నిర్వీర్యం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు నిరుద్యోగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు దమ్ముంటే తన హయాంలో ఎన్ని నియామకాలు చేపట్టారో.. కొత్తగా ఎన్ని ఆస్పత్రులు నిర్మించారో చెప్పాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీసీలను చంద్రబాబు వాడుకున్నారని మండిపడ్డారు.

వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి



అది అందరికీ తెలిసిందే!
మళ్లీ చెప్పుకోవడం ఎందుకు సార్!!



రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సత్కరిస్తున్న సీఎం జగన్. చిత్రంలో గవర్నర్ విశ్వభూషణ్, హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేశ ప్రగతికి ఏపీ దిక్సూచి

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో కీలక పాత్ర.. రాష్ట్రపతి ముర్ము ప్రశంసలు

- ఆధునిక సమాచార విప్లవంలో ముందు వరుసలో ఏపీ ప్రజలు
- కీలకమైన అభివృద్ధి రంగాల్లో ముందడుగు : గవర్నర్ విశ్వభూషణ్
- మహిళలందరికీ రాష్ట్రపతి స్ఫూర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘనంగా పౌర సన్మానం
- రాష్ట్రపతి గౌరవార్థం గవర్నర్ విందు

సాక్షి, అమరావతి: దేశాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చోదక శక్తిగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళా సాధికారత సాధన, దేశ ప్రగతిలో ఏపీ ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమైందని చెప్పారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ద్రౌపది ముర్ము తొలిసారిగా రాష్ట్రంలో ఆదివారం పర్యటించారు. 2 రోజుల పర్యటన కోసం వచ్చిన రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో పౌర సన్మానం చేసింది. విజయవాడ శివారులోని పోరంకిలో ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఘనంగా సన్మానించారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కూడా రాష్ట్రపతిని సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ తిరుమల–తిరుపతి నుంచి దేశ ప్రజలను ఆశీర్వదిస్తున్న శ్రీవెంకటేశ్వరుడు కొలువైన ఈ పవిత్ర భూమికి రావడం తన అదృష్టంగా పేర్కొన్నారు. దేశ స్వాతంత్య్ర అమృతోత్సవాల వేళ

మిగతా 2వ పేజీలో ▶



విశాఖలో నేవీ డే వేడుకల్లో భాగంగా హెలీకాప్టర్ నుంచి పడవలోకి దిగుతున్న నౌకాదళ సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) నేవీ డే వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

విశ్వగురు భారత్

- నేవీ డే వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం

3లో

త్రివర్ణం.. రెపరెపలు

- విశాఖ సాగర తీరంలో సందడే సందడి
- ఓ వైపు మిగ్ బాంబుల మోతలు.. మరోవైపు జనహోరు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సాక్షిగా సత్తా చాటిన భారత నావికాదళం

3లో

'స్కిల్' స్కాంపై ఈడీ కొరడా

చంద్రబాబు పాలనలో సీమెన్స్ ప్రాజెక్టు పేరిట రూ.241 కోట్ల అవినీతి

- బాబు, చినబాబు కనుసన్నల్లోనే కుంభకోణం
- షెల్ కంపెనీల ద్వారా బినామీల ఖాతాల్లోకి నిధుల మళ్లింపు
- కీలక ఆధారాలు సేకరించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- 26 మంది చంద్రబాబు సన్నిహితులు, బినామీలకు నోటీసులు
- నేడు హైదరాబాద్‌లో విచారణకు హాజరుకావాలని ఆదేశం



సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో యథేచ్ఛగా సాగిన అవినీతి కుంభకోణాల బండారాలు జాతీయస్థాయిలో బట్టబయలవుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ పెద్దలు 'ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)లో నిధులను అడ్డగోలుగా కొల్లగొట్టిన అవినీతి బాగోతంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. టీడీపీ హయాంలో సీమెన్స్ కంపెనీతో రూ.3,300 కోట్ల ప్రాజెక్టు పేరిట కథ నడిపించి.. ఒక్క రూపాయి కూడా పెట్టుబడి రాకుండానే.. అసలు ప్రాజెక్టు లేకుండానే రూ.241కోట్ల ప్రజా ధనాన్ని కొల్లగొట్టారు. ఈ అవినీతి దందాలో సూత్రధారులు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు.. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కాగా.. చంద్రబాబు సన్నిహితులు, బినామీలు పాత్రధారులుగా

మిగతా 10వ పేజీలో ▶

'న్యాయ రాజధాని' మా హక్కు

నాడు రాజధానిని కోల్పోయాం.. నేడు హైకోర్టును ఇవ్వాల్సిందే

- కర్నూలు వేదికగా రాయలసీమ గర్జనకు సర్వం సిద్ధం.. ఏర్పాట్లు పూర్తి చేసిన రాయలసీమ జేఏసీ, వైఎస్సార్‌సీపీ
- తరలిరానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుల, ప్రజా సంఘాల నేతలు.. తోపుడు బండ్ల కార్మికులు మొదలు.. స్వర్ణకారుల దాకా మద్దతు
- ఆరు దశాబ్దాల కలను సాకారం చేసుకునేందుకు బిగుసుకున్న పిడికిలి
- కర్నూలులో ఇటీవల చంద్రబాబు వ్యాఖ్యలతో మరింత రగిలిపోతున్న జనం
- 'సీమ ఆకాంక్ష'ను ఎలుగెత్తి చాటేందుకే 'సీమ గర్జన'

5లో



కర్నూలు ఎస్టీబీసీ గ్రౌండ్‌లో రాయలసీమ గర్జన సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన, ప్రజాప్రతినిధులు, నాయకులు

4 వేల గ్రామాలు ఆరు నెలలు..


రీ సర్వే పూర్తిచేసి భూ హక్కు పత్రాల జారీకి సర్కారు సన్నాహాలు

- ఫిబ్రవరి నెలాఖరుకు 2 వేల గ్రామాలు లక్ష్యం.. మే నెలాఖరుకు మొత్తం 4 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయడమే ధ్యేయం
- ఇప్పటికే 2 వేల గ్రామాల్లో 8 లక్షల మందికి భూ హక్కు పత్రాల పంపిణీ
- ఇప్పటికే 6 వేల గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి.. ప్రతినెలా తహసీల్దార్లు, మొబైల్ మెజిస్ట్రేట్లకు కలెక్టర్ల ఆధ్వర్యంలో శిక్షణ



సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి మరో 4 వేల గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేసి భూ హక్కు పత్రాలను జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ అంశంపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్, సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్, ఇతర అధికారులతో ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించి లక్ష్యాలను నిర్దేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్దేశించిన విధంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి 2 వేల గ్రామాలు, మే నాటికి మరో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి భూ హక్కు పత్రాలు జారీ చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. ఇటీవలే 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి 8 లక్షల మంది భూయజమానులకు హక్కు పత్రాలు జారీ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో వచ్చే 6 నెలల్లో 4 వేల గ్రామాల్లో

మిగతా 2వ పేజీలో ▶



రాస్తున్నది తక్కువ..

ఉత్తీర్ణత ఇంకా తక్కువ

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి
- 2021లో 29.54 శాతం ఉత్తీర్ణులైతే.. 2022లో 26.17 శాతం మాత్రమే
- ప్రశ్నపత్రాల కాఠిన్యంతో కటాఫ్ మార్కులూ ఏటా తగ్గింపు.. చదువులపై కరోనా ప్రభావం
- అడ్వాన్స్‌డ్‌లో 2.50 లక్షల మందికి చాన్స్ ఇస్తున్నా పరీక్ష రాస్తున్నది 60 శాతమే
- నాలుగో వంతు మందికి మాత్రమే అర్హత మార్కులు

14లో

క్లుప్తంగా

నేడు ఢిల్లీకి సీఎం జగన్

ప్రధాని అధ్యక్షతన జరిగే జీ–20 సన్నాహక సమావేశానికి హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్తున్నారు. 2023లో జీ–20 సదస్సును నిర్వహించే అవకాశం భారతదేశం దక్కించుకుంది. దానికి ఎజెండాను ఖరారు చేయడానికి దేశంలోని అన్ని పార్టీల నాయకులతో (అఖిల పక్షం) ప్రధాని నరేంద్రమోదీ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు. మోదీ అధ్యక్షతన సోమవారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ సమావేశంలో సీఎం జగన్‌ పాల్గొంటారు. ఈ సమావేశానికి రావాలని గతంలోనే ముఖ్యమంత్రికి ఆహ్వానం వచ్చినప్పటికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తుండటం, ముందుగా ఖరారు చేసిన షెడ్యూల్‌ ఉండటంతో సీఎం వైఎస్‌ జగన్‌ ఢిల్లీకి వెళ్లే విషయం ఖరారు కాలేదు. అయితే కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌ ఆదివారం ప్రత్యేకంగా ఫోన్‌ చేసి జీ 20 సమావేశానికి తప్పనిసరిగా రావాలని ఆహ్వానించారు. దీంతో సీఎం వైఎస్‌ జగన్‌ ముందుగా ఖరారైన షెడ్యూల్‌ను సర్దుబాటు చేసుకుని ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి... సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రాష్ట్రపతి భవన్‌లో సమావేశంలో సీఎం జగన్‌ పాల్గొంటారు. ఆ సమావేశం ముగిసిన వెంటనే మళ్లీ బయలుదేరి... రాత్రి 10.30 సమయంలో విజయవాడ చేరుకుంటారు.

13న రాష్ట్ర మంత్రి వర్గం భేటీ

సాక్షి, అమరావతి : డిసెంబర్‌ 13న రాష్ట్ర మంత్రి మండలి భేటీ కానుంది. సచివాలయంలో ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరగనుంది. మంత్రివర్గం ఆమోదం కోసం పంపే ప్రతిపాదనలను ఆయా శాఖల అధికారులు నిర్దేశించిన విధంగా డిసెంబర్‌ 9 సాయంత్రం 4 గంటల్లోగా పంపాల్సిందిగా ఆదేశిస్తూ సీఎస్‌ డాక్టర్‌ కేఎస్‌ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులిచ్చారు. గత క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతికి సంబంధించిన నివేదికను కూడా సమర్పించాలని ఆదేశించారు.

సీలేరు విద్యుత్‌ కేంద్రంలో నిరాటంకంగా విద్యుత్‌

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): సీలేరు జలవిద్యుత్‌ కేంద్రంలో విద్యుత్‌ ఉత్పత్తి నిరాటంకంగా జరుగుతోంది. 8 రోజుల క్రితం ఈ కేంద్రంలోని రెండో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఇంజినీర్లు 2 రోజుల క్రితం యూనిట్‌ను పరిశీలించి అప్పర్‌గైడ్‌ బేరింగ్‌ టెంపరేచర్‌ పెరిగి, యూనిట్‌ ట్రిప్‌ అవడంతో ఉత్పత్తి నిలిచిపోతున్నట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని ఈఈ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిట్‌వెల్‌ కంపెనీ ప్రతినిధులు రెండో యూనిట్‌ మరమ్మతు పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టారు. శనివారం నుంచి విద్యుత్‌ ఉత్పత్తి నిరాటంకంగా జరుగుతోందని ఏపీ జెన్‌కో ఇంజినీర్లు వెల్లడించారు.

పీబీసీ టెండర్‌కు ఎస్‌ఎల్‌ఎస్‌సీ గ్రీన్‌ సిగ్నల్‌

త్వరలో ఒప్పందం, పనులు ప్రారంభం

బి.కొత్తకోట: అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సాగు, తాగునీటి ప్రాజెక్ట్‌కు చెందిన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు నిర్వహించిన టెండర్లలో ఎల్‌–1గా నిలిచిన టెండర్‌కు స్టేట్‌లెవల్‌ స్టాండింగ్‌ కమిటీ(ఎస్‌ఎల్‌ఎస్‌సీ) ఆమోదం తెలిపింది. నవంబర్‌ 30న విజయవాడలో కమిటీ చైర్మన్‌, జలవనరులశాఖ ఈఎన్‌సీ, డైరెక్టర్‌ ఆఫ్‌ వర్క్స్‌, అకౌంట్‌, చీఫ్‌ టెక్నికల్‌ ఎగ్జామినర్‌లు సమావేశమైన టెండర్‌, పనుల అప్పగింతపై సమీక్షించారు. టెండర్‌ నిర్వహణ, పాల్గొన్న సంస్థలు, ప్రైస్‌బిడ్‌ తదితర అంశాలను సమీక్షించిన హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్‌ కంపెనీ లిమిటెడ్‌ టెండర్‌కు ఆమోదం లభించింది. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో సాగే ఏవీఆర్‌ హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు రెండో దశలో అంతర్భాగమైన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు సెప్టెంబర్‌లో ప్రభుత్వం టెండర్లను నిర్వహించింది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం సీవీ రామన్నగారిపల్లె నుంచి పుంగనూరు ఉపకాలువపై కిలోమీటర్‌ 79.600 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో కిలోమీటర్‌ 220.350 వరకు కాలువను విస్తరించే పనులకు ప్రభుత్వం రూ.1,219,93,02,150 అంచనాతో టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులు దక్కించుకునేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్స్‌ కంపెనీ లిమిటెడ్‌, మెగా ఇంజనీరింగ్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ లిమిటెడ్‌ టెండర్లను దాఖలు చేయగా రివర్స్‌ టెండరింగ్‌ నిర్వహించారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్‌ కంపెనీ ప్రభుత్వ అంచనా విలువ కంటే 0.1997 శాతం తక్కువకు టెండర్‌ దాఖలు చేయడంతో ఎల్‌–1గా నిలిచింది. ఈ పనుల అప్పగింతపై ఎస్‌ఎల్‌ఎస్‌సీ సమీక్షించి ఆమోదం తెలిపింది. దీనితో ముఖ్యమైన ఆమోదం పొందడంతో ఇక చీఫ్‌ ఇంజనీర్‌ కాంట్రాక్టు సంస్థతో పనులపై ఒప్పంద ప్రక్రియను పూర్తి చేస్తారు. ఒప్పందం పూర్తయ్యాక క్షేత్రస్థాయిలో సర్వేలు మొదలై, ఆతర్వాత కాలువ విస్తరణ పనులు మొదలవుతాయని సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ సీఆర్‌.రాజగోపాల్‌ ఆదివారం చెప్పారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానిస్తున్న గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, సీఎం వైఎస్‌ జగన్‌



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి



పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఎయిర్‌పోర్ట్‌లో రాష్ట్రపతికి ఘన స్వాగతం

- విజయవాడలో కార్యక్రమాల అనంతరం విశాఖకు పయనం
- సాదరంగా స్వాగతం, వీడ్కోలు పలికిన గవర్నర్‌, సీఎం

విమానాశ్రయం (గన్నవరం): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో రాష్ట్ర గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె న్యూఢిల్లీ నుంచి భారత వాయుసేన విమానంలో ఆదివారం ఉదయం 10.50 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి విచ్చేసిన ద్రౌపది ముర్ముకు గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. విజయవాడ మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, కృష్ణా జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌.జవహర్‌రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌ రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్‌ పి.రంజిత్‌బాషా, ఎస్పీ పి.జాషువా, మచిలీపట్నం, గుడివాడ ఆర్డీఓలు ఐ.కిషోర్‌, పి.పద్మావతి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం రోడ్డు మార్గం ద్వారా ప్రత్యేక భద్రత మధ్య రాష్ట్రపతితో కలిసి గవర్నర్‌, ముఖ్యమంత్రి పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌కు బయలుదేరారు. విజయవాడలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం.. రాష్ట్రపతి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి విమానాశ్రయానికి చేరుకుని, విశాఖపట్నం బయలుదేరారు. అదే విమానంలో గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా వెళ్లారు. రాష్ట్రపతికి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

దేశ ప్రగతికి ఏపీ దిక్సూచి



మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



కార్యక్రమానికి హాజరైన ప్రజలు, అధికారులు తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

ఆధునిక ప్రగతి వైపు పయనించేందుకు దేశ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ కీలక భూమిక పోషిస్తోందన్నారు. వందేళ్ల క్రితమే మానవాళికి అవసరమైన ఎన్నో ఔషధాలను సృష్టించిన ప్రముఖ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావును యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. అందుకోసం నూతన జాతీయ విద్యా విధానం–2020లో మన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే ఆధునిక ప్రపంచంలో మనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించేలా కార్యాచరణను రూపొందించారని చెప్పారు. ఆధునిక సమాచార విప్లవంలో ఆంధ్రప్రదేశ్‌ ప్రజలు ముందు వరుసలో ఉంటూ ప్రపంచ వ్యాప్తంగా దేశ కీర్తి పతాకను ఎగుర వేస్తున్నారని ఆమె కొనియాడారు. శ్రీహరికోటలోని ఇస్రో.. అంతరిక్ష పరిశోధనలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

జీవనాడులైన నదీనదాలను సంరక్షించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు. అభివృద్ధిని, మన వారసత్వంతో జోడించే అద్భుతమైన ఘట్టం నాగార్జునసాగర్‌ నిర్మాణమని ఆమె ప్రశంసించారు. కూచిపూడి నాట్యంతో మన సంస్కృతి, సంప్రదాయాలు, భారతీయ కళాత్మక శక్తిని ఆంధ్రప్రదేశ్‌.. ప్రపంచానికి చాటడం ద్వారా ఆలంబనగా నిలుస్తోందన్నారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స'గా ప్రఖ్యాతిగాంచిన తీయనైన భాషలో కవిత్రయం నన్నయ్య, తిక్కన, ఎర్రన్నలు అద్భుతమైన అభివ్యక్తీకరణ ద్వారా భారతీయ భాషల విశిష్టతను చాటి చెప్పారన్నారు. మహిళలను గౌరవించడంలో ఆంధ్రప్రదేశ్‌ అగ్రస్థానంలో నిలుస్తోందని చెప్పారు. ఐదున్నర శతాబ్దాల క్రితమే వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన కవయిత్రి మొల్ల రాసిన మొల్ల రామాయణం భారతీయ సాహిత్య చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతుందన్నారు. గురజాడ అప్పారావు 125 ఏళ్ల క్రితమే రాసిన కన్యాశుల్కం నాటకం ఓ సామాజిక సంస్కరణగా ఆమె అభివర్ణించారు. వందేళ్ల క్రితమే దుర్గాభాయి దేశ్‌ముఖ్‌ ఆంధ్ర మహిళా సభను ఏర్పాటు చేసి మహిళా సాధికారత, సమాజహితం కోసం కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ కోడలైన సరోజినీ నాయుడు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడంతో పాటు దేశంలో తొలి మహిళా గవర్నర్‌గా నియమితులయ్యారన్నారు. తాను జార్ఖండ్‌ గవర్నర్‌గా నియమితులైనప్పుడు సరోజినీ నాయుడు అనుసరించిన ఆదర్శాలను పాటించాలని, ధైర్యంగా ప్రజా సేవలో పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇతరులతో పోలిస్తే ఆంధ్ర మహిళలు చాలా స్వేచ్ఛగా ఉంటారని, భారత రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ ఆనాడే చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధి పథంలో ఏపీ పురోగమించాలి

ఆంధ్రప్రదేశ్‌ నుంచి రాష్ట్రపతులుగా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌, వీవీ గిరి, నీలం సంజీవరెడ్డిలు పాటించిన విలువలు తన కర్తవ్య పాలనలో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని రాష్ట్రపతి చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రదేశ్‌ ప్రజల భాగస్వామ్యం చిరస్మరణీయమని కొనియాడారు. 27 ఏళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు, 25 ఏళ్ల వయసులోనే భరత మాత కోసం ప్రాణాలు అర్పించిన బిర్సాముండా వంటి వారి త్యాగాలను యువత తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం హర్షణీయమన్నారు. స్వాతంత్ర్య అమృతోత్సవాల సమయంలో జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు నివాళి అర్పించడం మన కర్తవ్యమన్నారు. గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఏపీ ఇలాగే అభివృద్ధి పథంలో పురోగమించాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

ప్రగతిపథంలో ఆంధ్రప్రదేశ్‌ : గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌



వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తూ ఆంధ్రప్రదేశ్‌ అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తోందని గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌ పేర్కొన్నారు. ఈజ్‌ ఆఫ్‌ డూయింగ్‌ బిజినెస్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ మొదటి ర్యాంకు సాధించి, దేశంలో వ్యాపార అనుకూల వాతావరణానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. రాష్ట్రపతికి పౌర సన్మాన సభలో గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌ ప్రసంగిస్తూ సమృద్ధికర సహజ వనరులు, నైపుణ్యవంతమైన మానవ వనరులు, దార్శనికమైన నాయకత్వం రాష్ట్రాన్ని పురోగామిపథంలో నిలుపుతున్నాయన్నారు. సాంస్కృతిక, కళా రంగాల్లో విశిష్టత చాటుతూ ఆంధ్రప్రదేశ్‌ తన ప్రత్యేకతను నిలుపుకుంటోందని చెప్పారు. దేశంలో కీలకమైన అభివృద్ధి రంగాల్లో రాష్ట్రం మరింత ముందుకు సాగుతుందని, మరింత వృద్ధి రేటును సాధించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు రాష్ట్రపతి ప్రతిబింబం

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి



మహిళా సాధికారతకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిబింబమని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆమె నిష్కళంకమైన రాజకీయ జీవితం, కష్టాలకు ఎదురొడ్డి మరీ అత్యున్నత స్థాయికి ఎదిగిన తీరు ప్రతి మహిళకు ఆదర్శనీయమన్నారు. రాష్ట్రపతి స్ఫూర్తితో ప్రతి మహిళా స్వయం సాధికారత సాధించాలని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కాంక్షిస్తూ తమ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రపతికి పౌర సన్మాన సభలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ద్రౌపది ముర్ము జీవితం నుంచి రాష్ట్ర మహిళలు మరింత చైతన్యం పొందాలన్నారు. అందుకు తమ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతాయని నమ్ముతున్నానన్నారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే..

ప్రతి మహిళకూ ఆదర్శం

- ఇవాళ చాలా గొప్ప రోజు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక గిరిజన మహిళ భారత రాష్ట్రపతిగా పదవి చేపట్టడం దేశంలో ప్రతి ఒక్కరికి గర్వకారణం. ఒక సామాజికవేత్తగా, ప్రజాస్వామ్య వాదిగా, అణగారిన వర్గాల కోసం అచంచలమైన కృషి చేసిన వ్యక్తిగా అన్నింటికంటే ఒక గొప్ప మహిళగా ద్రౌపది ముర్ము ఉదాత్తమైన జీవితం దేశంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.
- రాజ్యాంగం నిర్దేశించిన అర్హతలు ఉన్న ఏ వ్యక్తి అయినా దేశంలో ఎంతటి స్థానానికైనా చేరుకోగలరు అనేందుకు ద్రౌపది ముర్ము గొప్ప ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతారు. ఆమె జీవితంలో పడ్డ కష్టాలను చిరునవ్వుతో స్వీకరించి, సంకల్పంతో ముందుకు సాగిన తీరు ప్రతి మహిళకు ఆదర్శంగా నిలుస్తుంది.
- ఒడిశాలో అత్యంత వెనుకబడిన మయూర్‌భంజ్‌ ప్రాంతంలోని సంతాలీ గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె ప్రాథమిక విద్యను పూర్తి చేయడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. చదువు మాత్రమే జీవితాలను మారుస్తుందని గట్టిగా విశ్వసించి భువనేశ్వర్‌ వెళ్లి బీఏ పూర్తి చేశారు.
- ద్రౌపది ముర్ము గ్రామంలో డిగ్రీ పట్టా పొందిన తొలి మహిళ కావడం అప్పట్లో ఓ విశేషం. తర్వాత ఇరిగేషన్‌, విద్యుత్‌ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, అనంతరం కౌన్సిలర్‌గా, 2000లో తొలిసారి రాయరంగపూర్‌ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై 2009 వరకు అదే పదవిలో కొనసాగారు.
- ఒడిశా ప్రభుత్వంలో వాణిజ్య శాఖ సహాయ మంత్రిగా, స్వతంత్ర హోదాలో మత్స్య శాఖ మంత్రిగా చేశారు. ప్రజా సేవలో చిత్తశుద్ధి, కార్యదీక్ష, నిజాయితీతో ముందుకు వెళ్లి 2015లో జార్ఖండ్‌ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత దేశ రాష్ట్రపతిగా ఎన్నిక కావడం.. తొలిసారిగా మన రాష్ట్రానికి రావడం సంతోషం కలిగించే విషయం.
- రాష్ట్రపతి పదవికి ద్రౌపది ముర్ము వన్నె తీసుకు వస్తారనడంతో ఎలాంటి సందేహం లేదు. ప్రజాస్వామ్య పటిష్టతకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ ఖ్యాతిని మరింత పెంచడానికి ఆమె తప్పక దోహదపడతారు.





రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపికను అందిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా.. రాష్ట్రపతితో సీఎం జగన్‌ మాటామంతి







రాష్ట్రపతి గౌరవార్థం గవర్నర్‌ విందు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గౌరవార్థం గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌ విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆదివారం విందు ఇచ్చారు. విజయవాడ శివారులోని పోరంకిలో పౌర సన్మాన కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్‌ భారతి, కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రాలతో పాటు రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు ఈ విందులో పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌, ఆయన సతీమణి వైఎస్‌ భారతిలకు జ్ఞాపికలను బహూకరించారు.

– సాక్షి, అమరావతి

6 నెలలు.. 4 వేల గ్రామాలు

▶ మొదటి పేజీ తరువాయి

భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తక్షణ పరిష్కారమే లక్ష్యంగా,,

రీ సర్వే చేసే క్రమంలో జారీ చేసే నోటీసుల ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో బైపాస్‌ చేయకూడదని కలెక్టర్లకు సీసీఎల్‌ఏ సాయిప్రసాద్‌ స్పష్టం చేశారు. నోటీసులు జారీ చేసే ప్రక్రియలో గ్రామ కార్యదర్శి, వీఆర్‌వో సహా గ్రామ సచివాలయ బృందం మొత్తం భాగస్వామ్యం కావాలని సూచించారు. సరైన సమాచారం లేని కారణంగా భూ హక్కు పత్రాలు జారీ కాని కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టాదారు మృతి చెందడం, ఖాతా నంబర్‌, పాత సర్వే నంబర్‌ తప్పుకావడం, విస్తీర్ణం సరిపోకపోవడం వంటి కారణాలతో ఆగిపోయిన పత్రాల జారీ కోసం వెంటనే చర్యలు తీసుకుని పత్రాలు జారీ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జారీ చేసిన భూ హక్కు పత్రాల్లో దొర్లిన తప్పుల్ని సరిచేసే వెబ్‌ల్యాండ్‌–2 వ్యవస్థ ఈ నెల రెండో వారానికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తుది ఆర్‌ఓఆర్‌లో కూడా తప్పుల్ని సరి చేసుకునేందుకు ఉన్న అవకాశాలపై ప్రజలకు తెలిసేలా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లో రాష్ట్రంలోని 17,460 గ్రామాల్లోనూ రికార్డుల స్వచ్ఛీకరణను పూర్తి చేయాలని సీసీఎల్‌ఏ సాయిప్రసాద్‌ ఆదేశించారు.

ఆర్టీసీలో కొత్త బస్సుల సందడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ)లో కొత్త బస్సులు సందడి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో అత్యధికంగా కొత్త అద్దె బస్సులను ఒకేసారి ప్రవేశపెడుతోంది. వివిధ సర్వీసుల కింద 998 అద్దె బస్సుల కోసం ఈ ఏడాది మే నుంచి మూడు దశల్లో టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. దీనికి బస్సు ఆపరేటర్ల నుంచి సానుకూల స్పందన లభించింది. మూడు దశల టెండర్లలో ఇప్పటికే 925 అద్దె బస్సులకు ఒప్పందాలు కుదిరాయి. వాటిలో 300 కొత్త సర్వీసులు ఇప్పటికే వివిధ రూట్లలో నడుస్తున్నాయి. మిగిలిన సర్వీసులను కూడా జనవరి చివరికి ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది.

'స్టార్‌ లైనర్‌'కు మంచి స్పందన

మరోవైపు 'స్టార్‌ లైనర్‌' పేరిట ఆర్టీసీ తొలిసారిగా ప్రవేశపెడుతున్న నాన్‌ ఏసీ స్లీపర్‌ బస్సులకు మంచి స్పందన వస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లే పేద, మధ్య తరగతివర్గాలకు తక్కువ చార్జితోనే స్లీపర్‌ బస్సు సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఆర్టీసీ వీటిని ప్రవేశపెట్టింది.

విశ్వగురు భారత్

మరో 25 ఏళ్లలో మనమే నంబర్ వన్

- నేవీ డే వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ధీమా
- భారత రక్షణలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంస
- రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం
- దేశాభివృద్ధికి ఈ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని వెల్లడి


నేవీ డే విన్యాసాలు తిలకిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ హరిచందన్, కేంద్ర మంత్రులు అజయ్‌భట్, కిషన్‌రెడ్డి, స్పీకర్ తమ్మినేని, మంత్రులు అమర్‌నాథ్, విడదల రజని

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రానున్న 25 ఏళ్లలో భారతదేశం.. విశ్వగురువుగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ధీమా వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడి నరనరాల్లో సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడి ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్నామని, 100 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాలు చేసుకునే సమయంలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీకి వెలుపల రాష్ట్రపతి ఆధ్వర్యంలో మొదటిసారిగా విశాఖపట్నంలో భారత నావికాదళం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో నిర్వహించిన నేవీ డే వేడుకలకు ఆమె ఆదివారం సాయంత్రం హాజరయ్యారు. అంతకు ముందు విజయవాడ నుంచి నేరుగా విశాఖ చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. నావికా దళపతి, అధికారులు, రాష్ట్ర మంత్రులు ఘనంగా స్వాగతం పలికారు. భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన యుద్ధ విన్యాసాల్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిలకించారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం 6.25కి తూర్పు నౌకాదళానికి చెందిన అనంతగిరి కేంద్రానికి చేరుకొని నేవీ డే రిసెప్షన్‌కు హాజరయ్యారు. రాత్రి 8 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం నుంచి తిరుపతి బయలుదేరి వెళ్లారు. నేవీ డే వేడుకల సందర్భంగా రాష్ట్ర పతి ఏమన్నారంటే..

దేశ రక్షణలో నావికాదళం కీలక పాత్ర

- భారత రక్షణలో మహిళల పాత్ర ఎంతో ఉంది. భారత నావికాదళంలో వివిధ హోదాల్లో మహిళలు కూడా దేశ రక్షణలో పాలుపంచుకుంటున్నారు. 1971లో పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో విజయానికి గుర్తుగా ఏటా డిసెంబరు 4వ తేదీన నేవీ డే వేడుకలను జరుపుకుంటున్నాం. ఈ యుద్ధంలో అసువులు బాసిన యుద్ధ వీరులను మరోసారి గుర్తు చేసుకోవడం మన కర్తవ్యం.
- వారి త్యాగాలను కీర్తిస్తూ.. ప్రతి తరానికి గుర్తు చేయడం మన బాధ్యత. మూడు వైపులా సముద్రం, ఒకవైపు పర్వతాలు కలిగిన మన దేశం.. మొదటి నుంచీ సముద్ర తీర దేశంగా ఉంది. సహజ సిద్ధంగా ఉన్న ఈ సముద్ర తీరం దేశాభివృద్ధికి ఎంతో కీలకం. తీర రక్షణలో భారత నేవీ ఎంతో కీలకపాత్ర పోషిస్తోంది.
- భారత నావికాదళం ఎంతో శక్తివంతమైనదే కాకుండా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉంటోంది. భారత నూతన అభివృద్ధిలో నావికాదళం పాత్ర కీలకమైనదని త్రివిధ దళాధిపతిగా నాకు ఎంతో నమ్మకం ఉంది.
- రాష్ట్రంలో ప్రారంభిస్తున్న వివిధ ప్రాజెక్టులు దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి. దేశ ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయుక్తంగా ఉంటాయి. స్వదేశీ పరిజ్ఞానంతో కర్నూలు జిల్లాలో నిర్మించిన నేషనల్ ఓపెన్ ఎయిర్‌రేంజ్ (ఎన్‌ఓఏఆర్)తో దేశ రక్షణలో మనం సిద్ధంగా ఉండేందుకు దోహదం చేయనుంది. ఇది దేశానికి మంచి ఆస్తిగా మారనుంది.


గిరిజన విద్యకు దోహదం

- దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఏకలవ్య పాఠశాలలు గిరిజనుల్లో విద్యావకాశాలు పెంపొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయి. రాష్ట్రంలో బుట్టాయగూడెం, చింతూరు, రాజవొమ్మంగి, గుమ్మలక్ష్మీపురంలో ప్రారంభిస్తున్న ఏకలవ్య పాఠశాలల వల్ల గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు గిరిజన ప్రజల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని భావిస్తున్నా.
- దేశంలో ఎవరైనా, వారి ప్రాంతం, కులం, మతంతో సంబంధం లేకుండా విద్య అందించేందుకు మనం కృషి చేయాలి. విద్యను అందరికీ అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ రహదారి అభివృద్ధి పనులతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు ఆయా ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది.


విద్యుత్ దీపాల అలంకరణలో యుద్ధ నౌకలు

నావికా దళంపై కొత్త పాట

- భారత నావికాదళం చేస్తున్న సాహసాలు, సేవలను కొనియాడుతూ ప్రసేన్ జోషి రచించిన 'కాల్ ఆఫ్ ద బ్లూ వాటర్' పాటను రాష్ట్రపతి రిలీజ్ చేశారు. ఈ పాటను గాయకుడు శంకర్ మహదేవన్ పాడారు. ఈ వేడుకలకు హాజరైన శంకర్ మహదేవన్ భారత రక్షణ దళాల సేవలను కొనియాడుతూ గీతాలాపన చేశారు. 'డికేడ్ ఆఫ్ పార్టిసిపేషన్–సిగ్నలింగ్ పవర్ అండ్ పార్ట్‌నర్‌షిప్' అనే పుస్తకాన్ని కూడా రాష్ట్రపతి ఆవిష్కరించారు. నేవీ వెల్‌నెస్, వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన ప్రత్యేక సినిమాను కూడా విడుదల చేశారు.
- దేశ రాజధాని ఢిల్లీకి వెలుపల మొదటిసారిగా రాష్ట్రపతి ఆధ్వర్యంలో నేవీ డే వేడుకలను నిర్వహిస్తున్నామని భారత నావికాదళపతి అడ్మిరల్ ఆర్. హరికుమార్ తెలిపారు. భారత నావికాదళం చేసిన త్యాగానికి గుర్తుగా చేసుకుంటున్న ఈ వేడుకలు.. సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
- ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, అజయ్‌భట్‌తో పాటు ఏపీ శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం, మంత్రులు అమర్‌నాథ్, విడదల రజని, భారత నావికా దళపతి అడ్మిరల్ ఆర్. హరికుమార్, తూర్పు నావికాదళపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు పాల్గొన్నారు.


సముద్రంలో నేవీ విన్యాసాలు


నేవీ డే సందర్భంగా ఆర్.కె.బీచ్‌లో విన్యాసాలు

రాష్ట్రపతి ప్రారంభించిన ప్రాజెక్టులు

- రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖతో పాటు రోడ్డు రవాణా, గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మొత్తం 7 ప్రాజెక్టులకు రాష్ట్రపతి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.
- కర్నూలులో రక్షణ పరిశోధన, లేబరేటరీ డెవలప్‌మెంట్ (డీఆర్‌డీఎల్) నిర్మించిన నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్(ఎన్‌ఓఏఆర్)ను ప్రారంభించారు.
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ.932 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు ప్రాజెక్టులను ప్రారంభించారు. అవి.. ఎన్‌హెచ్–340లో రాయచోటి నుంచి అంగళ్లు వరకు నిర్మించిన జాతీయ రహదారి, ఎన్‌హెచ్–205లో నిర్మించిన నాలుగు లేన్ల ఆర్‌ఓబీతో పాటు ఎన్‌హెచ్–44లో కర్నూలు టౌన్‌లోని ఐటీసీ జంక్షన్‌లో ఆరు లేన్ల గ్రేడ్ సెపరేటెడ్ స్ట్రక్చర్, స్లిప్ రోడ్స్, డోన్ నగర శివారులోని కంబాలపాడు జంక్షన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్స్, రహదారులు, ఎన్‌హెచ్–342లో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకు నిర్మించనున్న రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.
- గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్మించిన 4 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను (బుట్టాయగూడెం, చింతూరు, గుమ్మలక్ష్మీపురం, రాజవొమ్మంగి) రాష్ట్రపతి ప్రారంభించారు.

త్రివర్ణం.. రెపరెపలు

- విశాఖ సాగర తీరంలో సందడే సందడి
- ఓ వైపు మిగ్ బాంబుల మోతలు.. మరోవైపు జనహోరు
- రణరంగాన్ని తలపించిన యుద్ధ విన్యాసాలు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సాక్షిగా సత్తా చాటిన భారత నావికాదళం







సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సముద్ర హోరు సైతం చిన్నబోయేలా మిగ్ యుద్ధ విమానం మెరుపులు.. ఆకాశంలో భారత జెండాతో పారాగ్లైడర్ల విన్యాసాలు.. రెప్పపాటులో 90 డిగ్రీల కోణంతో విన్యాసాలు చేస్తూ దూసుకెళ్లిన యుద్ధ విమానాలు.. నింగి నుంచి సముద్రంలోకి హెలికాప్టర్ల ద్వారా దిగుతూ చేపట్టిన సహాయక చర్యలు.. బంగాళాఖాతంలో చీకటిని చీల్చుకుని, వెలుగులు విరజిమ్ముతూ మెరిసిన యుద్ధ నౌకలు.. చూపరులకు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. సాగర తీరంలో భారత నావికాదళం విన్యాసాలతో విశాఖ పులకరించిపోయింది. సుమారు 45 నిమిషాల పాటు సాగిన యోధుల సాహసాలు వీక్షకులను కట్టిపడేయగా.. గగనతలంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు భారత నావికాదళ సత్తాకు సాక్షీభూతంగా నిలిచాయి. భారత నౌకాదళ శక్తి సామర్థ్యాల్ని చూసిన సంద్రం ఉప్పొంగింది. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. దేశ రక్షణ విషయంలో అగ్రరాజ్యాలతో పోటీపడుతూ.. తన పాటవాన్ని భారత నౌకాదళం మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. సమరానికి ఏ క్షణమైనా సన్నద్ధంగా ఉన్నామంటూ సత్తా చాటింది. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ల డెమోతో మెరైన్ కమాండోలు నిర్వహించిన వాటర్ పారా జంప్స్, ఇతర విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్కై డైవింగ్‌లు.. తుపాకులతో కాల్పులు..

నేవీ డే సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచే సాగర తీరం జనంతో నిండిపోయింది. ఆర్కే బీచ్ వెంట నేవీ డే వేడుకలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున నగర ప్రజలు బారులుతీరారు. భారత నావికాదళం సామర్థ్యాలను మరోసారి వీక్షించే భాగ్యం ప్రజలకు కలిగింది. రయ్‌మంటూ దూసుకొచ్చే యుద్ధ విమానాలు.. పల్టీలు కొడుతూ బాంబులు వేస్తూ క్రమపద్ధతిలో ముందుకు సాగిన తీరు చూపరులను ఆకట్టుకుంది. తమ కళ్ల ముందే యుద్ధం జరిగినట్టుగా నావికాదళం చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. తూర్పు నావికాదళం సత్తాను వీక్షించిన జనం చప్పట్లతో జేజేలు పలికారు. కంటికి పక్షుల్లా కనిపిస్తూ 6 వేల అడుగుల పై నుంచి కిందకు స్కై డైవింగ్ చేస్తూ మెరైన్ కమాండోలు పారాచ్యూట్‌ల సాయంతో జాతీయ పతాకాన్ని, భారత నావికాదళం జెండాను చేతబట్టుకుని నేలకు దిగారు. నేరుగా ముఖ్య అతిథి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వద్దకు చేరుకుని మొమెంటో అందజేశారు. ఈ సందర్భంగా జనం నుంచి భారీ ఎత్తున కేరింతలు వినిపించాయి. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల ద్వారా రక్షించడంతోపాటు ఒడ్డున శత్రువుల చేతిలో చిక్కుకున్న తమ వారిని.. మోటారు బోట్లపై దూకుడుగా వచ్చి తుపాకులతో కాల్పులు జరిపి కాపాడుకోవడం చూసి ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ముందే యుద్ధం జరుగుతున్నట్టుగా.. బాంబుల మోత కళ్ల ముందే కనిపించడంతో ఒకింత భయానికి, ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. బంగాళాఖాతంలో లంగరు వేసిన యుద్ధ నౌకలు విద్యుత్ దీపాలంకరణతో ధగధగా మెరిసిపోవడంతో వేడుకలకు హాజరైన జనం ఫోటోలు దిగుతూ పులకరించిపోయారు. ఈ విన్యాసాల్ని చూసేందుకు నౌకాదళాధికారులు, ప్రజా ప్రతినిధులు, సెయిలర్స్, నేవీ కుటుంబ సభ్యులతో పాటు ఇతర ప్రాంతాల వారూ తరలివచ్చారు.

ప్రత్యేక ఆకర్షణగా దేశీయ తయారీ యుద్ధ నౌకలు

విశాఖ తీరంలో జరిగిన నేవీ డే వేడుకల్లో దేశీయంగా తయారైన యుద్ధ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విన్యాసాలు ముగిసిన తర్వాత దీపపు కాంతులతో కనువిందు చేసిన దేశీయ తయారీ యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ కొచ్చి, ఐఎన్‌ఎస్ సహ్యాద్రిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితో పాటు ఐఎన్‌ఎస్ జలాశ్వ కూడా వీక్షకులను అలరించింది. ఇకపై యుద్ధ నౌకల కోసం విదేశాలపై ఆధార పడకుండా భారత్ నిలబడుతోందన్న అంశానికి గుర్తుగా ఈ నౌకలు సముద్రంలో లంగరు వేసి దీపపు కాంతుల్లో వెలిగిపోవడం గమనార్హం. కాగా, అంతకు ముందు తూర్పు నావికాదళం ఇచ్చిన గౌరవ వందనాన్ని రాష్ట్రపతి స్వీకరించారు.

తిరుమల చేరుకున్న రాష్ట్రపతి

రేణిగుంట: విజయవాడ, విశాఖపట్నం పర్యటనలను ముగించుకున్న అనంతరం తిరుపతి వెళ్లిన రాష్ట్రపతికి రేణిగుంట విమానాశ్రయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆమె తిరుమల చేరుకున్నారు. నేడు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ప్యాకేజీకి చంద్రబాబే అంగీకరించారు

మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేకహోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ తీసుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి అంగీకారం తెలిపారని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ చెప్పారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ఆ ఆమోదం ప్రకారం పనిచేయాల్సి ఉంటుందన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేకహోదా కోసం పట్టుబట్టిన వారిలో తాను ఒకడినన్నారు. ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద అంగీకారం తెలిపిన తర్వాత అందుకు కట్టుబడాల్సి ఉంటుందని చెప్పారు. ప్యాకేజీ రూపంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమేరకు నిధులు వస్తే ఆమేరకు తీసుకోవడమే బెటర్ కదా అని పేర్కొన్నారు. ప్రత్యేకహోదా అనేది ముగిసిన అంశం అయినా రాష్ట్రంలో అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష టీడీపీ రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి కొనసాగాలన్నదే బీజేపీ రాష్ట్ర పార్టీ విధానమన్నారు. హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేసే అంశంలో చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు రెండూ ప్రజలను మోసం చేశాయన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు నెలకొన్న రాజకీయ విధానాల కారణంగా ఆంధ్రుల డబ్బులన్నీ హైదరాబాద్‌కి పెట్టుబడులు రూపంలో వెళుతున్నాయన్నారు. దాన్ని తెలంగాణ నేతలు వారిగొప్పగా చెప్పుకొంటున్నారని విమర్శించారు.

చంద్రబాబు హయాంలో యువత నిర్వీర్యం

- నిరుద్యోగం గురించి బాబు మాట్లాడటం సిగ్గుచేటు
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీసీలను వాడుకున్నారు
- బీసీల గుండెల్లో జగనన్నది చెరగని ముద్ర
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని

మహారాణిపేట (విశాఖ దక్షిణ): తన హయాంలో యువతను నిర్వీర్యం చేసిన చంద్రబాబు నిరుద్యోగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ధ్వజమెత్తారు. ఆదివారం విశాఖలోని విక్టోరియా ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన హైరిస్క్ ప్రసూతి వార్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిని మీడియాతో మాట్లాడుతూ.. బాబు హయాంలో ఏ ఆస్పత్రికీ నిధులు ఇవ్వలేదని, ఎలాంటి నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. చంద్రబాబుకు దమ్ముంటే తన పాలనలో ఎన్ని నియామకాలు చేపట్టారో, కొత్తగా ఎన్ని ఆస్పత్రులు, వైద్య కళాశాలలు నిర్మించారో చెప్పాలన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని మండిపడ్డారు. సీఎం జగన్ పాలనలో వైద్య ఆరోగ్యశాఖలో 46 వేలకు పైగా పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. నాలుగు లక్షల మందికి పైగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు.

పెట్టుబడులపై దుష్టచతుష్టయం విష ప్రచారం

రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక ప్రగతిపై దుష్టచతుష్టయం విష ప్రచారానికి తెరలేపిందని మంత్రి రజిని మండిపడ్డారు. అమరరాజా సంస్థ విస్తరణ కోసం తెలంగాణకు వెళ్తే దాన్ని రాజకీయం చేస్తున్న నీచ సంస్కృతి చంద్రబాబుదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చ మీడియా, అబద్ధాలు ప్రచారం చేస్తున్న చంద్రబాబు వైజాగ్‌లో పారిశ్రామిక వృద్ధి గురించి ఆలోచించాలన్నారు. సీఎం దావోస్ పర్యటన తర్వాత విశాఖకు తరలివస్తున్న పెట్టుబడులు, పరిశ్రమల గురించి వారు తెలుసుకోవాలని హితవు పలికారు. అదానీ, ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు విశాఖపట్నంలో పెడుతున్న పెట్టుబడులు చంద్రబాబుకు, పచ్చ మీడియాకు ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. ఐటీ హబ్‌గా విశాఖను మార్చేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందన్నారు.

చంద్రబాబు బీసీల ద్రోహి

ప్రతిపక్ష నేత చంద్రబాబు బీసీల ద్రోహి అని రజిని ధ్వజమెత్తారు. బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారని విమర్శించారు. బీసీలను వెనుకబడిన కులాలుగానే చూశారని దుయ్యబట్టారు. వారి ఎదుగుదలకు ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎలాంటి అవకాశాలు ఇవ్వని చంద్రబాబును బీసీలు ఎప్పటికీ క్షమించరని తేల్చిచెప్పారు. మరోవైపు బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. మంత్రి పదవుల్లోనూ, నామినేటెడ్ పోస్టుల్లోనూ బీసీలకు పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. తద్వారా బీసీలకు బ్యాక్ బోన్‌గా నిలిచారని కొనియాడారు. జగనన్న పాలనతో బీసీలకు భరోసా, భద్రత దొరికాయన్నారు.



“గాయపడ్డ మనిషికి, వేరేవాళ్లు వచ్చి అతని రక్షకులలాగా ప్రవర్తించడం కన్నా అవమానం మరొకటి ఉండదు.
– ఫ్యోదర్ దోస్తోవ్స్కీ

సాక్షి

సోమవారం, డిసెంబర్, 5

అవధులు లేనిదదే!

‘మనవాళ్లొట్టి వెధవాయిలోయ్’ అని ‘కన్యాశుల్కం’ నాటకంలో గిరీశం నోట పలికించారు గురజాడ. ఏ మాటకా మాటే చెప్పుకోవాలి. మనవాళ్లు కూడా ఆయన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా, వెధవాయిత్వాన్ని కడు జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారులెండి. దేశంలో నిరక్షరాస్యత ఎంతగా తగ్గుముఖం పట్టినా, ఎన్ని విశ్వవిద్యాలయాలు పుట్టుకొస్తున్నా, ఎన్నెన్ని జ్ఞాన ప్రవచనాలు మన చెవుల్లో అనుదినమూ మార్మోగుతూనే ఉన్నా, మన వెధవాయిత్వం మాత్రం నానాటికీ వర్ధిల్లుతూనే ఉంది.

వెధవాయిత్వం అనగా మూర్ఖత్వం. ఇది మానవ సహజ లక్షణం. ఈ లక్షణం గురజాడవారికి ముందూ ఉంది, ఆ తర్వాతా ఉంది. మూర్ఖత్వానికి మూలకారణమేంటి అని తరచి చూస్తే, అజ్ఞానమే కారణంగా కనిపిస్తుంది. అజ్ఞానాన్ని అంతం చేస్తే, మూర్ఖత్వం తొలగిపోతుంది కదా అనుకోవచ్చు. అదంత తేలికపాటి వ్యవహారం కాదు. ‘మూర్ఖత్వానికీ జ్ఞానానికీ ఉన్న తేడా అల్లా జ్ఞానానికి అవధులు ఉన్నాయి’ అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్. మూర్ఖత్వం అవధులు లేనిదని ఆయన కవిహృదయం. లోకంలో అవధులు లేని మూర్ఖత్వమే లేకుంటే, జ్ఞానానికి విలువెక్కడిది? చీకటి ఉన్నచోటే కదా చిరుదీపానికి విలువ!

చరిత్రంతా మూర్ఖత్వానికీ జ్ఞానానికీ మధ్య సంఘర్షణే! ‘తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు/ దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు/ తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు/ చేరి మూర్ఖుని మనసు రంజింపరాదు’ అని భర్తృహరి ఏనాడో సంస్కృతంలో చెప్పిన మాటలను ఏనుగు లక్ష్మణకవి తేట తెలుగులో చెప్పాడు. లోకంలో ఎలాంటి అసాధ్యాన్నయినా సాధించవచ్చు గాని, మూర్ఖులను ఒప్పించి మెప్పించడం సాధ్యంకాని పని అని గుర్తించిన భర్తృహరిని మించిన మహాజ్ఞానులు ఇంకెవరుంటారు? భర్తృహరి మాటలను గుర్తుంచుకుంటే, మూర్ఖులతో పేచీ లేకుండా మన మానాన మనం కడుపులో చల్ల కదలకుండా బతికేయవచ్చు. కాదూ కూడదని పని గట్టుకుని మరీ మూర్ఖులను ఒప్పించి మెప్పించే ప్రయత్నం చేస్తే మాత్రం అది వికటించి, ప్రాణాల మీదకు కూడా రావచ్చు. మూర్ఖబలాన్ని తక్కువగా అంచనా వేయడం మూర్ఖత్వమే అవుతుంది.

కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని సమర్థించిన గెలీలియో ఉదంతమే ఇందుకు ఉదాహరణ. సూర్యుని చుట్టూనే భూమి తిరుగుతుందని చెప్పిన పాపానికి నాటి మతాధికారులు గెలీలియోను ఖైదుపాలు చేశారు. చివరకు ఖైదులోనే అతను కన్నుమూశాడు. అంతకంటే ముందుకాలం వాడు సోక్రటీస్. యువకులకు జ్ఞానబోధ చేశాడు. మూర్ఖ మతాధిపతులు కన్నెర్ర చేశారు. అతడి చేతికి విషపాత్రనిచ్చారు. అదీ మూర్ఖత్వం తడాఖా! సత్యాన్ని వెల్లడించిన పాపానికి ప్రాణాలనే బలిగొనేంత బలవత్తర శక్తి మూర్ఖత్వానిది.

‘ఒపీనియన్స్ అప్పుడప్పుడు ఛేంజి చేస్తుంటేగాని పొలిటీషియను కానేరడు’ అని మహాజ్ఞాని గిరీశం నుడివాడు. పొలిటీషియన్ అయినా కాకున్నా, మానవమాత్రులందరూ కాలానుగుణంగా అభిప్రాయాలను మార్చుకుంటూనే ఉంటారు. బాల్యంలో ఉన్న అభిప్రాయాలు యవ్వనంలో మారిపోతాయి. యవ్వనంలోని అభిప్రాయాలు వార్ధక్యంలో పటాపంచలైపోతాయి. అసలు అభిప్రాయాలను మార్చుకోని వారు ఇద్దరే ఇద్దరు అంటాడు అమెరికన్ కవి జేమ్స్ రసెల్ లోవెల్. ‘ఈ ప్రపంచంలో మూర్ఖుడూ, మృతుడూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోరు’ అన్నాడు.

‘ఎలుగువాని దెలుప నెవ్వడయినను జాలు/ నొరుల వశము గాదు వోగు దెల్ప/ యేటి వంక దీర్ప నెవ్వరి తరమయా?’ అన్నాడు వేమన. అయినా, మూర్ఖులకు జ్ఞానబోధ చేయాలనే కాంక్ష కొందరు జ్ఞానులలో మితిమీరి ఉంటుంది. పరిసరాలను, పరిసరాల్లోని పరిస్థితులను పట్టించుకోకుండా ప్రవచనాలకు లంకించుకునే ‘జ్ఞానులు’ ఆ బాపతులోకే వస్తారు. అయితే, మూర్ఖులను జ్ఞానబోధ చేయడంతోనే మన విద్యావ్యవస్థలో పురోగతి మొదలైన సంగతిని మనం మరువరాదు. మూర్ఖులైన ముగ్గురు రాకుమారులకు విష్ణుశర్మ బోధించిన ‘పంచతంత్రం’ ప్రపంచ సాహిత్యంలోనే ఒక మైలురాయి. మూర్ఖులకు జ్ఞానబోధ చేయడం అంటే కత్తిమీద సాము వంటి విన్యాసమే! విష్ణుశర్మ ఆ పనిని విజయవంతంగా చేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. క్రీస్తుశకం ఐదో శతాబ్ది నాటి రచన ‘పంచతంత్రం’. దాదాపు అదేకాలంలో– క్రీస్తుశకం ఐదు నుంచి పదిహేనో శతాబ్ది మధ్యకాలంలో యూరోప్‌లో ‘ఫూల్స్ లిటరేచర్’ ప్రాచుర్యంలోకి వచ్చింది. ‘ఫూల్స్ లిటరేచర్’లో వెలువడిన కవితలు, కథలలో ‘ఫూల్’ పాత్ర తప్పనిసరి. యూరోపియన్ మూర్ఖసాహిత్యంలోని ‘ఫూల్’ పాత్ర ఒక్కోసారి తెలివితక్కువ మూర్ఖునిగా, ఒక్కోసారి మొండి మూర్ఖునిగా, ఒక్కోసారి అతితెలివి మూర్ఖునిగా కనిపిస్తాడు. ప్రపంచ సాహిత్యంలో మూర్ఖపాత్రలు కోకొల్లలు.

‘అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష’ అనేది సనాతన మూర్ఖత్వం. ‘అన్నీ ఆన్‌లైన్‌లోనే ఉన్నాయిష’ అనేది హైటెక్ మూర్ఖత్వం. కాలం శరవేగంగా మారుతోంది. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా పురోభివృద్ధి చెందుతోంది. మనుషుల మూర్ఖత్వంలోనూ మార్పులు వస్తున్నాయి. అయితే, ముడి పదార్థమైన మూర్ఖత్వం మాత్రం యథాతథంగానే ఉంటోంది. ‘మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును’ అని మనసారా ఆకాంక్షించాడు గురజాడ. మనుషుల్లోని మూర్ఖత్వం మాసిపోయి, జ్ఞానమొక్కటే నిలిచి వెలిగే రోజులు ఎప్పటికైనా వస్తాయా?

ఉగ్రవాద లెక్కలు పరమ సత్యాలా?

కామెంట్



కరణ్ థాపర్

ఏం చెప్పినా ప్రజలు గుడ్డిగా నమ్మేస్తారని ప్రభుత్వ అధికారులు, ముఖ్యంగా పోలీసు అధికారులు భావిస్తుండవచ్చు. దీనికి మంచి సాక్ష్యం కశ్మీర్‌లో తీవ్రవాదుల సంఖ్య గురించిన సమాచారం. కశ్మీర్ లోయలో ఇప్పుడు 81 మంది ఉగ్రవాదులు ఉన్నారనీ, వీరిలో 29 మంది స్థానికులు కాగా, 52 మంది విదేశీ ఉగ్రవాదులనీ డీజీపీ విజయ్ కుమార్ వెల్లడించారు. అంత కచ్చితంగా ఆయన ఎలా చెప్పగలిగారు? వాళ్లు ఏమైనా వస్తూపోతున్నప్పుడు ఒక రిజిస్టర్‌లో సంతకాలు ఏమైనా పెడుతున్నారా? లేక వారి గురించిన సమస్త వివరాలనూ వాసన పట్టేసే మార్గాలు అక్షరాలా మనవద్ద ఉన్నాయా? వీళ్ల ఆనుపానులు కూడా ఇంత కచ్చితంగా తెలిసినప్పుడు మరి వాళ్లను ఎందుకు పట్టుకోవడం లేదు? ఉగ్రవాదుల గురించిన వివరాలపై మనం ఇలాంటి మామూలు ప్రశ్నలు కూడా వేయలేమా? పైగా వాటిని నిలదీయడానికి వీల్లేని పరమ సత్యాలుగా భావిస్తుండటం మరీ విషాదం.

ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులకు చాలావరకు మనలాంటి సాధారణ ప్రజలు ఏది చెప్పినా సరే మందమతుల్లాగ తలాడించేస్తుంటారని గట్టినమ్మకం. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా లేక ఆఫీసులో ఉంటున్న ఏ అధికారి విషయంలోనైనా ఇది నిజమనే చెప్పాలి. కానీ అప్పుడప్పుడూ వాళ్లు ఇచ్చే సమాచారం ప్రతిదీ నమ్మేసేవాళ్లను కూడా ఆలోచనలో పడేస్తుంది. జమ్మూ కశ్మీర్‌లోని ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించినంత వరకూ ఇది చాలా తరచుగా నిజమేనంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను.



గత శనివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) విజయ్ కుమార్ ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ పత్రికకు నివ్వెరపరచే వివరాలు వెల్లడించారు. ‘‘ప్రస్తుతం కశ్మీర్ లోయలో 81 మంది యాక్టివ్ ఉగ్రవాదులు ఉన్నారు. వీరిలో 29 మంది స్థానికులు కాగా, 52 మంది విదేశీ ఉగ్రవాదులు’’ అని ఆయన స్పష్టం చేశారు. ఆయన ఇంత కచ్చితంగా ఎలా చెప్పగలరు? ఉగ్రవాదులు వచ్చి సంతకాలు పెట్టిపోయేలా మనం ఏమైనా ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నామా? పైగా వారి మూలం, నేపథ్యం గురించి మనకేమైనా చెప్పారా? లేక వారి గురించిన సమస్త వివరాలనూ వాసన పట్టేసే మార్గాలు అక్షరాలా మనవద్ద ఉన్నాయా?

అంకెలు సరిపోతున్నాయా?

అంతమాత్రమే కాదు. డీజీపీ ఇంకా చాలా నిర్దిష్టంగా ఉన్నారు. ‘‘బందీపుర్, కుప్వారా, గాందర్‌బల్ జిల్లాల్లో స్థానిక ఉగ్రవాదులు అసలు లేరు. కాగా అనంతనాగ్, శ్రీనగర్, బారాముల్లా, బడ్గావ్ జిల్లాల్లో ఒక్కో ఉగ్రవాది మాత్రమే చురుగ్గా పనిచేస్తున్నారు’’ అని ఆయన చెప్పారు.

ఉగ్రవాదుల సంఖ్య విషయంలో ఆయన అంత నిర్దిష్టంగా, కచ్చితంగా ఎలా చెప్పగలిగారు అనే ప్రశ్నను కాసేపు పక్కన పెడదాం. ఇప్పుడు విదేశీ ఉగ్రవాదుల అంశం ముందుకు తెద్దాం. తొలి మూడు జిల్లాల్లోనే విదేశీ తీవ్రవాదులు పనిచేస్తున్నారని డీజీపీ సూచిస్తున్నారా? రెండవది, ఆయన పేర్కొన్న చివరి నాలుగు జిల్లాల్లో ఒకే ఒక స్థానిక ఉగ్రవాది ఉంటున్నాడా? వారి ఉనికిని ఇంత కచ్చితంగా మనం తెలుసుకుంటున్నప్పుడు, అంటే వారు ఉన్న ప్రదేశం కూడా మనకు తెలిసిపోయినప్పుడు వారిని మనం ఎందుకు పట్టుకోలేకపోతున్నాం?

వాస్తవానికి ఈ ప్రశ్నలు డీజీపీ విజయ్ కుమార్‌ని ఇబ్బంది పెట్టవు. ఆయన్ని తన మార్గం నుంచి వైదొలిగేలా చేయవు కూడా! పైగా ప్రతి సంవత్సరం ఎంతమంది స్థానిక కశ్మీరీలు తీవ్రవాదుల్లో చేరుతున్నారు అనేది కూడా ఆయనకు తెలిసినట్లే కనబడుతోంది. బహుశా వారు తమ వివరాలు ఆయనకు తెలిపి ఉండవచ్చు లేదా వారికి అత్యంత విశ్వసనీయమైనవారు, సన్నిహితమైనవారు డీజీపీ చెవిలో ఊది ఉండవచ్చు. 2018లో 201 మంది స్థానికులు ఉగ్రవాద సంస్థల్లో చేరగా ఈ సంవత్సరం వారి సంఖ్య 99కి పడిపోయిందని డీజీపీ ప్రకటించారు. ఇంత కచ్చితమైన వివరాలు ఆయనకు ఎలా తెలిశాయి అని ఎవరూ డీజీపీని అడగలేరు. లేదా ఆయన బహుశా చెప్పరు కూడా! నిజానికి తనను వైరుధ్యాల్లోకి లాగుతున్న ఈ 99 సంఖ్యను తాను బయటపెట్టినప్పటికీ తనను ఎవరూ నిలదీయరని ఆయన ఎంతో నమ్మకంగా ఉన్నట్లున్నారు.

ఈ సంవత్సరం కశ్మీర్ లోయలో 99 మంది స్థానికులు ఉగ్రవాద సంస్థల్లో చేరగా ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో 64 మంది హతమైపోయారనీ, 17 మందిని అరెస్టు చేయగా 18 మంది ఉగ్రవాదులు మాత్రమే క్రియాశీలంగా ఉన్నారనీ డీజీపీ వివరించి చెప్పారు. అయితే పైన చెప్పిన వివరాలకేసి చూస్తే, 29 మంది స్థానిక ఉగ్రవాదులు మాత్రమే లోయలో ఉన్నారని ఆయన చెప్పి ఉన్నారు. మరి మిగతా 11 మంది ఉగ్రవాదులు ఎక్కడ తప్పిపోయారు?

ఇవి కేవలం వివరాలు మాత్రమే కాబట్టి వీటికి పెద్ద ప్రాధాన్యం ఉండకపోవచ్చని నేను ఊహిస్తున్నాను. ఎందుకంటే డీజీపీ మరింత ముఖ్యమైన విషయం ప్రకటించారు. అదేమిటంటే, చనిపోయిన 64 మంది ఉగ్రవాదుల్లో 57 మంది వారు చనిపోవడానికి సరిగ్గా నెల ముందే ఉగ్రవాద సంస్థల్లో చేరారన్న సంగతి! ఈ విషయం కూడా ఆయనకు ఎలా తెలుసు? వారు ఎప్పుడు చేరిందీ ఆయనకు తెలిసి ఉంటే, వారిని ఎందుకు ఆపలేకపోయారు లేదా కనీసం వారిని ఎందుకు పట్టుకోలేకపోయారు? అయితే ఈ ప్రశ్నలను నేను అడగలేదు. మొత్తం మీద ఉగ్రవాదులకు చెందిన ఇంత సున్నితమైన వివరాలు డీజీపీ చేతివేళ్లపై అంత కచ్చితంగా ఆడుతున్నప్పుడు నాకు ఒకే సందేహం ఉంది. కొంపదీసి డీజీపీ విజయ్ కుమార్ ఈ ఉగ్ర వాదుల జీవిత చరిత్రలు త్వరలో రాసినా నేనేమీ ఆశ్చర్యపోను.

ప్రశ్నించరనే ధీమానా?

ఇప్పుడు, కశ్మీర్ లోయలో పోలీసుల కచ్చితత్వం గురించి మూగపోయేవారిలో నేనే మొదటివాణ్ణి కాదు. 2000 సంవత్సరపు ప్రారంభంలోకి వెళ్లి చూద్దాం. పాకిస్తాన్ నుంచి నెలకు ఎంతమంది జిహాదీలు వాస్తవాధీన రేఖను దాటి వస్తున్నారో నాటి పోలీసులు మాకు నిత్యం వివరాలు చెబుతున్నప్పుడు, ఈజిప్ట్ రాయబారి గెహాద్ మాది తన ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయారు. ‘‘ఈ నెలలో 241 మంది వాస్తవాధీన రేఖను దాటి వచ్చారు. గత నెలలో 225 మంది, అంతకు ముందు నెలలో 230 మంది భారత్ భూభాగంలోకి వచ్చారు అని చెబుతున్నారు. ఇంత కచ్చితంగా వారు ఎలా చెప్పగలరు? వాస్తవాధీన రేఖను దాటి భారత్‌లోకి అడుగుపెట్టే ముందు జిహాదీలు రిజిస్టర్‌లో సంతకం పెట్టివచ్చే కార్యాలయం ఏమైనా ఉందా?’’ అని ఈజిప్టు రాయబారి వ్యంగ్యంగా ప్రశ్నించారు.

గెహాద్ తన దౌత్య పరిధులను దాటి బహిరంగంగా తన సందేహాలను లేవనెత్తి ఉండకపోవచ్చు. కాబట్టి ఆయన సంధించిన ప్రశ్నలకు ఎవరూ సమాధానం ఇచ్చి ఉండరు. కానీ ఇప్పుడు ఉగ్రవాదుల గురించి డీజీపీ విజయ్ కుమార్ చెప్పిన వివరాలపై కొన్ని మామూలు ప్రశ్నలు కూడా మనం వేయలేమా? డీజీపీ ఎవరి వద్దనయితే ఈ వివరాలు చెప్పారో ఆ జర్నలిస్టులు ఆయనను ఏమాత్రం ప్రశ్నించకపోవడం విషాదకరమైన విషయం. వారు ఏమీ అడగలేరని ఆయనకు తెలియడమూ, పైగా ఆయన చెప్పిన వివరాలు నిలదీయడానికి వీల్లేని పరమ సత్యాలుగా మనం కూడా ఆమోదించాలని డీజీపీ భావిస్తుండటమూ మరింత విషాదం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

పట్టింపు అంతవరకేనా?



కశ్మీరీ పండిట్స్ జమ్మూలో 200 రోజులకు పైగా నిరసనలో ఉన్నారు. అయినా వాళ్లకు ఏమయిందని అటువైపు కన్నెత్తి చూసినవాళ్లు లేరు. కానీ వాళ్ల గురించి తీసిన సినిమాను ఎత్తిపట్టుకోవడంలో మాత్రం చాలామంది బిజీగా ఉన్నారు. రాజకీయం అంటే ఇదే కదూ?

– మోనా అంబేగావ్‌కర్, నటి

న్యాయం జరగాలి



భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి సుమారు 40 ఏళ్లవుతోంది. ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన ఈ పారిశ్రామిక ప్రమాదంలో గాయాల వల్ల 22,000 మంది చనిపోయారు. 1,50,000 వికలాంగులయ్యారు. అంగవైకల్యంతో పుట్టేవాళ్లు పదింతలు పెరిగారు. తాగునీరు కలుషితమైంది. నిర్దయకు బదులుగా భోపాల్ గ్యాస్ బాధితులకు న్యాయం, తగిన పరిహారం దక్కాలి.

– తన్మన్‌జీత్ సింగ్ ధేసి, బ్రిటన్ ఎంపీ

భయపడేదేం లేదు



ఆరోగ్యకరమైన యువతలో కోవిడ్ సంక్రమణతో సంభవించే మరణాల రేటు గణించలేనంత తక్కువగా ఉంది. అది 0.0001 నుంచి 0.0002 వరకు ఉంటుంది. అంటే, 5 లక్షల్లో ఒకరి నుంచి 10 లక్షల్లో ఒకరి వరకు. అదికూడా డెల్టా రకానికి. ఒమిక్రాన్‌కు ఇంకా తక్కువ.

– అలెక్స్ బెరెన్సన్, రచయిత

అది... ఇది కాదు!



హిట్లర్ ఉపయోగించినది స్వస్తిక కాదు. అది ‘హాకెన్‌క్రిట్స్’. ఇది నాజీల 102 ఏళ్ల క్రితపు యూదు వ్యతిరేక ద్వేషపూరిత చిహ్నం. కానీ స్వస్తిక(నిజానికి దాన్ని స్వస్తిక్ అనాలి) వేలాది సంవత్సరాల పురాతనమైనది. అది దివ్యత్వం, ఆధ్యాత్మికతల చిహ్నం.

– అనురాగ్ మైరాల్, ప్రొఫెసర్

అదే ముఖ్యం



మీ ఆరోగ్యానికి మీ జీవనశైలి చేయగలిగినంత మరమ్మత్తు ఏ వైద్యమూ చేయలేదు.

– జాన్ కాన్‌స్టాస్, ఫిట్‌నెస్ ట్రెయినర్

నేనే శిష్యుడిని



నేను బోధించడాన్ని ఎప్పటికీ ఆపను. నా విద్యార్థుల నుంచి నేను నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

– ఆండ్రూ టేట్, కిక్‌బాక్సర్

బీసీలు జగన్ వెంటే!

అభిప్రాయం



కైలసాని శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు బీసీలపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 151 స్థానాలు పొందడంలో బీసీలు ప్రముఖ పాత్ర పోషించారు. అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల ఆత్మగౌరవం ప్రతిబింబించే విధంగా వారికి వందలాది నామినేటెడ్ పదవులు ఇచ్చారు. వారి సంక్షేమానికి అత్యధికంగా నిధులు ఇచ్చారు. దీంతో బీసీలు శాశ్వతంగా జగన్ వెంట నడవడానికి సిద్ధమయ్యారని విశ్లేషకులు అంటున్నారు.

రాష్ట్ర జనాభాలో 52 శాతం ఉన్న బీసీలను వైసీపీ నుంచి వేరు చేసి వారి మద్దతు పొందేందుకు తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన లాంటి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఎన్టీఆర్ కాలంలో టీడీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన మంచిని చంద్రబాబు క్లెయిమ్ చేసుకోవడం విడ్డూరం. 2014లో బీసీ డిక్లరేషన్ విడుదల చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఆ డిక్లరేషన్‌లోని అంశా లను పట్టించుకోలేదు. అందుకే 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డికి బీసీలు మద్దతు పలికారు. మరి ఇప్పుడు టీడీపీకి వారు ఓట్లెలా వేస్తారు?



బీజేపీ కూడా ఇటీవల ఏపీలో బీసీలతో సామాజిక చైతన్య సభ నిర్వహించి బీసీలకు వలు హామీలు ఇచ్చింది. చట్ట సభలలో తమకు రిజర్వేషన్లు కావాలనీ, దేశవ్యాప్తంగా బీసీల జనాభా లెక్కించాలనీ అనేక దశాబ్దాలుగా బీసీలు అనేక ఉద్యమాలు చేస్తున్నారు. స్వయంగా బీసీ అయిన ప్రధాన మంత్రి ఈ డిమాండ్లను పట్టించుకోవడం లేదు. ఏ ముఖంతో రాష్ట్ర బీజేపీ నాయకులు బీసీలను ఓట్లడుగుతారు? తనకు కులం అంటగట్ట వద్దని అంటూనే కాపుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు జనసేనాని పవన్ కల్యాణ్. కాపులను బీసీలలో చేర్చే అంశంపై బీసీలు, కాపుల మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. ఈ పరిణామాలతో బీసీలు పవన్ కల్యాణ్‌కు మద్దతు తెలిపే అవకాశమే లేదు.

జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే 83 వేల కోట్ల రూపాయలు నేరుగా బీసీల ఖాతాలలో వేయడం విశేషం. రాష్ట్రంలో ఉన్న 17 మంత్రి పదవులలో 11 మంత్రి పదవులు బీసీలకు కేటాయించారు. అదే విధంగా 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి 56 చైర్మన్‌లను కేబినెట్ హోదాతో నియమించడం, ఆ 56 కార్పొరేషన్‌లలో 732 మంది బీసీలను డైరెక్టర్‌లుగా నియమించడం తెలిసిందే.

జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్ల పదవుల్లో 50 శాతం పైగా బీసీలకు కేటాయించడమూ నిజమే కదా. బీసీ ఉద్యమ నాయకులు ఆర్. కృష్ణయ్యను రాజ్యసభకు పంపి బీసీల గొంతును పార్లమెంట్‌లో బలంగా వినిపించే అవకాశాన్ని సృష్టించారు. ఇంత చేసిన జగన్ వెంట బీసీలు ఉంటారని వేరే చెప్పనవసరం లేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ ׀ 94402 03999

అసలు రంగు బయటపడేది అప్పుడే...

విశ్లేషణ



జాన్‌సన్ చోరగుడి

గడచిన ముప్పై ఏళ్లలో కొత్తగా ఎగువ మధ్యతరగతిగా మారిన వర్గాలను, ఈ రోజు మీరు ఇంత భద్రంగా ఉండడానికి, ఇవీ కారణాలు అని చెప్పి వారిని ఒప్పించడం అంత తేలిక ఏమీ కాదు. కొన్నివేల రూపాయలతో కొన్న స్థలం నుంచి ఇప్పుడు నమ్మశక్యం కానంత ‘రిటర్న్స్’ వచ్చేట్టుగా మీ ఆస్తి విలువ పెరిగింది అంటే– అప్పట్లో దాన్ని కొనడం తప్ప, అదనంగా మీరు చేసింది ఏమీలేదు, అని వాళ్లనిప్పుడు ఒప్పించడం కష్టం. మీ పిల్లల జీతాలు ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి కూడా– ‘మార్కెట్ ఎకానమీ’ కారణం తప్ప, అందులో మన పనితనం ఏమీ లేదు. ఇవన్నీ సంపద పంపిణీ క్రమంలో, ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకున్న పరిణామాల వల్ల మనకు అందిన ఫలాలు.

అయితే, ఇలా కొత్తగా ఎగువ మధ్యతరగతిగా ‘ప్రమోట్’ అయిన వారే చిత్రంగా ఇప్పుడు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలనూ, వాటిని అమలుచేస్తున్న ప్రభుత్వ ఉదార వైఖరినీ తప్పు పడుతున్నారు. ఇటువంటి ధోరణి మునుపు ఉందా అని వెనక్కి చూస్తే, 1970–80 దశకాల మధ్య కాలంలో అమ లైన సంక్షేమం పట్ల ఈ తరహా విమర్శ దాదాపు లేదనే చెప్పాలి. కారణం– స్వాతంత్య్రం తర్వాత, కేంద్ర ప్రభుత్వ ‘సంక్షేమ విధానాల’ వల్ల కులాలతో సంబంధం లేకుండా ఆర్థికంగా చితికి ఉన్న అన్ని వర్గాలు ఎంతోకొంత మేలుపొందాయి. కులీన వర్గాలుగా పేర్కొనే ఎగువ మధ్యతరగతి ఇప్పటిలా ప్రభుత్వ ఉదారవాద చర్యల్ని తప్పుపట్టేది కాదు. అప్పట్లో ఎక్కువమంది స్వాగతించిన – రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ వంటి నిర్ణయాలు అటువంటివే.



అప్పట్లో భద్రతతో స్థిరపడి ఉన్న కులీన వర్గాలలోని విద్యాధికులు, దేశంలో జరుగుతున్న మార్పు ‘ప్రాసెస్’లో చురుకైన భాగస్వామ్య పాత్ర పోషించారు. వారు ఇక్కడ చదివి, విదేశాల్లో ఉన్నత విద్య తర్వాత ఇండియా తిరిగివచ్చి, దేశం చేస్తున్న ప్రగతి యజ్ఞంలో తమదైన పాత్ర పోషించారు. డా॥ యల్లాప్రగడ సుబ్బారావు (బయోకెమిస్ట్), డా॥ యలవర్తి నాయుడమ్మ (లెదర్ టెక్నాలజీ) అటువంటివారే. ఇటీవల డా॥ సౌమ్యా స్వామినాథన్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఇంకా రెండేళ్ల పాటు చీఫ్ సైంటిస్ట్‌గా కొనసాగే అవకాశాన్ని ఈ నవంబర్ 30 నాటికి వదులుకుని, ఇండియాలో బాలల ఆరోగ్య రంగంలో చేయాల్సింది చాలా ఉందని వెనక్కి రావడం ఈ ధోరణికి కొనసాగింపే అవుతుంది.

ఇప్పుడైనా ఇది చర్చించాల్సిన అంశం ఎందుకైందంటే– ‘ఏరు దాటి మేము ‘ఎన్నారై’లు అయ్యాము కదా, మా వెనక వచ్చేవారి కోసం ఇంకా తెప్ప ఎందుకు ఉండాలి’ అని పేద కుటుంబాల కోసం అమలవుతున్న ప్రభుత్వ పథకాల పట్ల వారికున్న దుగ్ధను దాచుకోవడం లేదు. లేని వంకలు వెతికి మరీ ప్రభుత్వానికి మసిపూయడానికి వీరు చేస్తున్న ప్రయత్నంలో దాపరికం ఏమీలేదు. అది తెలుస్తున్నది.

ఈ క్రమంలో వాదన కోసం, వీరికి ఆక్షేపించడానికి మరేదీ కనిపించక కొందరు– ‘రోడ్ల సంగతి ఏమిటి?’ అంటున్నారు. కానీ మూడేళ్ళకు ముందు రోడ్ల పరిస్థితి ఏమిటి, ఈ మూడేళ్ళలో క్రమం తప్పకుండా కురుస్తున్న వానలు వల్ల గట్లకు నీళ్లు తన్నుతూ నిండుతున్న చెరువులు, వాగుల సంగతి వీరికి పట్టదు. అంతేనా ‘కరోనా’ కాలంలో అత్యవసర వైద్యసేవల కోసం చేసిన వ్యయం గురించి కానీ, దాని వల్ల ప్రభుత్వ ఖజానాకు పడిన గండి గురించి గానీ – ఎంతో సౌకర్యంగా వీరు తమ వాదనలో దాటవేస్తారు.

నిజానికి వీరి సమస్య వేరు. అదేమో పైకి చెప్పుకోలేనిది. ఈ ప్రభుత్వం ప్రతి రంగాన్నీ క్రమబద్ధీకరించడంతో, మును పటిలా వీరి ఆస్తుల విలువ పెరగడం లేదు. విషయం ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఒకప్పుడు బలుపుగా కనిపించిన వాపులన్నీ పొంగు తగ్గి నరాలు బయటపడి, అన్ని రంగాలు మళ్ళీ సాధారణ ఆరోగ్య స్థితికి చేరు తున్నాయి. ఈ మూడేళ్ళలో ఇక్కడ రిటైర్ అయిన చీఫ్ సెక్రటరీలు, డీజీపీ ఇప్పటికీ ఇక్కడ పనిచేయడానికి సుముఖత చూపడం, ‘బ్యూరోక్రసీ’కి ఇక్కడున్న పని అనుకూల వాతావరణంగా చూడాల్సి ఉంటుంది.

కానీ కొందరికి ఇవేమీ జరగకూడదు. జరుగుతున్నవి ఎలాగోలా మధ్యలో ఆగిపోవాలి. అయితే ఎలా? ప్రభుత్వంపై ఫిర్యాదు ఉన్న వర్గాలు ఇప్పుడు పెద్దగా లేవు. ఫిర్యాదు ఉన్న వారి సమస్యేమో – ‘బ్లాక్ అండ్ వైట్’లో చెప్పలేనిది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అధ్యక్షుడు క్లాజ్ స్వాబ్ 2004 ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో మాట్లాడుతూ– ‘సమాజంలో ప్రతి ఒక్కరికీ వికాసం పొందే అవకాశం కల్పిస్తే తప్ప, మనకు ఎంతమాత్రం భద్రత ఉండదు’ అనే హెచ్చరిక అయినా వీళ్ళకిప్పుడు అర్థం కావడం ఎంతైనా అవసరం.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

శిక్ష – శిక్షణ

మనం చేసే పనుల్ని అలా చేయవద్దు, అసలు చేయవద్దు, ఇలా చేయాలి, ఇలా చేయకూడదు అని చెబుతుంటారు. గత కాలంలో తాము పొందిన అనుభవాల వల్ల పెద్దలూ, అనుభవజ్ఞులూ అలా చెబుతూ ఉంటారు. ఒకే పనికి పదే పదే అనుభవాల్ని పొందే జీవి కాదు మానవుడు. అది పశువుల లక్షణం. పెద్దల అనుభవాల్ని గ్రహించి నడుచు కోవడం మనుషులు చేయాల్సిన పని. కాబట్టి మనం పెద్దలమాట వినాలి అంటారు. కొందరు పెద్దల సుద్దుల్ని పట్టించుకోరు. చెవికి ఎక్కించుకోరు. ఇలాంటివారు నిర్లక్ష్యంగా ఉండి, చివరికి దుఃఖాన్ని చేతులారా కొని తెచ్చుకుంటారు.

మితిమీరిన కోర్కెలు ఉన్నవారూ, కోపధారులూ; ఆత్మస్తుతి, పరనింద చేసేవారూ, అకారణంగా ఎదుటివారిపై శత్రుత్వం పూనినవారూ, కఠిన హృదయులూ; ఎద్దేవా చేస్తూ, ఎత్తిపొడుపుగా మాట్లాడేవారూ ఇతరులు చెప్పిన మంచి మాటల్ని వినరు.

మంచి దారిలో పెట్టాలని ఎవరైనా కాస్త మందలిస్తే వారితో శత్రుత్వాన్ని పెట్టుకునేవారూ, తనను మందలించిన వారిని మారు మాటలతో తిరిగి మందలించాలని చూసేవారూ, ఏ విషయం మీద తనని మందలిస్తున్నారో, ఆ విషయాన్ని మార్చి పక్కదారి పట్టించేవారూ; మంచి చెప్పిన వారిపై ద్వేషాన్నీ, ఈర్ష్యనూ వెళ్లగక్కేవారూ; అసూయాపరులూ, అహంకారులూ, మూర్ఖులూ, మూర్ఖులతో మైత్రి నడిపేవారూ – ఇతరులు చెప్పిన మంచిమాటల్ని పెడచెవిన పెడతారు. వారి అనుభవాల్ని హేళన చేస్తారు.



మంచి చెప్పేవాళ్ళని శత్రువులుగా భావిస్తారు. ఆ భావనే వారి మనస్సు తలుపుల్ని మూసేస్తుంది. కఠిన హృదయుల్ని చేస్తుంది. అలాంటప్పుడు సమాజం మనల్ని కూడా దూరంగా తోసేస్తుంది. కాబట్టి మనిషి సంఘంలో ఎప్పుడూ అలాంటి పరిస్థితి తెచ్చుకోకూడదు. ‘నేను ఇతరులతో ఎలా ఉంటానో... ఇతరులూ నాతో అలానే ఉంటారు గదా! అలా ఉంటే నా పరిస్థితి ఏమిటి?’ అని ప్రతివారూ ఆలోచించుకోవాలి. అలా ఆలోచిస్తే...

‘వారు నాకు అప్రియులు అయితే, నేనూ వారికి అప్రియమే అవుతాను కాబట్టి నన్ను మంచివైపు నడిపించేవారు మందలిస్తే, నేను వారిని మందలించకూడదు’ అనే జ్ఞానం ఉదయిస్తుంది. ఇతరులు మనకు ఏమి చేస్తే దుఃఖపడతామో, అది ఇతరులకు చేయకూడదు అని అర్థమవుతుంది. అలా అర్థమైన నాడు మనల్ని మనం సంస్కరించుకోవడం మొదలుపెడతాం. సత్ సంకల్పాన్ని పూనతాం. ఈ పూనికే మనల్ని మంచి మార్గంలో నడిపిస్తుంది. తీర్చిదిద్దుతుంది. అలాంటి వారు తమని తామే శిక్షించుకుంటారు. తమకు తామే శిక్షణ ఇచ్చుకుంటారు. జీవితంలో మోదాన్ని పొందుతారు.

– బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.6.44 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** అశ్వని ఉ.8.41 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.6.29 నుండి 8.07 వరకు, తిరిగి తె.4.20 నుండి 5.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.11 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.07 వరకు, **అమృతఘడియలు:** తె.4.20 నుండి 5.56 వరకు (తెల్లవారితే మంగళవారం): **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం** 6.20; **సూర్యాస్తమయం** 5.21.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో 10 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 63,931 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు.

పవన్ కళ్యాణ్ ఎప్పటికీ ఫెయిల్యూర్ పొలిటీషియనే
మంత్రి అంబటి రాంబాబు



శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఒంటిమిట్ట: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎప్పటికీ ఫెయిల్యూర్ పొలిటీషియన్‌గానే మిగిలిపోతారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పవన్ కళ్యాణ్ దగ్గర నుంచి రాజకీయంగా ఎక్కువ ఆశించడమంటే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదటమేనని అన్నారు. ఫెయిల్యూర్ పొలిటీషియన్ వెంట వెళ్లి ఫెయిల్ కావద్దని.. విజయవంతమైన నాయకులను నమ్ముకోవాలని పవన్ అభిమానులకు హితవు పలికారు. కాగా, ఎత్తిపోతల పథకంపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజల్ని కోరారు.

యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పెంచలయ్య



సాక్షి, అమరావతి: ఏపీ యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీ పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో యానాదుల సంఘం రాష్ట్ర మహాసభ ఆదివారం జరిగింది. రాష్ట్ర చైర్మన్‌గా మేకల శ్రీనివాస చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా యందేటి వెంకట సుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాకాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారిగా ఆవుల మడుగు కళావతి, గౌరవ సలహాదారుగా మాకాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాపట్ల బ్రహ్మయ్య, లీగల్ అడ్వైజర్‌గా పి.మల్లికార్జునరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 13 మంది, సంయుక్త కార్యదర్శులుగా 14 మంది, ఆర్గనైజర్ సెక్రెటరీలుగా 14 మందిని ఎన్నుకున్నారు.

టీడీపీ జెండా పీకేయడం ఖాయం: మంత్రి జోగి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోందని, రేపోమాపో ఆ పార్టీ జెండా పీకేయడం ఖాయమని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ చెప్పారు. ఆ పార్టీ నిర్వహించిన సర్వేల్లోనే 86 నియోజకవర్గాల్లో టీడీపీకి దిక్కెవరూ లేరని తేలడమే అందుకు నిదర్శనమన్నారు. పాడెకట్టి మోసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న టీడీపీ పరిస్థితి తెలిసి తట్టుకోలేక ఆపార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తమపై నిందలేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశచరిత్రలో ఎక్కడా లేనివిధంగా 82 వేలమంది బీసీలను ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దిన ఒకే ఒక్క నేత సీఎం జగన్ అని చెప్పారు. 'జయహో బీసీ' అని నినదిస్తూ నిర్వహిస్తున్న మహాసభను నీరుగార్చడానికి, కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజలు నిర్వహిస్తున్న గర్జనను పక్కదోవ పట్టించడానికే వైఎస్సార్‌సీపీ నేతలు విజయసాయిరెడ్డి, సజ్జలను టీడీపీ నేతలతో చంద్రబాబు బూతులు తిట్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన భారీ కుంభకోణంలో చంద్రబాబు, లోకేశ్‌ల పాత్ర ఉందని మంత్రి చెప్పారు. సుమారు రూ.241 కోట్లు దారిమళ్లించడంపై ఈడీ బాబు సన్నిహితులు, బినామీలకు నోటీసులు జారీ చేసిందన్నారు.

కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫణి పేర్రాజు

సాక్షి, అమరావతి: ఏపీ సహకార శాఖ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీవీ ఫణిపేర్రాజు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.భావన ఋషి, కోశాధికారిగా వై.వి.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు తదితర ఆర్థిక అంశాలపై ఏపీ జేఏసీ అమరావతిలో భాగస్వామి పక్షంగా పోరాడి సాధిస్తామని చెప్పారు.

పక్షో రక్షతి రక్షితః



చెట్లు బాగుంటేనే.. పక్షులు బాగుంటాయి. పక్షులు ఎంత బాగుంటే.. చెట్లు అంత బాగుంటాయి. పక్షుల్ని ఆధారంగా చేసుకుని చెట్లు తమ సంతానాన్ని వృద్ధి, విస్తరణ చేసుకుంటుంటే (పండ్లు, కాయల్ని పక్షులు తిని వాటిలోని విత్తనాలను వేరేచోట విసర్జించటం ద్వారా).. చెట్లనే ఆవాసాలుగా మార్చుకుని పక్షులు తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటాయి. అందుకే.. వృక్ష ప్రేమికులు 'వృక్షో రక్షతి రక్షితః' అంటుంటే.. పక్షి ప్రేమికులు 'పక్షో రక్షతి రక్షితః' అంటున్నారు.

బర్డ్ వాచర్స్ సహాయంతోనే..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బర్డ్ వాచర్స్ అందించిన వివరాలతో పక్షుల వలస సమయాలు, వాటి సంఖ్యలో హెచ్చుతగ్గులు, అవి ఎదుర్కొంటున్న ముప్పు వంటి విషయాలను శాస్త్రవేత్తలు విశ్లేషించగలుగుతున్నారు. బర్డ్ వాచింగ్ ద్వారా సామాన్యులు కూడా శాస్త్రవేత్తలకు సహాయపడే అవకాశం లభించింది. ఈ అభిరుచితో బర్డ్ వాచర్స్ పరోక్షంగా పక్షుల పరిరక్షణకు తద్వారా ప్రకృతి పరిరక్షణకు సహాయపడగలుగుతున్నారు. బర్డ్ వాచింగ్‌తో మొబైల్, టీవీలకు దూరంగా పిల్లలు, పెద్దలు ప్రకృతిలో సమయం గడపడం వల్ల మానసిక, శారీరక ప్రయోజనాలు పొందుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

– చంద్రశేఖర్ బండి, బర్డ్ వాచర్

జాతీయ పక్షి నెమలి.. ఆత్మీయ పక్షి పిచ్చుక క్షేమమే

- దేశంలో పాతికేళ్లుగా పెరుగుతున్న 126 పక్షి జాతుల ఉనికి
- ప్రమాదంలో పడిన 52 శాతం పక్షి జాతులు
- బర్డ్ వాచింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- పక్షులను ఎలా గమనించాలనే అంశంపై 'ఎర్లీ బర్డ్' విస్తృత ప్రచారం
- స్కూళ్లు, ఆసక్తి గల వారి కోసం వెబినార్లు, బర్డ్ వాచింగ్

సాక్షి, అమరావతి: దేశంలో గత 25 సంవత్సరాల్లో 126 పక్షి జాతుల ఉనికి స్థిరంగా ఉండటంతోపాటు కొంతమేర వృద్ధి రేటు కూడా నమోదైంది. మన జాతీయ పక్షి నెమలి మనుగడ సురక్షితంగా ఉండటమే కాకుండా.. 100 శాతం వృద్ధి కనిపిస్తోంది. మన ఆత్మీయ పక్షి పిచ్చుక పరిస్థితి కూడా ఆశాజనకంగానే ఉంది. స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్ నివేదికలో ఈ విషయాలు స్పష్టమయ్యాయి. మన దేశంలో గుర్తించిన 1,300 పక్షి జాతుల్లో 867 పక్షి జాతుల ప్రస్తుత స్థితి, దీర్ఘకాలంలో వచ్చే మార్పుల గురించి ఈ నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో 52 శాతం పక్షి జాతుల ఉనికి ప్రమాదంలో పడింది. వేటాడి జీవించే పక్షులు, వలస పక్షులు, పశ్చిమ కనుమల్లో మాత్రమే కనిపించే పక్షులు బాగా తగ్గిపోతున్నట్టు తేలింది. ఈ నివేదికను దేశంలో 15 వేలకుపైగా ఉన్న పక్షుల వీక్షకులు (బర్డ్ వాచర్స్) ఇచ్చిన కోటి పరిశీలనల ఆధారంగా రూపొందించడం గమనార్హం. దీన్నిబట్టి పక్షుల పట్ల ఆసక్తి పెరిగి బర్డ్ వాచింగ్ (వీక్షణ)కు ఆదరణ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

పక్షుల్ని రక్షించాలనే సంకల్పంతో..

పక్షుల్ని సంరక్షించాలనే సంకల్పంతో బెంగళూరుకు చెందిన 'ఎర్లీ బర్డ్' అనే సంస్థ బహుముఖ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే 'బర్డ్ వాచింగ్' కాన్సెప్ట్ ముందుకు తీసుకెళుతోంది. బర్డ్ వాచింగ్‌ను కొత్తగా మొదలుపెట్టే వారికి పక్షుల పేర్లు, వాటి వివరాలు తెలిపే వనరులు పెద్దగా లేకపోవడం ఇబ్బంది కలిగించే అంశం. ఈ కొరత తీర్చడానికి బెంగళూరుకు చెందిన 'ఎర్లీ బర్డ్' అనే సంస్థ పిల్లలు, పెద్దలను ప్రకృతికి, పక్షులకు దగ్గర చేసే లక్ష్యంతో వివిధ రకాల వనరులను పలు భాషల్లో తయారు చేసి అందుబాటులోకి తెచ్చింది. పక్షుల పేర్లు, వాటి అలవాట్లు, వాటి జీవన విధానాల గురించి వివరించే రకరకాల ఆటలు, పాకెట్ గైడ్, పోస్టర్లు తెలుగుతో సహా వివిధ ప్రాంతీయ భాషల్లో తయారు చేశారు. మన పరిసరాల్లో కనిపించే పక్షులు, చిత్తడి నేలల్లో నివసించే పక్షులు, అడవుల్లో ఉండే పక్షులు, పచ్చిక బయళ్లు, గడ్డి మైదానాలు, పంట పొలాల్లో కనిపించే వాటి గురించి పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వారి పాకెట్ గైడ్ చిన్న పిల్లలకే కాకుండా పెద్దవాళ్లకి కూడా పక్షుల పేర్లు, వివరాలు తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. 'ఎర్లీ బర్డ్' తమ పోస్టర్లు, పక్షులకు సంబంధించిన వనరులను ప్రభుత్వ పాఠశాలు, స్వచ్ఛంద సంస్థలకు ఉచితంగా అందిస్తోంది. ఇప్పటివరకు సుమారు 3 లక్షల మంది పిల్లల్ని చేరుకోగలిగారు. దీని వివరాలను www.early&bird.in/telugu/ వెబ్‌సైట్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కాకర 'బాతు'



కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని గోసాల సెంటర్‌లో కూరగాయలు విక్రయిస్తోన్న బాషా దుకాణానికి ఓ రైతు సరఫరా చేసిన కాకరకాయ మూటలో బాతు ఆకారంలో ఉన్న కాకరకాయ కనిపించింది. దీనికి ఉన్న తొడెం కూడా బారుగా బాతు ముక్కును పోలినట్లుగా ఉండటంతో దీన్ని ప్రదర్శనకు ఉంచారు.

– కంకిపాడు (పెనమలూరు)

ఓషన్‌శాట్-3 తీసిన చిత్రాలు విడుదల

సూళ్లూరుపేట: పీఎస్‌ఎల్‌వీ సీ–54 రాకెట్ ద్వారా నవంబర్‌లో నింగిలోకి పంపిన ఓషన్‌శాట్-3 (ఈఓఎస్-06) ఉపగ్రహం తీసిన పలు చిత్రాలను ఇస్రో ఆదివారం బెంగళూరులో విడుదల చేసింది. ఇందులో గుజరాత్‌లోని రాణాఫ్ కచ్, హిమాలయ పర్వతాలు, అరేబియా సముద్ర ప్రాంతాల ఛాయాచిత్రాలున్నాయి. గతంలో పంపిన ఓషన్‌శాట్-2 ఉపగ్రహానికి కొనసాగింపుగా ఓషన్‌శాట్-3ని ప్రయోగించామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. సముద్రాలపై ప్రతి కదలికను తెలియజేయడంతో పాటు మత్స్యకారులకు విలువైన సేవలందిస్తామని చెప్పారు.



ఓషన్‌శాట్-3 తీసిన గుజరాత్‌లోని రాణాఫ్ కచ్ పరిసర ప్రాంతం

ఘంటసాల గాత్రం అజరామరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ రావు

మోపిదేవి (అవనిగడ్డ)/విజయనగరం టౌన్: సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు గాత్రం అజరామరమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ రావు అన్నారు. ఘంటసాల స్వగ్రామమైన కృష్ణా జిల్లా మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామంలోని శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఘంటసాల శత జయంతిని ఘనంగా నిర్వహించారు. జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరావు పేరుతో సంగీత, నృత్య, కళామండపం నిర్మాణానికి గ్రామస్తులు అందరూ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తొలుత రామేశ్వరస్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చల్లా సుబ్బారాయుడు అనువదించిన 'శతాబ్ది గాయకులు ఘంటసాల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీ వేత్త, దూరదర్శన్ వ్యాఖ్యాత డాక్టర్ ఓలేటి పార్వతీశం, శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరి వాసురావుకు స్వర్ణ కంకణ పురస్కారం

ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసురావుకు విజయనగరం ఘంటసాల స్మారక కళాపీఠం



శతాబ్ది గాయకులు ఘంటసాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాద్ రావు

శతాబ్ది గాయకుడు పద్మశ్రీ ఘంటసాల శతజయంతి ఉత్సవం పురస్కరించుకుని ఆనంద గజపతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన 12 గంటల నిర్విరామ ఘంటసాల శత వసంతాల పాటల పండగలో స్వర్ణకంకణ పురస్కారాన్ని అతిథుల చేతుల మీదుగా అందజేశారు. నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, అక్షయ కన్‌స్ట్రక్షన్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు తదితరులు వాసురావుకు దుశ్శాలువతో సత్కరించి, స్వర్ణకంకణం, ప్రశంసపత్రం, జ్ఞాపిక అందజేశారు. ప్రముఖ టీవీ, సినీ గాయకులు సాయిచరణ్, హరిణిలు ఆలపించిన ఆపాత మధురాలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. కళాపీఠం వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, అధిక సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో రాజధానిని నిర్మించాలని
ఎవరు చెప్పారు బాబు?

- 798వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : ఏపీలో రాజధాని ఏర్పాటుకు వేసిన జీఎన్‌రావు, బోస్టన్, శివరామకృష్ణన్ నిపుణుల కమిటీల నివేదికలు అమరావతిలో రాజధాని ఏర్పాటుకు వ్యతిరేకం కాదా చంద్రబాబూ.. అని బహుజన పరిరక్షణ సమితి నేతలు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 798వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఆ నాడు నిపుణుల కమిటీలు అటవీ భూములు లేదా, దొనకొండ ప్రాంతం, అభివృద్ధి చెందిన విశాఖ నగరం, ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న మరేదైనా ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటుకు ప్రతిపాదించాయనేది అందరికీ తెలిసిన విషయమేనన్నారు. మూడు పంటలు పండే భూములను నాశనం చేసి ముంపు ప్రాంతంలో రాజధానిని నిర్మించాలని ఎవరైనా చెప్పారేమో.. బాబు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కులపిచ్చి, కులగజ్జితో నిండిన బాబు



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

ఆయన వత్తాసుదారులు.. సీఎంగా వైఎస్ జగన్‌ను చూడలేక తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ప్రజలను తప్పుదారి పట్టించేందుకు సిద్ధమయ్యారని, ఇందుకోసం అమరావతి పేరుతో రైతులను అడ్డుగా పెట్టి దొంగ ఉద్యమం చేయించారని ఆరోపించారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారం చేయాలని చూస్తున్న చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

'న్యాయ రాజధాని' మా హక్కు

కర్నూలు వేదికగా రాయలసీమ గర్జనకు సర్వం సిద్ధం
'సీమ ఆకాంక్ష'ను ఎలుగెత్తి చాటేందుకే 'సీమ గర్జన'

సాక్షి ప్రతినిధి, కర్నూలు/కర్నూలు (రాజ్‌విహార్) : అన్ని విధాలా వెనుకబడి ఉన్న రాయలసీమ అభివృద్ధిని అడ్డుకోవద్దని, నాడు రాజధానిని కోల్పోయినందున.. నేడు న్యాయ రాజధాని అయినా ఇవ్వాలని 'సీమ' జిల్లాల ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా కర్నూలు వేదికగా నేడు గర్జించనున్నారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు 1937లో కాశీనాథుని నాగేశ్వరరావు ఇంట్లో పెద్దమనుషులు చేసిన ఒప్పందం మేరకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని సీమవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆరు దశాబ్దాలుగా ఇచ్చిన మాటను నెరవేర్చడాన్ని పాలకులు నిర్లక్ష్యం చేసినా, 2020లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభీష్టం మేరకు జీఎన్ రావు కమిటీ నివేదిక ఆధారంగా కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి 'న్యాయం' చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రతిపక్ష పార్టీ.. హైకోర్టు ఏర్పాటుకు అడ్డు తగులుతూనే ఉంది. దీనిపై కర్నూలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంద రోజులకుపైగా రిలే దీక్షలు చేశారు. రాయలసీమ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు, మానవ హారాలు చేశారు. వెనుకబడిన ప్రాంతానికి న్యాయం దక్కుతుందని ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపారు. ఇదే క్రమంలో ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు కూడా తమ ఆకాంక్షను నిరసన రూపంలో తెలియజేశారు. అయితే కర్నూలు వేదికగా చంద్రబాబు సీమ ప్రజల ఆకాంక్షలకు గండికొట్టేలా, కర్నూలులో హైకోర్టు అవసరం లేదని, రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతి మాత్రమే ఉండాలని అంటూ.. టీడీపీ కార్యకర్తలతోనూ అదే విధంగా నినాదాలు చేయించి సీమ ప్రజలను మరింత రెచ్చగొట్టారు. ఈ క్రమంలో 'సీమ వాణి' మరింత గట్టిగా వినిపించేందుకు జేఏసీ నేతలు సిద్ధమయ్యారు. 'రాయలసీమ గర్జన' పేరుతో నేడు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి..

కర్నూలు నగరంలో ఎస్టీబీసీ మైదానంలో జరిగే ఈ సభకు అన్ని ఏర్పాట్లను జేఏసీ, వైఎస్సార్‌సీపీ నేతలు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి వారం రోజులుగా దీనిపై కసరత్తు చేస్తున్నారు. ఈ సభకు 'గ్రేటర్ రాయలసీమ'లోని ఉమ్మడి ఆరు జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరలిరానున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ సభకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఎన్జీవోలు, స్వర్ణకారులు, వస్త్ర వ్యాపారులు, ఆటో డ్రైవర్లు.. చివరకు తోపుడు బండ్లు, పాల వ్యాపారులు కూడా స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించి గళం విప్పేందుకు సిద్ధమయ్యారు. మొదటగా లక్ష మందితో సభ నిర్వహించాలని భావించినా, నిఘా వర్గాలు, నిర్వాహకుల లెక్క ప్రకారం అంతకు మించి భారీగా ప్రజలు తరలిరానున్నారని తెలుస్తోంది. దీంతో ట్రాఫిక్‌కు, వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

'న్యాయ రాజధాని' ప్రకటనతో వేగంగా అభివృద్ధి

హైకోర్టు ఏర్పాటైతే నాలుగు జిరాక్స్ మిషన్లు మినహా ఏం ఉపయోగం లేదని కొంత మంది హేళన చేస్తున్నారు. రాష్ట్రంలో నాలుగో అతిపెద్ద నగరం, సౌత్ ఇండియాకు ముఖ ద్వారం కర్నూలు. న్యాయ రాజధానిగా కర్నూలును ప్రకటిస్తే సాధారణ నగరాల కంటే భిన్నమైన అభివృద్ధి జరుగుతుంది. బెంగళూరు–హైదరాబాద్, చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ల పరిధిలో కర్నూలు ఉంది. ఇప్పటికే పారిశ్రామికంగా కర్నూలు వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ



సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

క్రమంలో 'న్యాయ రాజధాని' అయితే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా కర్నూలును ఎంచుకునే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు, భూమి, నీటి లభ్యత హైదరాబాద్ కంటే మరింత మేలుగా ఉండే అవకాశం ఉంది. రోడ్డు, రైలు మార్గాలతో పాటు విమానాశ్రయం కూడా ఉంది. దీంతో ప్రధాన నగరాలకు రవాణా సౌకర్యం కూడా మెరుగ్గా ఉంటుంది. హైకోర్టు ఏర్పాటైతే లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌తో పాటు 43కు పైగా ట్రిబ్యునల్స్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వం లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏసీబీ కోర్టు కర్నూలులో ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటుతో నగరంలో నిర్మాణ రంగం వేగం పుంజుకోనుంది. నగర పరిధి విస్తరించనుంది. దీంతో ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగు పడతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 1953లో రాష్ట్ర రాజధానిగా ఉన్న కర్నూలును 1956లో త్యాగం చేయకుండా ఉండి ఉంటే 'సీమ' జిల్లాల ముఖచిత్రం మరోలా ఉండేది. త్యాగం చేయడంతో కర్నూలుతో పాటు సమీప జిల్లాలైనా అనంతపురం, వైఎస్సార్ జిల్లాలు కూడా భారీగా నష్టపోయాయి. అందుకే ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లో 'న్యాయ రాజధాని' సాధించాలని 'సీమ' వాసులు గట్టిగా సంకల్పించారు. ఆ దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. కాగా, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్, తదితరులు మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు.

వెనుకబడిన ప్రాంతానికి న్యాయం జరగాలి

'సీమ' అత్యంత వెనుకబడిన ప్రాంతం. దీనికి న్యాయం చేసేందుకు హైకోర్టు ఏర్పాటు చేయాలని పెద్దమనుషులు 1937లో ఒప్పందం చేశారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి కాంక్షిస్తూ ముఖ్యమంత్రి హైకోర్టు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ కొందరు కుట్రలు చేస్తున్నారు. అది ఎవరో అందరికీ తెలుసు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చి చంద్రబాబు మాట్లాడిన మాటలు ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్నాయి. అందుకే జేఏసీ నేతలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. వారికి సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నాం. సభలో పాల్గొంటున్నాం. కచ్చితంగా ఈ ప్రాంతానికి న్యాయం జరగాలి.

– బుగ్గన, ఆర్థిక శాఖ మంత్రి

హైకోర్టు ఏర్పాటు చేసే వరకూ ఉద్యమిస్తాం



కర్నూల్లో హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. కానీ కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయి. ఇటీవల జిల్లా పర్యటనలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణం. పుండుపై కారం చల్లేలా ఆయన మాట్లాడారు. అమరావతి ఒకటే రాజధానిగా ఉండాలని, కర్నూలుకు హైకోర్టు అవసరం లేదని ఆయన టీడీపీ కార్యకర్తలతో నినాదాలు చేయించారు. అందుకే 'సీమ గర్జన'తో ప్రజల ఆకాంక్షను నేడు తెలుపబోతున్నాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, చైర్మన్, రాయలసీమ జేఏసీ

స్వార్థ ప్రయోజనాల కోసమే బాబు కుట్రలు



స్వార్థ ప్రయోజనాల కోసం కుట్రలు పన్నుతున్న ఏకైక వ్యక్తి టీడీపీ నేత చంద్రబాబు. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారు. కానీ అభివృద్ధి అంతా ఒకే చోట ఉండాలనే ఆలోచనతో చంద్రబాబు అడ్డుకుంటున్నారు. అమరావతి చుట్టూ చంద్రబాబు అనుచరులందరికీ భూములు ఉన్నందున, వారికి నష్టం జరగకూడదని చూస్తున్నారు తప్ప ఇతర ఆలోచన లేదు. తన రియల్ దందా దెబ్బ తింటుందనే ఆవేదనతోనే కుట్రలకు తెర లేపారు. రాయలసీమలో పుట్టిన చంద్రబాబుకు సీమ నెత్తురు ఉంటే కర్నూలుకు న్యాయ రాజధాని వచ్చేలా మద్దతు ప్రకటించాలి.

– గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి

చంద్రబాబు అడ్డంకులు తాత్కాలికమే



వేల ఎకరాల పచ్చని పొలాలను రాజధాని పేరుతో తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఎడారిగా మార్చేసింది. అక్కడ అభివృద్ధి కోసం అంటూ రూ.వేల కోట్లు ఖర్చు చేసినా కనీసం టీ హోటల్ కూడా లేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎం జగన్ వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. చంద్రబాబు లాంటి వాళ్లు ఎంత మంది అడ్డుకున్నా అవి తాత్కాలికమే. రాయలసీమ గర్జనకు మా పూర్తి సహకారం ఉంటుంది.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, విప్, రాయచోటి ఎమ్మెల్యే

ట్రిపుల్ ఐటీలో యోగా పోటీలు



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో యోగా పోటీలు నిర్వహిస్తోన్న దృశ్యం

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లోని విద్యార్థులకు ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో యోగా పోటీలను నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు ఒడిశాలోని కళింగ వర్సిటీలో నిర్వహించే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల యోగా పోటీల్లో ఆర్జీయూకేటీ నుంచి జట్టును పంపించేందుకు గాను క్రీడాకారుల ఎంపికకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు శాప్ కోచ్ నాగేంద్రన్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. బాలుర విభాగంలో టి.త్రివేంద్ర, పి.ఆదిశంకర్‌రెడ్డి, జి.వీ. అభిలాష్, ఎస్.రాము, సీహెచ్ సూర్య, టి.అశోక్, కె.శివనాయక్, టి.ఎ ర్రంనాయుడు, ఎస్‌కే సిద్దాసాయిబాబు, బాలికల విభాగంలో ఎ.ప్రవీణ, కె.సౌమ్య, ఎస్.లీలావతి, బి.హేమ, ఎస్.వెంకటభార్గవి, పి.ప్రియాంక, కె.విజయలక్ష్మి, కె.గౌతమి, ఎస్.లావణ్య వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. యోగా శిక్షకులు అక్కినేని శ్రీధర్, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ సుబ్బలక్ష్మి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. విజేతలను డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు అభినందించారు.

మెట్లపై నుంచి పడిన పుతిన్?



న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ (70) బుధవారం తన అధికార నివాసంలోని మెట్ల పైనుంచి కిందపడినట్లు సమాచారం. దాంతో ఆయన తుంటి ఎముక విరిగిందంటూ వార్తలొస్తున్నాయి. రష్యా మాజీ గూఢచారి ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ టెలీగ్రామ్ చానెల్‌ను ఉటంకిస్తూ న్యూయార్క్ పోస్ట్ ఈ మేరకు తెలిపింది. ''పుతిన్‌మెట్లపై నుంచి దొర్లుతూ పడిపోయారు. గ్యాస్ట్రో ఇంటర్‌స్టయినల్ ట్రాక్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ప్యాంట్ తడిపేసుకున్నారు. బాడీగార్డులు వెంటనే సోఫాలో కూర్చోబెట్టి, వైద్యుల్ని పిలిచారు'' అని తెలిపింది. ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైనప్పటి నుంచి పుతిన్ ఆరోగ్యంపై పలు వదంతులు వెలువడుతుండటం తెలిసిందే.

వాళ్లు అడవిని సృష్టించారు

ఒడిశాలో గిరిజన మహిళల ఘనత

కోరాపుట్ (ఒడిశా): అది ఒడిశాలోని మారుమూల కోరాపుట్ జిల్లా. అందులో మరింత మారుమూలన ఉండే గిరిజన గ్రామం. పేరు అంచల. 1990ల నాటి సంగతి. వంట చెరుకు కోసమని, ఇతర అవసరాలకని ఊరి పక్కనున్న పవిత్ర 'మాలీ పర్వతం' మీది చెట్లను విచక్షణారహితంగా నరికేస్తూ పోయారు. ఫలితం ...? చూస్తుండగానే పచ్చదనం జాడలనేవే లేకుండా గుట్ట పూర్తిగా బోసిపోయింది. జరిగిన నష్టాన్ని గుర్తించేలోపే మరుభూమిగా మారింది. దాని పై నుంచి వచ్చే అందమైన సెలయేటి ధార కూడా శాశ్వతంగా ఆగిపోయింది. దాంతో అడవి బిడ్డలైన ఆ గిరిజనులు తల్లడిల్లారు. ముందుగా మహిళలే కళ్లు తెరిచారు. చిట్టడవికి తిరిగి జీవం పోసి పవిత్ర పర్వతానికి పూర్వపు కళ తేవాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం 30 ఏళ్ల అకుంఠిత దీక్షతో శ్రమించారు. తమకు ప్రాణప్రదమైన అడవికి పునఃసృష్టి చేసి నారీ శక్తిని మరోసారి చాటారు. ఫలితంగా నేడు కొండమీది 250 ఎకరాల్లోనే గాక ఊరి చుట్టూ పచ్చదనం దట్టంగా పరుచుకుని కనువిందు చేస్తోంది.

ఒక్కతాటిపై నిలిచి...

అయితే ఈ బృహత్కార్యం చెప్పినంత సులువుగా ఏమీ జరగలేదు. ఇందుకోసం గ్రామస్తులంతా ఒక్కతాటిపై నిలిచి కష్టపడ్డారు. మొదట్లో మూణ్నాలుగు కుటుంబాలు ఒకేచోట వండుకోవడం మొదలు పెట్టారు. క్రమంగా వంట కోసం కట్టెలపై ఆధారపడటాన్ని వీలైనంతగా తగ్గించుకుంటూ వచ్చారు. సేంద్రియ సాగుకు మళ్లారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకున్నారు. అంతేగాక చెట్లను నరికే వారికి రూ.500 జరిమానా విధించారు. ముక్కుపిండి మరీ వసూలు చేయడమే గాక నలుగురిలో నిలబెట్టి నలుగు పెట్టడం వంటి చర్యలు తీసుకున్నారు. చెట్లు నరికేందుకు దొంగతనంగా ఎవరూ కొండపైకి వెళ్లకుండా ఒక కుటుంబాన్ని కాపలాగా పెట్టారు. వారికి జీతమిచ్చేందుకు డబ్బుల్లేకపోవడంతో ఊరంతా కలిసి వారికి 10 కిలోల రాగులిస్తూ వచ్చామని సుపర్ణ అనే గ్రామస్తురాలు గుర్తు చేసుకుంది. ఈ ఉద్యమం మొదలైన రోజుల్లోనే 15 ఏళ్ల వయసులో నవవధువుగా తాను ఊళ్లో అడుగు పెట్టానని చెప్పుకొచ్చింది. ''మా శ్రమ ఫలించి మేం నాటిన చెట్లు చిగురించడం మొదలు పెట్టినప్పటి మా సంతోషాన్ని మాటల్లో చెప్పలేం'' అని చెబుతూ సవిత అనే మరో గ్రామస్తురాలు సంబరపడిపోయింది.

కొసమెరుపు

30 ఏళ్ల కింద మూగబోయిన జలధార కూడా మహిళల మొక్కవోని ప్రయత్న ఫలితంగా మళ్లీ ప్రాణం పోసుకుంది. కొండ మీది నుంచి జలజలా పారుతూ ఒకప్పట్లా కనువిందు చేస్తోంది!



తాము సృష్టించుకున్న అడవి ముందు సగర్వంగా నిలబడ్డ అంచల గ్రామ గిరిజన మహిళలు

క్లుప్తంగా...

ఎంసీడీ ఎన్నికల్లో 50% పోలింగ్



న్యూఢిల్లీ: ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)కు ఆదివారం జరిగిన ఎన్నికల్లో 50 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు 7న జరగనుంది. 1,349 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం ఓటర్లు 1.45 కోట్ల మంది. 2017 ఎన్నికల్లో 53% పోలింగ్ నమోదైంది. గెలుపు తమదంటే తమదేనని ఆప్, బీజేపీ అంటున్నాయి.

ఉత్సాహంగా ఓటేసిన శతాధిక వృద్ధులు

ఎంసీడీ ఓటర్లలో 100 ఏళ్లు, ఆ పైబడిన వాళ్లు 229 ఉన్నారు. 80–100 ఏళ్లలోపు వారు 2,04,301 మంది ఉన్నారు. వారిలో పలువురు ఉత్సాహంగా ఓటేశారు.

57 రోజుల్లో 8,612 కేసులు

మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఘనత

మదురై: మద్రాస్ హైకోర్టులోని మదురై బెంచ్ 57 పనిదినాల్లో వివిధ కేటగిరీలకు చెందిన 8,612 కేసులను పరిష్కరించింది. జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ జె.సత్య నారాయణలతో కూడిన ఫస్ట్ డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 5– డిసెంబర్ 2 మధ్య కాలంలో 6,512 కేసుల దుమ్ము దులిపేసింది. అదే సమయంలో, జస్టిస్ జె.నిషా బాను, జస్టిస్ ఆనంద్ వెంకటేశ్..అనంతరం జస్టిస్ ఎంఎస్ రమేశ్, జస్టిస్ ఆనంద్ వెంకటేశ్‌ల సెకండ్ డివిజన్ బెంచ్ 2,100 కేసులను పరిష్కరించింది.

జీ-20పై నేడు అఖిలపక్షం

న్యూఢిల్లీ: భారత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న జీ–20 సదస్సులో చర్చించాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరించడానికి కేంద్ర ప్రభుత్వం సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. సమావేశానికి దాదాపుగా 40 రాజకీయ పార్టీలకు చెందిన అధినేతల్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఆహ్వానించారు. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తదితరులు హాజరుకానున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కూడా ఈ సమావేశానికి హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. జీ–20 శిఖరాగ్ర సదస్సుకి ముందు హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 200కిపైగా సమావేశాలు నిర్వహించనున్నారు. మరోవైపు జీ–20 మొట్టమొదటి ప్రతినిధుల సదస్సు రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో ఆదివారం జరిగింది. సమ్మిళిత అభివృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్యరంగంలో సదుపాయాలు, నాణ్యమైన జీవనం వంటి వాటిపై భారత్ ప్రతినిధి అమితాబ్ కాంత్ మాట్లాడారు.

'ముస్లిం మహిళలకు టికెట్లు ఇస్లాం వ్యతిరేకం'

అహ్మదాబాద్: ఎన్నికల్లో ముస్లిం మహిళల పోటీపై అహ్మదాబాద్ జామా మసీదు షాహీ ఇమామ్ షబ్బీర్ అహ్మద్ సిద్దిఖీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''దీన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. మహిళలకు టికెట్లివ్వడం ఇస్లాంను బలహీనపరచడమే. బరిలో దిగడానికి మగవారు దొరకడం లేదా? మహిళల్ని ఎందుకు తీసుకొస్తున్నారు. మహిళలు కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులైనా ఏం లాభం? కర్ణాటకలో హిజాబ్ అంశాన్ని లేవనెత్తలేకపోయారు'' అని విమర్శించారు.

కామన్ ఎంట్రన్స్‌తో నైతికత ఉన్న విద్యార్థులు దొరక్కపోవచ్చు: సీజేఐ



పణజి: నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్(సీఎల్‌ఏటీ) ద్వారా సరైన నైతికత ఉన్న విద్యార్థులు దొరక్కపోవచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఎల్లప్పుడూ పరీక్షల్లో ఉత్తీర్ణతకే తప్ప, విలువ ఆధారిత విద్యను ప్రోత్సహించకపోవడమే ఇందుకు కారణం కావచ్చని ఆయన చెప్పారు. శనివారం ఆయన గోవాలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మొదటి విద్యా సంవత్సరం సెషన్‌ను ప్రారంభించి మాట్లాడారు.

చేతగానోళ్లు తప్పుకోండి

కాంగ్రెస్ నేతలకు ఖర్గే హెచ్చరిక

- బాధ్యతలను సరిగా నిర్వహిస్తున్నారా?
- ప్రధాన కార్యదర్శులు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- జవాబుదారీతనంతో పని చేయాలంటూ పిలుపు
- స్టీరింగ్ కమిటీ తొలి భేటీలోనే తనదైన మార్కు!
- మూణ్నెల్లు దేశవ్యాప్తంగా భారీ జనాందోళనలు
- అందుకేం చేయాలో బ్లూప్రింట్ సిద్ధం చేయండి
- నెలలోపు తనకు సమర్పించాలంటూ ఆదేశం



ఢిల్లీలో కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, అంబికా సోని

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలకు పార్టీ నూతన అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గట్టి హెచ్చరికలు చేశారు. ''లెక్క లేకుండా ప్రవర్తించినా పర్లేదనేలా కొందరు వ్యవహరిస్తున్నారు. ఇది ఎంతమాత్రమూ సరికాదు. ఆమోదయోగ్యం అసలే కాదు. బాధ్యతలు సజావుగా నిర్వర్తించడం చేతగానివాళ్లు తప్పుకుని ఇతరులకు దారివ్వాల్సి ఉంటుంది'' అంటూ కుండబద్దలు కొట్టారు. అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయి దాకా నాయకులంతా జవాబుదారీతనంతో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆదివారం కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ తొలి భేటీలో మాట్లాడిన ఆయన, నేతలనుద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు. ''పార్టీ పట్ల, దేశం పట్ల మనకున్న బాధ్యతల్లో అత్యంత ముఖ్యమైనది జవాబుదారీతనమే. పార్టీగా కాంగ్రెస్ పటిష్టంగా ఉండి ప్రజల అంచనాలను అందుకున్నప్పుడే మనం ఎన్నికల్లో నెగ్గగలం. దేశానికి, ప్రజలకు సేవ చేయగలం'' అని అభిప్రాయపడ్డారు. ఈ దృష్ట్యా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిలు తమ సొంత బాధ్యతలను, తమపై ఉన్న సంస్థాగత బాధ్యతలను సజావుగా నిర్వర్తించడంపై మరింతగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ''ప్రధాన కార్యదర్శులుగా, రాష్ట్రాల ఇన్‌చార్జిలుగా మీ బాధ్యతా పరిధిలో ఉన్న రాష్ట్రాల్లో కనీసం నెలకు 10 రోజులైనా పర్యటిస్తున్నారా? ప్రతి జిల్లా, ప్రతి యూనిట్‌లో పర్యటించారా? స్థానిక సమస్యలు తదితరాలపై లోతుగా ఆరా తీశారా? ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోండి'' అంటూ హితవు పలికారు. ''మీ పరిధుల్లోని రాష్ట్రాల్లో జిల్లా, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు పూర్తిస్థాయిలో ఏర్పాటయ్యాయా? జిల్లా, బ్లాక్ స్థాయిల్లో వీలైనంత మంది కొత్తవారికి అవకాశాలిచ్చారా? ఐదేళ్లుగా ఎలాంటి మార్పులూ చేయని జిల్లాలు, బ్లాక్‌లున్నాయా? ప్రజా సమస్యలపై అవి నిత్యం గళమెత్తుతున్నాయా? ఏఐసీసీ పిలుపు మేరకు స్థానిక సమస్యలపై ఎన్నిసార్లు ఆందోళనలు, ధర్నాలు చేశాయి?'' అంటూ ప్రశ్నలు సంధించారు. ''ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలు, పీసీసీ చీఫ్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులంతా కలిసి క్షేత్రస్థాయిలో 90 రోజుల పాటు కార్యాచరణకు విస్పష్టమైన బ్లూప్రింట్ సిద్ధం చేయాలి'' అని ఆదేశించారు. లేదంటే బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించనట్టేనని స్పష్టం చేశారు. ''సంస్థాగత ప్రక్షాళనకు, భారీ జనాందోళనలకు మీరంతా తక్షణం బ్లూప్రింట్ సిద్ధం చేస్తారని ఆశిస్తున్నా. అలా చేసి 15 నుంచి 30 రోజుల్లో సమర్పించండి. వాటిపై నాతో చర్చించండి'' అని ఆదేశించారు. స్టీరింగ్ కమిటీ నేతలు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారన్నారు.

జాతీయోద్యమంగా జోడో యాత్ర

భారత్ జోడో యాత్ర కూడా భేటీలో చర్చకు వచ్చింది. యాత్ర చరిత్ర సృష్టిస్తోందంటూ ఖర్గే కొనియాడారు. ''అధికార పార్టీ విద్వేష రాజకీయాలు, జనం నడ్డి విరుస్తున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక, సామాజిక అసమానతలపై నిర్ణాయక పోరుగా యాత్ర రూపుదిద్దుకుంటోంది. ప్రజల భాగస్వామ్యంతో జాతీయ జనాందోళనగా మారింది. యాత్ర సాధించిన అతి పెద్ద విజయమిది'' అన్నారు. దీన్ని ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఊరికీ తీసుకెళ్లడంలో కాంగ్రెస్ శ్రేణుల పాత్ర కీలకమంటూ కొనియాడారు. భేటీలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, సీనియర్ నేతలు కె.సి.వేణుగోపాల్, పి.చిదంబరం, ఆనంద్ శర్మ, మీరాకుమార్, అంబికా సోని, అశోక్ గెహ్లోట్, భూపేశ్ భగేల్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీ కూడా గైర్హాజరయ్యారు.

మోదీ ప్రభుత్వంపై నిప్పులు

ప్రజల ఆకాంక్షలపై, హక్కులపై మోదీ ప్రభుత్వం క్రూరంగా దాడి చేస్తోందంటూ ఖర్గే దుయ్యబట్టారు. ''హిమాచల్, గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన విద్వేషపు వ్యాఖ్యలు దేశాన్ని మరింతగా విభజించాయి. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మన భూభాగాన్ని ఆక్రమించాలన్న చైనా ప్రయత్నాలను తిప్పి కొట్టే దిక్కు లేదు. ఈ సమస్యల నుంచి దేశాన్ని వారిని కాపాడాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది'' అన్నారు.

ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్లీనరీ

మార్చి నుంచి 'చేయీ చేయీ కలుపుదాం'

కాంగ్రెస్ 85వ ప్లీనరీని వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఫిబ్రవరి ద్వితీయార్ధంలో జరిగే ఈ మూడు రోజుల ప్లీనరీలో పార్టీ అధ్యక్షునిగా ఖర్గే ఎన్నికకు ఆమోదముద్ర పడనుంది. ముగింపు నాడు భారీ బహిరంగ ఉంటుందని పార్టీ నేత కె.సి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. జనవరి 26న రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను ముగించాలని భావిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'చేయీ చేయీ కలుపుదాం' పేరుతో యాత్ర స్ఫూర్తిని మార్చి 26 దాకా దేశవ్యాప్తంగా కొనసాగించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగా గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో పాదయాత్రలు జరుగుతాయి. ప్రియాంకగాంధీ వద్రా సారథ్యంలో కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు రాష్ట్రాల స్థాయిలో ర్యాలీలు నిర్వహిస్తారు. జోడో యాత్ర ముగిశాక మోదీ ప్రభుత్వంపై రాహుల్ చార్జిషీట్ విడుదల చేయనున్నారు.

అప్పుడు పొగిడిన మీడియానే... నన్నిప్పుడు తిడుతోంది: రాహుల్



రాజస్తాన్‌లోని ఝులావార్‌లో రాహుల్ యాత్ర

ఝులావార్: తాను రాజకీయాల్లోకి వచ్చిన మొదట్లో 2004–08 కాలంలో పొగడ్తలతో ముంచెత్తిన మీడియా ఇప్పుడు తనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. ''భూ సేకరణకు సంబంధించిన అంశాలపై మాట్లాడినందుకే మీడియా ఒక్కసారిగా రూటు మార్చి నాపై దాడికి దిగింది. పేదలకు భూమి దక్కాలన్నందుకు నాపై భగ్గుమంది. మోదీ సర్కారు ప్రజల నుంచి భూములను లాగేసుకుంటోంది. నా ప్రతిష్టను దెబ్బ తీసేందుకు బీజేపీ నేతలు వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. అయితే నిజాన్నెవరూ అణచలేరు, దాచలేరు. బీజేపీ కుటిల ప్రయత్నాలు నాకు బలాన్నిచ్చాయి. మంచి పని చేసిన ప్రతిసారీ నాపై వ్యక్తిగత దాడులు పెరుగుతున్నాయి. అయినా నా మార్గాన్ని వదలలేదు. పోరాటాన్ని ఆపలేదు. ముందుకు సాగుతున్నా'' అన్నారు.

రాజస్తాన్‌లోకి జోడో యాత్ర

మధ్యప్రదేశ్‌లో 12 రోజులు సాగిన రాహుల్ భారత్ జోడో యాత్ర ఆదివారం కాంగ్రెస్ పాలిత రాజస్తాన్‌లోకి ప్రవేశించింది. సరిహద్దుల్లోని ఝులావాడ్ జిల్లాలో సీఎం అశోక్ గెహ్లోట్, ఆయన ప్రత్యర్థి సచిన్ పైలట్ ఇద్దరూ రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో 17 రోజులు, 500 కిలోమీటర్ల దూరం యాత్ర కొనసాగనుంది. యాత్రతో ఎంతో నేర్చుకున్నానని ఈ సందర్భంగా ఆయనన్నారు.

ఆయనకు కవల కాంతలు



ఫొటోలోని వరుని పేరు అతుల్. రింకీ, పింకీ అనే కవలలను ఇలా ఎంచక్కా పెళ్లాడాడు. మహారాష్ట్రలోని మాల్‌షిరాస్‌లో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో, ఫొటోలు వైరల్‌గా మారాయి. అయితే హిందూ వివాహ చట్టం ప్రకారం ఇలా ఒకరిని మించి పెళ్లాడటం నేరం కావడంతో దీనిపై కేసు నమోదైంది!

ఇరాన్‌లో 'నైతిక పోలీస్' రద్దు

హిజాబ్ వ్యతిరేక ఆందోళనలకు తలొగ్గిన సర్కార్



టెహ్రాన్: మహ్సా అమినీ (22) అనే కుర్దిష్ యువతి మరణంతో ఇరాన్ నెలలుగా కొనసాగుతున్న హిజాబ్ వ్యతిరేక ఆందోళనలకు ప్రభుత్వం తలొగ్గింది. న్యాయవ్యవస్థతో సంబంధం లేని నైతిక పోలీస్ వ్యవస్థను రద్దు చేసింది. ఒక మత కార్యక్రమంలో ఓ వ్యక్తి ప్రశ్నకు బదులుగా ఇరాన్ అటార్నీ జనరల్ ఈ మేరకు తెలిపినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ గణతంత్ర, ఇస్లామిక్ పునాదులు రాజ్యాంగబద్ధంగా స్థిరంగా ఉన్నాయని, అయితే అమలు విధానాలు సరళంగా ఉంటాయని అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ శనివారం వ్యాఖ్యానించారు.

హిజాబ్ సరిగా ధరించలేదని అమినిని నైతిక పోలీసులు సెప్టెంబర్ 16న అరెస్ట్ చేయడం, మూడు రోజుల తర్వాత ఆమె కస్టడీలోనే మరణించడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు రేగాయి. మహిళలకు కఠినమైన డ్రెస్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా నిరసనలు రాజుకున్నాయి. బలగాలు కాల్పుల్లో వందలాదిగా చనిపోయారు. అమిని పేరు, ఫొటో ప్రదర్శిస్తూ ఇరాన్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనల్లో పాల్గొన్న మహిళలు హిజాబ్‌ను కాల్చివేయడం, బహిరంగంగా జుత్తును కత్తిరించుకోవడం చేశారు.

నైతిక పోలీసింగ్ ఇలా మొదలైంది...

అతివాద అధ్యక్షుడు అహ్మదీ నెజాది హయాంలో 2006లో గస్త్–ఇ–ఇర్షాద్ (మార్గదర్శక పహారా) పేరుతో ఈ వ్యవస్థ ఏర్పాటైంది. ఇందులో భాగంగా మహిళలకు హిజాబ్ ధారణ తప్పనిసరి చేశారు. 15 ఏళ్ల క్రితం దాకా నైతిక పోలీసులు ముందుగా హెచ్చరించి, అయినా ఖాతరు చేయని మహిళలను అరెస్ట్ చేసేవారు. ఈ ప్రత్యేక బలగాల పాత్రపై మొదట్నుంచీ వివాదాలు నడుస్తున్నాయి. ఇరాన్ అధ్యక్షులుగా చేసిన వారిలోనే దీనిపై భిన్నాభిప్రాయాలుండేవి. మహిళల దుస్తుల నిబంధనలు కూడా మారుతూ వచ్చాయి. ఆధునిక భావాలున్న అధ్యక్షుడు రౌహానీ హయాంలో మహిళలు బిగుతైన జీన్స్, రంగురంగుల హిజాబ్ ధరించే వీలు కల్పించారు. కానీ సంప్రదాయ భావాలున్న రైసి ఈ ఏడాది జూలైలో పగ్గాలు చేపట్టాక నిబంధనలు కఠినతరమయ్యాయి. అన్ని ప్రభుత్వ విభాగాల్లోనూ మహిళలు హిజాబ్ ధరించడం తప్పనిసరి చేశారు.

కట్టేసి, కొట్టి చంపారు



తమిళనాడులోని మణికందంలో ఒక కోత మిల్లులో దొంగతనం చేశాడనే ఆరోపణలపై చక్రవర్తి అనే వ్యక్తిని చెట్టుకు కట్టి చచ్చేదాకా కొట్టిన దృశ్యం. దీంతో మిల్లు యజమాని, ఇద్దరు కార్మికులపై పోలీసులు హత్య కేసు నమోదుచేశారు.

నేడే రెండో దశ పోలింగ్

పట్టణాలు, పటేళ్లు నిర్ణయాత్మకం

- అహ్మదాబాదే అధికార బీజేపీకి కీలకం
- గుజరాత్ ఎన్నికలకు సర్వం సిద్ధం



రెండో దశ పోలింగ్ జరిగే జిల్లాలు

గుజరాత్ సమరం

పటేళ్లు, పట్టణాలు, పాడిపరిశ్రమ నిర్ణయాత్మక శక్తిగా ఉన్న గుజరాత్ రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మధ్య గుజరాత్‌లో బీజేపీ పట్టు కొనసాగుతున్నప్పటికీ ఆప్ నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఉత్తర గుజరాత్‌లో ఆప్ ఉనికి లేకపోయినప్పటికీ అధికార పార్టీకి ఎదురుగాలి వీస్తోంది. అందుకే ఈ దశ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అహ్మదాబాద్‌పై అత్యధికంగా దృష్టి పెట్టి ఉధృతంగా ప్రచారం చేశారు. బ్రాండ్ మోదీ నినాదంతో బీజేపీ, అధికార వ్యతిరేకతను నమ్ముకొని కాంగ్రెస్, ఆప్‌లు తలపడుతున్నాయి.

గుజరాత్ అసెంబ్లీ రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మధ్య, ఉత్తర గుజరాత్‌ల్లోని 14 జిల్లాల్లో 93 స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. 833 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేపీ, ఆప్ మొత్తం 93 స్థానాల్లో, కాంగ్రెస్ 90 చోట్ల, దాని మిత్రపక్షం ఎన్సీపీ మూడు స్థానాల్లో పోటీ పడుతున్నాయి. 255 మంది స్వతంత్రులూ బరిలో ఉన్నారు. 2.54 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరికోసం 14,975 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

బరిలో ఉద్యమకారులు

ఈ దఫా ఎన్నికల్లో కొన్ని హాట్ సీట్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పటీదార్ ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్, ఠాకూర్ల ఆందోళనల నేత అల్పేశ్ ఠాకూర్ బీజేపీ తరఫున, దళిత సమస్యలపై గళమెత్తిన జిగ్నేష్ మేవానీ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఘాట్‌లోడియా స్థానం నుంచి పోటీ పడుతూ ఉంటే, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన హార్దిక్ పటేల్ వీరమ్‌గామ్ అల్పేష్ కుమార్ గాంధీనగర్–సౌత్ నుంచి ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక జిగ్నేష్ మేవానీ వద్గమ్ నుంచి మరోసారి పోటీకి దిగారు. బీజేపీకి కనీసం నాలుగైదు స్థానాల్లో రెబెల్ అభ్యర్థులు సవాల్ విసురుతున్నారు. వఘోడియా, పాద్రా, బయాడ్, నాందోడ్‌లలో రెబెల్స్ పార్టీకి తలనొప్పిగా మారారు.

16 ముస్లిం ప్రాబల్యం స్థానాలు కీలకం

అహ్మదాబాద్‌లోని ముస్లింల ప్రాబల్యం ఉన్న 16 స్థానాలు బీజేపీకి అత్యంత కీలకంగా మారాయి. వీటిలో నాలుగు స్థానాల్లో ఎంఐఎం అభ్యర్థుల్ని నిలబెట్టడంతో చతుర్ముఖ పోటీ నెలకొంది. గుజరాత్ మతఘర్షణలో అత్యాచార బాధితురాలు బిల్కిస్ బానో దోషుల్ని శిక్షాకాలం కాక ముందే విడుదల చేయడం కూడా అధికార పార్టీకి మైనస్‌గా మారింది. దీంతో ఓట్లు చీలిపోయి ఎవరికి లబ్ధి చేకూరుతుందా అన్న ఆందోళన కమలనాథుల్లో ఉంది. గుజరాత్ మోడల్ పాలనతో అత్యధిక ప్రయోజనం పొందిన అహ్మదాబాద్ దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉంటూ వస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అహ్మదాబాద్ జిల్లాలో అయిదు స్థానాలు దక్కించుకోవడం, పట్టణ ప్రాంతాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ బలపడడం బీజేపీకి సవాల్‌గా మారాయి. అందుకే ప్రచారంలో ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో వరసగా రెండు రోడ్ షోలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓటుపై ఉదాసీనత

డిసెంబర్ 1న జరిగిన తొలి దశ పోలింగ్‌లో ఓటు వెయ్యడానికి ప్రజల్లో ఒక రకమైన ఉదాసీనత కనిపించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలైన సూరత్, రాజ్‌కోట్, జామ్‌నగర్‌లలో ఓటింగ్ అత్యంత స్వల్పంగా జరిగింది. మొత్తమ్మీద 63.3% పోలింగ్ నమోదైంది. పట్టణాలకు, గ్రామాలకి మధ్య పోలింగ్‌లో 35% వరకు తేడా ఉంది. అహ్మదాబాద్, ఆనంద్, వడోదరా, గాంధీనగర్, గోధ్రా వంటి నగరాల్లో రెండో దశ పోలింగ్ ఉండడంతో ఓటర్లు ఉదాసీనంగా వ్యవహరించవద్దని, తమ ఓటు హక్కుని వినియోగించుకోవడానికి ఓటర్లందరూ ముందుకు రావాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం అహ్మదాబాద్‌లో ఓటు వేయనున్నారు.

రెండో దశ పోలింగ్ జరగనున్న జిల్లాల్లో 2017లో ఏ పార్టీకి ఎన్ని సీట్లొచ్చాయంటే...

మధ్య గుజరాత్

జిల్లా	సీట్లు	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
అహ్మదాబాద్	21	15	6	-
ఆనంద్	7	2	5	-
ఖేడా	7	3	4	-
మహిసాగర్	2	1	-	1
పంచమహల్	5	4	-	1
దాహోద్	6	3	3	-
వడోదరా	10	8	2	-
చోటా ఉదేపూర్	3	1	2	-
మొత్తం	61	37	22	2

ఉత్తర గుజరాత్

జిల్లా	సీట్లు	బీజేపీ	కాంగ్రెస్
బనస్‌కాంత	9	3	6
పటాన్	4	1	3
మెహసానా	7	5	2
సబర్‌కాంత	4	3	1
అరావళి	3	0	3
గాంధీనగర్	5	2	3
మొత్తం	32	14	18

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 5 । డిసెంబర్ । 2022



తిరుపతమ్మకు బంగారు గొలుసు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మకు ఆదివారం వత్స వాయి మండలం ఆళ్లూరుపాడుకు చెందిన యలమద్ది మురళి. సాయి ప్రనూష కుటుంబం రూ.68 వేల విలువైన బంగారు గొలుసును అందజేశారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.

నేడు స్పందన

గాంధీనగర్: ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మేడం ప్రెసిడెంట్.. మళ్లీ రండి

సందడిగా రాష్ట్రపతి పర్యటన

- ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికిన గవర్నర్ బిశ్వభూషణ్, సీఎం వైఎస్ జగన్
- రాష్ట్ర ప్రజల తరఫున పౌర సన్మానం చేసిన ముఖ్యమంత్రి
- రాష్ట్రపతి గౌరవార్థం రాజ్‌భవన్‌లో విందు ఇచ్చిన గవర్నర్
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు
- పర్యవేక్షించిన రెండు జిల్లాల కలెక్టర్లు



గన్నవరంలోని విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం పలుకుతున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి రోజా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన విజయవాడలో ఆద్యంతం సందడిగా సాగింది. రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న ద్రౌపది ముర్ముకు గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి రాష్ట్రపతి కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని మురళీ రిసార్ట్‌కు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రపతికి ఘనంగా పౌర సన్మానం చేశారు. మహిళ సాధికారతకు రాష్ట్రపతి నిదర్శనమని కొనియాడారు. మేడంను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రంలోని మహిళలకు సూచించారు. ఈ పౌర సన్మానంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో విందు..

రాష్ట్రపతి గౌరవార్థం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ విందు ఇచ్చారు. గవర్నర్ దంపతులు, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్. భారతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ముర్మును ముఖ్యమంత్రి దంపతులు సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖకు బయలుదేరి వెళ్లారు. వీడ్కోలు పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ జాషువా ఉన్నారు.

సమన్వయంతో విజయవంతం..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఏర్పాట్లను రెండు జిల్లాల కలెక్టర్లు రంజిత్ బాషా, ఢిల్లీరావులు సమన్వయంతో పర్యవేక్షించారు. ప్రొటోకాల్ ప్రకారం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసి, సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. పర్యటనకు సంబంధించి మొదటి నుంచి ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల ముఖ్య సమన్వయకర్త తలశిల రఘురాం, ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. నగరంలో రోడ్ల వెంబడి పచ్చదనం ఉట్టిపడేలా చేయడం, రోడ్లను శుభ్రం చేయడంలో నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ కీలక భూమిక పోషించారు.

పటిష్ట బందోబస్తు..

రెండు జిల్లాల్లో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా, కృష్ణా జిల్లా ఎస్పీలు సమన్వయంతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దాదాపు 1,700 మందికి పైగా పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. వీరితో పాటు ఏపీఎస్పీ, ఆక్టోపస్ బలగాలు, క్యూక్ యాక్షన్ టీం, రోప్ పార్టీ బలగాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. గన్నవరంలో ఏర్పాట్లను కృష్ణా ఎస్పీ జాషువా, పౌరసన్మానం వేదిక వద్ద ఏర్పాట్లను ఏలూరు ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, ఎస్కార్ట్ అధికారిగా డీసీపీ మేరీ ప్రశాంతి, విజయవాడ నగరంలో ఇన్‌చార్జిగా డీసీపీ విశాల్ గున్ని పర్యవేక్షించారు.



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణా కలెక్టర్ రంజిత్ భాషా, చిత్రంలో విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి



పోరంకిలో నిర్వహించిన రాష్ట్రపతి సత్కార సభకు హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులు

ఘంటసాలకు భారతరత్న వచ్చేలా కృషి



ఘంటసాల విగ్రహానికి అంజలి ఘటిస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారతరత్న వచ్చేలా కృషి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆదివారం ఘంటసాల శతజయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తొలుత ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి శత జయంతి వేడుకలను మంత్రి రోజా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగువారు ఉన్నంత కాలం ఘంటసాల స్వరం వినిపిస్తూనే ఉంటుందన్నారు. ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కణాచి అని ఎందరో మహనీయులు ఇక్కడ జన్మించి జిల్లా వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అందులో ఘంటసాల ఒకరని, వారి సేవలను ప్రభుత్వం మరచిపోదన్నారు. అనంతరం ఏపీ సృజనాత్మక సమితి సీఈవోఆర్ మల్లికార్జునరావు చిత్రించిన ఘంటసాల నిలువెత్తు చిత్రపటాన్ని మంత్రి రోజా ఆవిష్కరించారు. ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి శర్వాణీ మూర్తి, వివిధ కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కరాటే పోటీల్లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: సీఎం కప్, ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే రాష్ట్ర స్కూల్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ షిటోరియు కై ఇంటర్నేషనల్ కరాటే దో అకాడమీ ఆధ్వర్యాన గుంటూరులోని ఎన్టీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజయవాడ ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కటా, కుమితే వ్యక్తిగత విభాగాల్లో 11 బంగారు, 15 రజత, 20 కాంస్య పతకాలు కైవసం చేసుకోవడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.ప్రవీణ్ అభినందించారు.

యూత్ పార్లమెంట్‌కు నరసాపురం యువతి



విస్సన్నపేట(తిరువూరు): యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి విస్సన్నపేట మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన పిండి నాగేశ్వరరావు కుమార్తె పిండి ఝాన్సీ లక్ష్మి ఎంపికైంది. ఈ మేరకు ఆదివారం ఝాన్సీ లక్ష్మి ఢిల్లీ పార్లమెంట్ భవనాన్ని సందర్శించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. సంస్కరణల వైపు యువతను మళ్లించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాలో 94.43 శాతం పెన్షన్ పంపిణీ



చిట్టినగర్‌లో రామలక్ష్మయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు రోజులుగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేస్తున్నారు. ఆదివారం వరకూ 94.43 శాతం మందికి నగదు అందజేశారు. మొత్తం 2,25,834 మంది పెన్షనర్లకు గాను 2,13,253 మందికి పెన్షన్ పంపిణీ చేశారు. జి.కొండూరు మండలంలో 99.11 శాతం, వీరులపాడులో 98.77, నందిగామ, రెడ్డిగూడెం మండలాలలో 98.73 శాతం పంపిణీ చేశారు.

ఉత్సాహంగా శాప్ లీగ్ చెస్ టోర్నీ



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) లీగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. ఏడు రౌండ్లలో జరిగిన ఈ పోటీల పురుషుల విభాగంలో వై.రమ్యశేఖర్, టి.నాగ ఉదయ్, ఆర్. ఆదిత్య, కేజర్ డేవిడ్, శివదత్త. మహిళల విభాగంలో వైనిశ్చల, శివశరణ్యనాయుడు, యశస్విని, సుచిత్రక్రిష్టి, టి.శ్రీలాస్య వరుసగా ఒకటి,రెండు, మూడు,నాలుగు స్థానాలు సాధించారు. విజేతలకు రాష్ట్ర ప్లానింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శాప్ ఎండీ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్, ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ పర్యవేక్షించారు.

దూర విద్య తరగతులు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం అజంతకుమార్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆదివారం దూర విద్య తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

వడివడిగా స్మార్ట్ అడుగులు

కృష్ణా వర్సిటీలో సరికొత్త కోర్సులు

- విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుతో పాటు, నాణ్యమైన చదువులకు ప్రాధాన్యం
- డిగ్రీలో ఇంటర్న్‌షిప్ పటిష్టంగా అమలు
- 'సాక్షి'తో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మంగళపూడి రామిరెడ్డి



మచిలీపట్నం: ఉపాధి, ఉద్యోగ అవకాశాల సాధనే లక్ష్యంగా ఉన్నత విద్యలో సమూల మార్పులు చేపట్టాలనే ప్రభుత్వ ఆదేశాలతో కృష్ణా యూనివర్సిటీలో సరికొత్త కోర్సుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు. 'స్మార్ట్ స్కిల్స్' పేరుతో కొత్త కాన్సెప్ట్ తీసుకొచ్చారు. ఇటువంటి ప్రయోగాత్మక కార్యక్రమాలను అమలు చేయటం యూనివర్సిటీ చరిత్రలో ఇదే తొలిసారి అని రిజిస్ట్రార్ డాక్టర్ మంగళపూడి రామిరెడ్డి తెలిపారు. డిగ్రీ ప్రవేశాలు పూర్తయినందున వర్సిటీ క్యాంపస్‌తో పాటు, అనుబంధ కాలేజీల్లో చదువులకు సన్నద్ధత చేసే అంశాలపై శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఫేజ్ రికగ్నైజేషన్‌తో హాజరు..

యూనివర్సిటీ క్యాంపస్, అనుబంధ కాలేజీలు 120 వరకు ఉండగా, ఇందులో యూజీ, పీజీ కోర్సులు కలుపుకొని 45 వేలు మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులందరినీ కాలేజీలకు రప్పించేలా ఫేస్ రికగ్నైజేషన్ హాజరు అమలు చేస్తున్నాం.

పక్కాగా ఇంటర్న్‌షిప్..

ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా కృష్ణా జిల్లాల్లో ఉన్న వనరుల దృష్ట్యా ఫిషరీస్ సంబంధిత కోర్సులకు డిగ్రీలో ప్రాధాన్యం ఇస్తున్నాం. నూతన విద్యావిధానానికి అనుగుణంగా డిగ్రీ స్థాయిలో ఇంటర్న్‌షిప్ పటిష్టంగా అమలు చేస్తున్నాం. మూడేళ్ల కోర్సులో పది నెలలు తప్పనిసరిగా దీన్ని చేయాలి. విద్యార్థులకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సామాజిక పరిస్థితులపై అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తున్నాం.

పుస్తక పఠనం వైపు..

సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూనే, పుస్తకాలు కూడా చదవటం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. అందుకనే ప్రతి కాలేజీలో పుస్తక పఠనం కోసం ఏర్పాట్లు చేశాం. 'లుక్ ఆఫ్ ద బుక్' పేరిట ప్రతి శుక్రవారం దీని కోసమని సమయం కేటాయించేలా షెడ్యూల్ ఇచ్చాం.

యాప్ సాయంతో..

'స్మార్ట్ స్కిల్' పేరిట పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఢిల్లీ స్థాయిలోని ఓ పేరొందిన సాఫ్ట్‌వేర్ సంస్థతో ఉన్నత విద్యామండలి చేసుకున్న ఒప్పందం మేరకు స్మార్ట్ క్లాసులు నిర్వహిస్తున్నాం. దీని కోసం ప్రత్యేకంగా యాప్ రూపొందించాం. విద్యార్థులు తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, తరగతులకు హాజరుకావొచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్లతో విద్యార్థుల ముంగిటకు ప్రపంచం వచ్చేసింది. అందుకనే 'మైక్రో సాఫ్ట్ ఆఫ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్' పేరిట ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టాం. ఉన్నత విద్య చరిత్రలో ఇటువంటి కార్యక్రమం ఇదే తొలిసారి. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఉన్నత విద్యామండలి పెద్దలు దీనిపై ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ఆన్‌లైన్ కోర్సు పూర్తి చేసిన వారికి పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్ అందజేస్తారు. ఇది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు వెళ్లే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రయోగాలతో ప్రయోజనం..

విద్యా కార్యక్రమాలు అమలుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూపుతున్న శ్రద్ధతో ఉన్నత విద్యామండలి పెద్దలు ప్రయోగాలకు సిద్ధమయ్యారు. చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి, వైస్ చాన్సలర్ కేబీ చంద్రశేఖర్ సూచనలకు అనుగుణంగా వర్సిటీ విభాగాధిపతుల అందరి సమన్వయంతో వీటిని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేలా దృష్టి పెట్టాం. విద్యార్థులకు మేలు చేకూర్చేలా చూడాల్సిన గురుతర బాధ్యత కాలేజీల నిర్వాహకులపై ఎంతైనా ఉంది. అందరూ సమన్వయంతో పనిచేస్తేనే అనుకున్న లక్ష్యాలను సాధించగలం.





జయహో బీసీ.. ఏర్పాట్లు షురూ

'వెనుకబడిన కులాలే వెన్నెముక' అనే నినాదంతో ఈ నెల ఏడవ తేదీన జరగనున్న 'జయహో బీసీ మహాసభ' కార్యక్రమానికి బెజవాడ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో వేదిక, ఇతర ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. వేలాది మంది ప్రతినిధులు ఆశీనులు కావడానికి అనువుగా విశాలమైన షెడ్ ఏర్పాటు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తులతో కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి

దుర్గమ్మ ఆశీస్సుల కోసం నవదంపతుల క్యూ



క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శుభముహూర్తాన ఒక్కటైన నవ దంపతులు అమ్మవారి ఆశీస్సుల కోసం ఆదివారం ఇంద్రకీలాద్రికి తరలి వచ్చారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని తరించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. శనివారం రికార్డు స్థాయిలో వివాహాలు జరిగిన నేపథ్యంలో ఉదయం నుంచి నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెళ్లి దుస్తులతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గాలిగోపురం వద్ద ఓ మహిళ, ఓ వృద్ధురాలు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆలయ సిబ్బంది వారిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని హెల్త్ సెంటర్‌కు తరలించి వైద్యసాయం అందించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచే కొండపైకి ద్విచక్ర వాహనాల మినహా ఇతర వాహనాలను అనుమతించలేదు. భక్తులు తమ కార్లు, మినీ వ్యాన్‌లను హెడ్ వాటర్ వర్క్స్, కనకదుర్గానగర్‌లో నిలుపుకున్నారు. ఉదయం 10 గంటల లోపు కనకదుర్గానగర్ నిండిపోగా, వీఎంసీ కార్యాలయం వద్ద నిలుపుకున్నారు.

కిటకిటలాడిన క్యూలైన్లు..

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. ఘాట్‌రోడ్డు, మహా మండపం మెట్లు, లిఫ్టు మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ.300, రూ. 500 టికెట్లను కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయగా, రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

'ప్రోగ్రెసివ్' ప్రభంజనం



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఉద్యోగులు



ఓటు వేస్తున్న ఉద్యోగి

వీఎంసీ ఎంప్లాయీస్ కో– ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సంఘం ఎన్నికల్లో విజయం

పటమట(విజయవాడతూర్పు): ది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సంఘం ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ వరుసగా రెండో సారి విజయం సాధించింది. 11 మంది డైరెక్టర్ల నియామకానికి జరిగిన ఎన్నికల్లో 10 మంది ప్రోగ్రెసివ్ ప్యానల్ అభ్యర్థులే గెలుపొందారు. హనుమాన్‌పేటలోని జంధ్యాల దక్షిణామూర్తి పాఠశాలల్లో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 1,536 ఓట్లకు 1,232 ఓట్లు పోలయ్యాయి. 11 మంది డైరెక్టర్ పదవులకు మూడూ ప్యానళ్ల నుంచి 37 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మూడు బూత్‌లలో జరిగిన ఈ ఎన్నికల్లో బూత్–1లో 536 ఓట్లకు 428 ఓట్లు పోలవ్వగా, బూత్–2లో 500 ఓట్లకు 416, బూత్–3లో 500 ఓట్లకు 388 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి, రిటైర్డ్ డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఎంజే ఏసుదాసు తెలిపారు.

'ప్రోగ్రెసివ్' దూకుడు..

సాయంత్రం 3 గంటల నుంచి జరిగిన ఓట్ల లెక్కింపు 16 రౌండ్లలో జరిగాయి. ఇందులో ప్రోగ్రెసివ్ ప్యానల్ ఆది నుంచి లీడ్‌లో కొనసాగింది. ఈశ్వర్ ప్యానల్లో ఈశ్వర్‌తోపాటు శానిటరీ సూపర్‌వైజర్ శివరాంప్రసాద్, ప్రకాష్ సాగర్ తొలుత లీడ్‌లో ఉన్నా.. తర్వాత ఈశ్వర్ ఒక్కరే ఆధిక్యం సంపాదించారు. వీఎంసీ ఆల్ ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ఏడుగురు అభ్యర్థులు, మరో ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నా.. అంతగా ఓటర్లను ప్రభావితం చేయలేకపోయారు.



ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

విజేతలు వీరే

- ప్రోగ్రెసివ్ ప్యానల్: గుంజా అజయ్‌కుమార్(జూనియర్ అసిస్టెంట్), గుర్రం ఆంజనేయులు(శానిటరీ ఇన్‌స్పెక్టర్), భూపతి గోవిందరావు(జూనియర్ అసిస్టెంట్), గుంటక ప్రభాకర్(టీచర్), తాడిశెట్టి నాగరాజు (ఆఫీస్ సబార్డినేట్), తిమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి (శానిటరీ ఇన్‌స్పెక్టర్) , తోపుల శివశంకర్ (టీచర్), వేజండ్ల ప్రభావతి (సూపరింటెండెంట్), బచ్చు రాజేష్ (టీచర్), సింహాద్రి మస్తాన్ రావు(టీచర్)
- ఈశ్వర్ ప్యానల్: ఈశ్వర్(సీనియర్ అసిస్టెంట్)

క్లుప్తంగా

భార్యతో వివాదం భర్త ఆత్మహత్య



పెనమలూరు: భార్యతో వచ్చిన మనస్పర్ధల కారణంగా మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన గంగూరులో జరిగింది. పెనమలూరు పోలీసులు ఆదివారం వివరాలు వెల్లడించారు. గంగూరుకు చెందిన గొల్లపల్లి సురేంద్ర (26) కొద్ది సంవత్సరాల క్రితం సురేఖను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. సురేంద్ర ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. భార్యభర్తలకు కొన్నాళ్ల కిందట మనస్పర్ధలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో మనస్తాపానికి గురైన సురేంద్ర శుక్రవారం పేరాసెటమిల్ మందు బిళ్లలు అధిక మోతాదులో మింగాడు. దీంతో అతను అపస్మారకస్థితికి చేరటంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న అతను శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు శేఖర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం కథనం మేరకు పల్నాడు జిల్లా అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన జి.దుర్గారావు(23) అనే వ్యక్తి మండలంలోని కీసర గ్రామానికి చెందిన యువతిని నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. శనివారం కీసరకు వచ్చిన దుర్గారావు, భార్యతో ఘర్షణ పడ్డాడు. అనంతరం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని వైద్యం కోసం ప్రయివేటు వాహనంపై నంది గామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాహిత్యంలో సమాజ జీవితం కనిపించాలి

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



పురస్కారాల గ్రహీతలతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, పిచ్చయ్య చౌదరి

విజయవాడ కల్చరల్: సాహిత్యంలో సమాజ జీవితం కనిపించాలని, కవులు, రచయితలు అందుకోసం కృషి చేయాలని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ సూచించారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ స్థానిక గాంధీనగర్ ఎన్జీవో హోమ్‌లో ఆదివారం తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన మహిళలకు 12 వ జాతీయ సాహిత్య పురస్కారాల కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ తెలుగు జాతి, తెలుగు సాహిత్యం, తెలుగు భాష గొప్పవని వాటిని కాపాడుకోవడానికి రచయితలు కృషి చేయాలన్నారు. రామాయణ, భారతాల నుంచి నేటి వరకు పరిశీలిస్తే సాహిత్యంలో అనేక మార్పులు కనిపిస్తాయన్నారు. కవులు, రచయితలు సమాజ నిర్దేశకులని వారు సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలని సూచించారు. కవితా విద్యా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తమ కుమార్తె కవిత పేరుతో సంస్థను స్థాపించామని 12 సంవత్సరాలుగా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న సాహితీవేత్తలకు పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. గజల్ రచయిత్రి డాక్టర్ ఎంబీడీ శ్యామల సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. కందుకూరి నవలా పురస్కారాన్ని ఎంఆర్ అరుణ కుమారికి, గురజాడ కథా పురస్కారాన్ని భండారు విజయకు, శ్రీశ్రీ కవితా పురస్కారాన్ని పద్మావతి రాంభక్తకు, జానుమద్ది హనుమత్ శాస్త్రి పురస్కారాన్ని ఆచార్య కిన్నెర శ్రీదేవికి, డాక్టర్ రావూరి భరద్వాజ పురస్కారాన్ని సమ్మెట ఉమాదేవికి వాసిరెడ్డి పద్మ చేతులమీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కలిమిశ్రీ, డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్, వేంపల్లి షరీఫ్, బంగ్రారాజు కంఠ, గంగవరపు సునీత పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు వాసిరెడ్డి పద్మను ఆత్మీయంగా సత్కరించారు.

వైభవంగా ప్రారంభమైన మన్యసూక్త హోమాలు

కనుల పండువగా స్వామివార్ల ఊరేగింపు



మచిలీపట్నం ప్రధాన రహదారిలో రథోత్సవం

మచిలీపట్నంటౌన్: శ్రీ లక్ష్మీనారాయణ మహాక్రతువు మన్యసూక్త హోమం కార్యక్రమం ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. హోమాల ప్రారంభానికి ముందు స్థానిక జిల్లాకోర్టు నుంచి సీతారామ లక్ష్మణ విగ్రహాలను రథంపై ఉంచి ప్రధాన రహదారుల గుండా ఊరేగిస్తూ హోమాలు జరిగే హిందూ కళాశాల ఆవరణకు చేరారు. రథం ముందు మంగళవాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, హనుమంతుని వేషధారణ, కోలాట ప్రదర్శనలతో ముందుకు సాగారు. రుత్వికుల వేదమంత్రాల మంత్రోచ్చారణతో ముందుకు సాగిన ఈ ఊరేగింపు జిల్లా కోర్టు సెంటర్ నుంచి ప్రధాన రహదారి గుండా కోనేరుసెంటర్ చేరుకుని అక్కడి నుంచి కోటవారితుళ్ల సెంటర్, బుట్టాయిపేట, రామానాయుడుపేట మీదుగా యాగశాలలు ఏర్పాటు చేసిన కళాశాల ప్రాంగణానికి చేరింది. అనంతరం 108 కుండలాల్లో హోమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ హోమ కార్యక్రమాలు ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. హోమాల అంకురార్పణ ఆదివారం జరగ్గా సోమవారం నుంచి త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. కార్యక్రమాలను నిర్వాహక కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

రవాణాశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రవాణాశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం

విజయవాడ స్పోర్ట్స్: రవాణాశాఖ నాన్ టెక్నికల్ ఉద్యోగుల రాష్ట్ర సంఘం ఎన్నికలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందరు రోడ్డులోని రవాణా శాఖ ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఐ.రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా వి.ఉమామహేశ్వరి, కోశాధికారిగా ఎం.ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాస్, యు.బీనాకుమారి, పి.అనురాధ, వి.రాకేష్ మధుకర్‌బాబు, ఎం.ఆర్.ఎం.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.జయప్రకాష్, సయ్యద్ కరిముల్లా, బి.అనురాధ, ఎ.బాలరాజు, ఇ.రమాదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎ.విద్యాసాగర్, సహాయ ఎన్నికల అధికారిగా ఇక్బాల్, పరిశీలకుడిగా రంజిత్‌కుమార్‌నాయుడు వ్యవహరించారు.

వ్యర్థాలతో సుగంధభరితాలు

- పూలదండలతో అగర్‌బత్తీలు... గోమయంతో ధూప్‌స్టిక్స్ తయారీ
- శ్రీతిరుపతమ్మ అగర్‌బత్తీలు బ్రాండ్‌తో విక్రయం



గోమూత్రం, గోమయంతో తయారైన ధూప్‌స్టిక్‌లు



పూలు, పూలదండలతో తయారైన అగర్‌బత్తీలు

పెనుగంచిప్రోలు: పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో స్వామివారు, అమ్మవార్లకు అలంకరించిన పూల దండలు సాయంత్రానికి వ్యర్థాలుగా పడవేసేవారు. అయితే ప్రస్తుతం తిరుపతి, శ్రీశైలం వంటి రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలతో పాటుగా తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కూడా వాటిని వ్యర్థాలుగా పడవేయకుండా సుగంధ భరితమైన అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నారు. వీటిని విక్రయించటం ద్వారా ఆలయానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు ఆదాయం కూడా సమకూరుతోంది.

గోశాల ద్వారా నామమాత్రమైన ఆదాయం...

అమ్మవారి ఆలయానికి చెందిన గోశాలలో సుమారు 100 వరకు గోవులు, దూడలు ఉన్నాయి. వీటి నిర్వహణకు గాను ఏడాదికి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. గోవుల ద్వారా వచ్చిన కోడెదూడల విక్రయంతో నామమాత్రపు ఆదాయం నాలుగైదేళ్లకు ఒకసారి వస్తుంది. ఇక గోమూత్రం వృథాగా పోతుంది. గోమయం మాత్రం దేవస్థానంకు చెందిన భూములకే ఎరువుగా వాడుతున్నారు. అయితే పూలు, గోమూత్రం, గోమయంను ఇతర ఆలయాల్లో ఎలాగైతే ఆదాయ వనరుగా మార్చుకున్నారో అదేవిధంగా ఇక్కడ కూడా ఆదాయ వనరుగా మార్చుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో మొదటి ఏడాదే కాంట్రాక్టుకు ఇవ్వటం ద్వారా ఆలయానికి రూ.4.85 లక్షల ఆదాయం సమకూరింది.

తయారీ విధానం....

ఆలయంలో అమ్మవార్లు, స్వామివార్లకు అలంకరించిన పూలు, పూల దండలను సాయంత్రానికి కాంట్రాక్టరు సమీకరించుకుని తీసుకెళ్లి నాలుగైదు రోజుల పాటు ఎండలో ఎండ బెడతారు. తరువాత యంత్రంలో పొడి చేసి మరలా ఎండబెట్టి సుగంధ ద్రవ్యాలు కలిపి పుల్లకు చుట్టి ఎండబెడతారు. అనంతరం తయారైన అగర్‌బత్తీలను ప్యాకింగ్ చేస్తారు. అలాగే ధూప్‌స్టిక్స్ తయారీకి గోమయం, గోమూత్రంలో సుగంధ ద్రవ్యాలు కలిపి తయారు చేస్తారు. హోమాలకు పిడకలు కూడా తయారు చేస్తున్నారు.

శ్రీతిరుపతమ్మ బ్రాండ్‌తో విక్రయం...

తయారు చేసిన అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్‌ను శ్రీతిరుపతమ్మవారి బ్రాండ్ పేరుతో ఆకర్షణీయంగా ప్యాకెట్లపై ఆలయ ఫొటో, అమ్మవారి ఫొటోతో విక్రయిస్తున్నారు. ఇందుకోసం ఆలయం లోపల ప్రత్యేక స్టాల్‌ను అందంగా తీర్చిదిద్దారు. అగర్‌బత్తీలు చందనం, సంపంగి, పారిజాతం, తులసి, ధూప్‌స్టిక్స్ చందనం, సంపంగి, పారిజాతం, మల్లి తదితర సువాసనలతో తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటితో పాటు గోమయంతో చేసిన పిడకలు, పిడకలతో తయారు చేసిన విభూది, కుంకుమ, సాంబ్రాణి విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రకాల సుగంధ ద్రవ్యాలతో తయారైన ఒక్కోదానిలో 40 పుల్లలు కలిగిన నాలుగు అగర్‌బత్తీల ప్యాకెట్లు రూ.200, ఒక్కొక్కటి అయితే రూ.50, ధూప్‌స్టిక్ ప్యాకెట్ రూ.100కు విక్రయిస్తున్నారు. భక్తులు కూడా సరసమైన ధరలతో విక్రయిస్తున్న అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్‌పై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రూ.4,85 లక్షల ఆదాయం



గతంలో వ్యర్థాలుగా మిగిలిపోయే పూలు, పూల దండలు, గోమూత్రం, గోమయం ద్వారా ఆలయానికి అదనపు ఆదాయం సమకూరింది. మొదటి ఏడాది రూ.4.85 లక్షల ఆదాయం సమకూరింది. రెండో ఏడాది నుంచి 10 శాతం పెరగనుంది. ఐదేళ్ల పాటు ఈ ఒప్పందం కొనసాగనుంది.

–ఇంజం చెన్నకేశవరావు, ఆలయ ఛైర్మన్

అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రుక్మాంగదయ్య



గిరిజన విద్యార్థులతో గిరిజన సంక్షేమ శాఖాధికారి రుక్మాంగదయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటి సమాజంతో పోటీ పడాలంటే విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎం.రుక్మాంగదయ్య అన్నారు. బావాజీపేటలోని నవజీవన్ బాల భవన్‌లో గిరిజన విద్యార్థులు, యువతకు నాయకత్వ లక్షణాలు, సాఫ్ట్ స్కిల్స్‌పై ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత చదవులు అభ్యసించి, తమ కాళ్లపై తాము నిలబడాలని, కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పిల్లలను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతూ వారిని సమాజంలో భాగస్వాములను చేస్తున్న నవజీవన్ బాలభవన్ కృషిని అభినందించారు. గిరిజన పిల్లలకు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు వంటి లైఫ్ డాక్యుమెంట్స్ జారీ చేయించడంలో నవజీవన్ బాలభవన్ ముందుందని అన్నారు. అనంతరం జాన్ అలెగ్జాండర్ విలియమ్స్ 150 మంది గిరిజన విద్యార్థి, యువతకు నాయకత్వ లక్షణాలు, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. నవజీవన్ ప్రోగ్రాం మేనేజర్ శీలం జోసఫ్ డొనాల్డ్, కో–ఆర్డినేటర్స్ ఎస్‌కే నజ్మా, పి.ఝాన్సీరాణి, సుజాత పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆరు పాడి గేదెలు మృతి

– రూ.6 లక్షల నష్టం

కంచికచర్ల: మేతకు వెళ్లి వస్తున్న పశువులను వేగంగా వస్తున్న లారీ ఢీకొనగా ఆరు గేదెలు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన బి.రాధాకృష్ణకు చెందిన పశువులు పొలాల్లోని మేతకు వెళ్లి జాతీయ రహదారిపై ఇంటికి తిరిగి వస్తుండగా విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్లేందుకు వేగంగా వస్తున్న లారీ 8 గేదెలను ఢీకొంది. ఈ ఘటనలో ఆరు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. రైతుకు నష్టం రూ.6 లక్షలు ఉంటుందని అంచనా. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవులను తరలిస్తున్న కంటైనర్ స్వాధీనం

పెదకాకాని: అక్రమంగా తరలిస్తున్న గోవుల కంటైనర్ లారీని పోలీసులకు అప్పగించారు. సంతల్లో ఆవులను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన గోసంరక్షకులు కాజ టోల్ ప్లాజా సమీపంలో కంటైనర్ లారీని అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు తాళ్లాయపాలెం శివాలయం పీఠాధిపతి శివస్వామికి తెలియజేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసుస్టేషన్‌కు తరలించారు. గోవులను అక్రమంగా తరలిస్తున్నవారిపై కేసు నమోదు చేయాలని, గోవులను సంరక్షించాలని శివస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా తరలిస్తున్న 40 ఆవులను గుంటూరు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణశాలకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన నిందితులు మహమ్మద్ కలీం, షంషాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆంగ్ల విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేనికి ఘన సన్మానం



ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని దంపతులను సత్కరిస్తున్న విజయభూషణ్ కుమార్

గన్నవరం రూరల్: ఇంగ్లిష్ మీడియం చదువులతో విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం అవుతుందని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి పుణ్య చారిటీస్ వృద్ధాశ్రమంలో కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి దంపతులకు ఘన సన్మానం జరిగింది. శ్రీనివాసరావుతో చిన్ననాటి నుంచి కలసి చదువుకున్న సహచరులు, పాఠాలు చెప్పిన గురువులు, మిత్రులు పాల్గొని మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదువులలో, సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండి అందరికీ ఆదర్శంగా నడిచేవారని, క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పారు. ఆనాటి అనుభూతులను గుర్తు తెచ్చుకున్నారు. రైట్ మ్యాన్ ఇన్ ది రైట్ ప్లేస్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేనిని నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు. జర్నలిస్టుగా వివిధ హోదాలలో పని చేయటంతో పాటు నిర్భయంగా, నిర్మొహమాటంగా వ్యవహరించటం ఆయనకు అలవాటు అని అన్నారు. కొమ్మినేని మాట్లాడుతూ తాను వృత్తి రీత్యా గత నాలుగు దశాబ్దాలలో ఎంతో మంది దేశ నాయకులను, సీఎంలను ఇంటర్వ్యూలు చేశానని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు అంకిత భావంతో కృషి చేస్తానన్నారు. పుణ్యా చారిటీస్ వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన ఆయన పది మందికి సేవ చేస్తూ ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో సంస్థను నడుపుతున్న మిత్రుడు విజయభూషణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సభకు విశ్రాంత అధ్యాపకుడు గన్నే వెంకట్రావు అధ్యక్షత వహించగా విశ్రాంత అధ్యాపకులు కె.ఆంజనేయ ప్రసాద్, ఎం.ప్రభాకర్ చౌదరి, బొబ్బా శ్రీనివాసరావు, కె.శాయోజీరావు, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు, గన్నవరం ప్రముఖులు టీఎస్ఆర్‌కే ప్రసాద్, చిమట రామారావు, ఆవుటపల్లి మోహనరావు, శివాజీ, స్రవంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎస్.వెంకట్, పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొని శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రధాని మోదీ

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సదస్సులో సంఘీభావం తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ బీసీలకు అన్యాయం చేస్తున్నారని, ఒక పద్ధతి ప్రకారం భవిష్యత్తులో రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆరోపించారు. విజయవాడ గాంధీనగర్‌లోని అలంకార్ ఇన్ హోటల్‌లో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కేసన శంకరరావు మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఎటువంటి కమిషన్ ఏర్పాటు చేయకుండా కేవలం ఆర్థిక వెనుకబాటుతనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు కల్పించడం సరికాదన్నారు. హక్కులను కాపాడుకునేందుకు బీసీలు ఉద్యమించాలన్నారు. ఓబీసీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేస్తేనే బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. రిజర్వేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని కోరారు. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. రిటైర్డ్ న్యాయమూర్తి సంజీవయ్య, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐపీఎస్ హరికుమార్, మాజీ ఎమ్మెల్సీ కోదాడ రాజయ్య, బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ క్రాంతి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నవరపు నాగమల్లి రాజు, తన్నీరు ఆంజనేయులు, డాక్టర్ శేషయ్య, మేక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారం పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యాపారంలో పెట్టుబడి పెట్టమని నమ్మించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మోసం చేసిన వ్యక్తిపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... న్యూ గిరిపురానికి చెందిన గుడిసె వెంకటేశ్వరరావు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతనికి వరుసకు అన్నయ్య అయిన మిద్దె వెంకటేష్ గవర్నర్ పేటలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో షాపు నిర్వహిస్తున్నాడు. తాను కంప్యూటర్ స్పేర్‌పార్ట్స్ హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నానని, ఆ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కొంత పెట్టుబడి కావాలని వెంకటేశ్వరరావును అడిగాడు. అందుకు అంగీకరించిన వెంకటేశ్వరరావు 2021 నుంచి పలు దఫాలుగా రూ.35లక్షలు వెంకటేష్‌కు ఇచ్చాడు. వెంకటేష్ స్కై సీ కంప్యూటర్స్ పేరుతో సంస్థను రిజిస్ట్రేషన్ చేశాడు. అనంతరం వెంకటేశ్వరరావు ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. కొద్ది రోజుల తర్వాత ఫోన్ చేసి వ్యాపారం ఎలా ఉంది? అని మిద్దె వెంకటేష్‌ను అడగగా ఇంకా వ్యాపారం ప్రారంభించలేదని సమాధానం ఇచ్చాడు. అతను గట్టిగా నిలదీయగా కొత్త కంప్యూటర్ సంస్థకు బిజినెస్ క్రెడిట్ ఇవ్వరని, అందుకే తాను బిజినెస్ స్టార్ట్ చేయలేదని సమాధానం ఇచ్చాడు. తర్వాత వెంకటేష్ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న షాపులో వాటా ఇస్తానని మాయమాటలు చెప్పాడు. గత నెల 27న నగరానికి వచ్చిన వెంకటేశ్వరరావు షాపునకు వెళ్లి చూడగా, అందులో రూ.35 లక్షల స్టాకు లేదని గమనించాడు. వెంకటేష్ చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, తాను మోసపోయానని గ్రహించిన వెంకటేష్‌ను గట్టిగా నిలదీయగా, వెంకటేష్ అతనిని అసభ్యపదజాలంతో దూషించాడు. చంపేస్తానని బెదిరించడమే కాకుండా వెంకటేశ్వరరావుపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి : 9 మంది అరెస్ట్

రూ.1.12 లక్షలు స్వాధీనం

వత్సవాయి(జగ్గయ్యపేట): శిబిరాలు నిర్వహించి పేకాట ఆడితే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ అభిమన్యు హెచ్చరించారు. మండలంలోని భీమవరం గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వారి నుంచి రూ.1.12 లక్షల నగదు, 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం జగ్గయ్యపేట కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విద్యార్థిని అదృశ్యంపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు విజయవాడ రూరల్ పీ. నైనవరం ప్రాంతానికి చెందిన యువతి (20) ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ నెల మూడో తేదీన కాలేజీకి అని ఆ యువతి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆమె ఫోన్‌కు తల్లి ప్రయత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె కోసం స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం కేసు నమోదు చేశారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): రజకుల సమస్యలు పరిష్కరించే వరకు ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమం చేయాలని ఏపీ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరరావు అన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో నగర రజక సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. నగరంలో ఉన్న ధోబీ ఘాట్ల వద్ద సరైన సౌకర్యాలు లేక వృత్తిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులందరూ చైతన్యవంతులై చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం 17 మందితో ఏకగ్రీవంగా నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర కమిటీ అధ్యక్షురాలిగా లింగాల నిర్మలమ్మ, కార్యదర్శిగా కోరట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ, సోంపల్లి శ్రీనివాస్, సహాయ కారదర్శులుగా కాజా గురుమూర్తి, సత్యనారాయణ, పార్వతి, కోశాధికారిగా రెడ్డిపల్లి శివపార్వతి ఎన్నికయ్యారు.

ఆకట్టుకున్న క్రైస్తవ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: కంఫర్ట్ హ్యాండ్స్ చారిటబుల్ సంస్థ, క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన క్రైసవ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆమెన్ శ్యామ్యూల్ ఆధ్వర్యంలో రెవరెండ్ నతానియేల్, సిస్టర్ రాజకుమారి, సిస్టర్ హాల్లెలూయా, రెవరెండ్ సుధాకర్, పాస్టర్ తారా ప్రకాష్ పలు క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి చైర్‌పర్సన్ పుణ్యశీల మాట్లాడుతూ చాలా కాలంగా సంగీత విభావరి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని వివరించారు. తన ప్రారంభదశలో తనపాటు సంగీత యాత్రలో పాల్గొన్న వాద్యకళాకారులను గుర్తుచేసుకున్నారు. నిర్వాహకుల కోరిక మేరకు భక్తి గీతాన్ని ఆలపించారు. క్రిస్టియన్ యూత్ ఆర్గనైజేషన్ కన్వీనర్ అబ్రహ్మం పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో బెడ్స్‌కు మరమ్మతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో చిన్నపాటి రిపేర్లు అయిన వాటిని పక్కన పడేయకుండా వాటికి మరమ్మత్తులుచేసి తిరిగి వినియోగంలోకి తెస్తున్నారు. గతంలో బెడ్ వంగినా, విరిగినా పక్కన పడేసి స్క్రాప్‌లో అమ్మేసేవారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి చొరవతో చిన్న చిన్న మరమ్మతులను ఆస్పత్రిలోనే నిర్వహించి, తిరిగి వినియోగంలోకి తీసుకొస్తున్నారు. ఇటీవల దాత ఇచ్చిన మినీ వెల్డింగ్ మెషిన్‌లో శిక్షణ కోసం వచ్చిన ఐటీఐ విద్యార్థులు బెడ్‌లు మరమ్మతులు చేస్తున్నారు. ఇలా రెండు రోజుల్లో 15 బెడ్స్ వరకూ మరమ్మతులు చేశారు. ఇదే క్రమంలో వీల్‌చైర్స్‌కు మరమ్మతులు చేస్తున్నారు. సూపరింటెండెంట్ ఆదేశాలు మెకానిక్ వాసు ప్రోత్సాహంతో సార్జెంట్ సోమరాజుతో కలిసి ఇవన్నీ చేపడుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన గుణదల కొండ

గుణదల(విజయవాడ తూర్పు): లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ద్వారానే మనకు రక్షణ కలిగిందని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. దేవుని యెడల విశ్వాసంతో నడుచుకోవాలని తెలిపారు. అనుదిన ప్రార్థన మన జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. పరలోక సంబంధమైన దేవుని మర్మాలను బైబిల్ గ్రంథం ద్వారా మనం తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దేవుని వాక్యానుసారం పవిత్రంగా జీవించాలని కోరారు. ఆదివారం సెలవు కావడంతో యాత్రికులు పెద్దయెత్తున గుణదల కొండకు చేరుకున్నారు. వేలాదిగా తరలి వచ్చిన యాత్రికులతో గుణదల కొండ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



భవనానికి శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో బీసీ కులాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికప్రాధాన్యం ఇస్తూ, వారికి సామాజికంగా, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పటమట 12వ డివిజన్లోని అయ్యప్పనగర్ శాంతి రోడ్‌లో నూతనంగా నిర్మించబోయే అగ్ని (వన్నియ) కుల సంక్షేమ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్ని కుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారికి గుర్తింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణం కోసం సంక్షేమ సంఘం రూ. 25లక్షలు సమకూర్చుకోగా, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఎంపీ ల్యాండ్స్ నుంచి మరో రూ. 25లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. భవన నిర్మాణం పూర్తి అయ్యేవరకు సంపూర్ణ సహకారం ఉంటుందని అవినాష్ వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం కూడా కుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం సంక్షేమ భవన నిర్మాణ దాత ఉషోదయ ట్రాన్స్ పోర్ట్ అధినేత పానమాల వెంకట రామరాజు, వసుమతి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అగ్ని, వన్ని కుల క్షత్రియుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్రి ప్రసాద్ , అగ్ని, వన్ని కుల కార్పొరేషన్ డైరెక్టర్ ఒడుగు గోపీనాథ్, సైకం భాస్కరరావు, ఒడుగు లక్ష్మీనారాయణ, పితాని వెంకటేశ్వరరావు, లకనం నాగాంజనేయులు, వాటిపల్లి శ్రీరాములు, లంకే సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ నడకుడిటి సుబ్బరాజు, కోల్లాటి బాబురావు, నాగిడి సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సంఘాల ప్రతినిధులు, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్, రిజ్వాన్, ధనికుల కాశీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంతో రూ.2 లక్షల నష్టం



బాధితులను పరామర్శిస్తున్న దేవినేని అవినాష్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): పటమట ఫన్‌టైం క్లబ్ రోడ్డులో జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే ఇంటిలో ఉన్న నాలుగు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. స్థానికంగా ప్రైవేటు స్థలంలో పాకలు వేసుకుని నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా భవానీ మాల వేశారు. ఆదివారం ఉదయం భవానీలు పూజ ముగించుకుని బయటకు వెళ్లడంతో పూజాదీపం ఇంటి చూరుకు అంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

తూర్పు నియోజకవర్గంలో 10వ డివిజన్ ఫన్ టైం వెనుక రోడ్‌లో జరిగిన అగ్ని ప్రమాదం బాధాకరమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం తరుపున సహయం అందించే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి అగ్నికి ఆహూతై ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులైన భాదితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి బాధితులకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భోజనాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తరపున నష్టపోయిన ప్రతి ఒక్కరికి అన్ని విధాలా నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు పర్వతనేని బాబీ, కరుటూరి హరీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు



పుష్పాంజలి కార్యక్రమంలో పాల్గొన్న ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ సభ్యులు ఆంజనేయరాజు తదితరులు



ఘంటసాల కళావేదిక నిర్వహణలో మాట్లాడుతున్న వేముల హజరత్తయ్య గుప్తా



తుమ్మపల్లిలో ఘంటసాల జయంతి వేడుకల్లో పాల్గొన్న చంద్రశేఖర్ తదితరులు

విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు, నిర్మాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలను ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో..

ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు గుర్రం ఏడుకొండలు, కొండాయిగుంట రాము, ప్రభలశ్రీనివాస్ రామకృష్ణ ప్రసాద్,గోవు రాము పాల్గొన్నారు.

శ్రీకళాభారతి ఆధ్వర్యంలో..

తుమ్మపల్లి కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహం వద్ద శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డొగిపర్తి శంకరరావు,శింగంశెట్టి చంద్రశేఖర్, మల్లంపల్లిరాజు, చింతకాయల చిట్టిబాబు, గోళ్ల నారాయణరావు, డేవిడ్‌రాజు, దుర్గానాగమణి, టీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

కళావేదిక ఆధ్వర్యంలో..

తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నిర్వహించిన శతజయంతి కార్యక్రమంలో న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా ఘంటసాల సంగీత సేవలను వివరించారు. పేదలకు వస్త్రదానం చేశారు. నిర్వాహకులు బొబ్బిలి లీలాకుమార్, నిమ్మకాయల రమణమూర్తి, పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో..

ఘంటసాల శతజయంతి సందర్భంగా నగరానికి చెందిన సీనియర్ గాయనీ గాయకులు ఘంటసాల చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. హరికృష్ణ, అనిల్‌కుమార్, శివలీల, సుధారాణి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులను సత్కరించిన వాకర్స్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల ఆవరణలో కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరిజన్ ఎండోక్రైన్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత స్క్రీనింగ్ పూర్తి డయాబెటిక్ క్యాంప్‌లో సుమారు 300 మంది పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, కిడ్నీ, రక్త, యూరిన్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు జూనియర్ కళాశాల, పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశామన్నారు. అనంతరం వైద్యులు యలమంచి ఐశ్వర్య, అమూల్యను సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జె.ఎస్.భాస్కరరావు, సుబ్బారావు, భావన్నారాయణ, సత్యనారాయణ, మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

పక్షపాతం లేకుండా..



సర్కిల్-3 పరిధిలోని 8వ డివిజన్‌లో జరుగుతున్న స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ పనులు



సర్కిల్-2 పరిధిలోని జలగం వారి వీధిలో జరుగుతున్న సీసీరోడ్డు పనులు



సర్కిల్-2 పరిధిలోని 23వ డివిజన్‌లోని సూర్యారావుపేటలో పూర్తయిన సీసీ రోడ్డు

- టీడీపీ డివిజన్లలోనూ జోరుగా అభివృద్ధి పనులు
- మూడు సర్కిళ్ల పరిధిలో రూ.40 కోట్ల వ్యయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని పాలక పక్షం ప్రకటిస్తోంది. గత పాలకులు కేవలం అధికారపార్టీ డివిజన్ల అభివృద్ధికే మొగ్గుచూపేవని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక ప్రతిపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలు కూడా అభివృద్ధి చేస్తామని పాలనలో కులం, మతం, పార్టీలు చూడబోమని ప్రకటించారు. ఆ మేరకు విజయవాడ నగరపాలక సంస్థపరిధిలోని ప్రతిపక్షాలు కూడా మెచ్చుకునేలా అభివృద్ధి పనులు చేస్తున్నామని వీఎంసీ పాలకపక్షం పేర్కొంటోంది. 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు సుమారు 20 నెలల కాలంలో కార్పొరేషన్ జనరల్ ఫండ్స్, రూ.50 కోట్ల గ్రాంట్ నుంచి, 14వ ఆర్థిక సంఘం, 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి, రూ.100 కోట్ల ప్రత్యేక నిధుల నుంచి, యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్) నిధులు మొత్తం 245 పనులకు రూ. 40.63 కోట్లు నిధులు ఖర్చు పెట్టారు. సర్కిల్-1 పరిధిలోని 52వ డివిజన్‌లోనే 16 పనులకు ఇప్పటి వరకు రూ.2.99 కోట్లు వెచ్చించారు.

- సర్కిల్-2 పరిధిలోని ఐదు టీడీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న 23, 26, 28, 32, 60 డివిజన్లలో రూ.10.05 కోట్లతో అభివృద్ధి జరుగుతుంది. ఆయా డివిజన్లలో 53 పనులు తలపెట్టగా అందులో ఇప్పటికే 39 పనులకు రూ.3.87 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా రూ.2.99 కోట్లతో ఏడు పనులు జరుగుతున్నాయి. రూ.23.59లక్షలతో చేపట్టిన మూడు పనులు ప్రారంభదశలో ఉండగా, రూ.2.94 కోట్లతో జరగాల్సిన నాలుగు పనులు టెండర్ దశలో ఉన్నాయి.
- సర్కిల్-3 పరిధిలోని ఏడు డివిజనైన 04, 08, 09, 10, 11, 12, 13 లో 176 పనులకు రూ.27.69 కోట్లు వెచ్చిస్తున్నారు. అందులో ఇప్పటికే రూ.8.09 కోట్లతో ఇప్పటికే 65 పనులు పూర్తవ్వగా రూ.7.55 కోట్లతో 29 పనులు జరుగుతున్నాయి. రూ.4.02 కోట్లతో తొమ్మిది పనులు ప్రారంభించాల్సి ఉండగా, రూ.5.69 కోట్ల విలువైన 32 పనులు టెండర్ల స్థాయిలో, ఇంకా రూ.1.89 కోట్ల విలువైన పనులు అధికారుల అనుమతి పొంది టెండర్లకు సిద్ధంగా ఉన్నాయి. .

పక్షపాతంలేకుండా పనులు

కౌన్సిల్ ఏర్పడిన ఏడాదిన్నరలో ఇప్పటి వరకు ప్రతిపక్షాలు అడిగిన అన్ని అభివృద్ధి పనులను చేస్తున్నాం. టీడీపీ ఫ్లోర్‌లీడర్ ప్రాతినిధ్యం వహించే 23వ డివిజన్లలో శరవేగంగా పనులు సాగుతున్నాయి. ఈ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, రోడ్డు మార్జిన్లలో పేవర్‌బ్లాక్‌లే ఏర్పాటు, సూర్యారావుపేటలో యూజీడీ పనులు ముగింపు స్థాయిలో ఉన్నాయి. కౌన్సిల్‌లో పదేపదే మాట్లాడే 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి డివిజన్‌లోనూ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి వర్షపునీటి కాలువ(స్ట్రామ్ వాటర్‌డ్రెయిన్స్)తోపాటు రోడ్డుకి ఇరువైపులా దుమ్ములేవకుండా అప్రోచ్‌గా పేవర్‌బ్లాకులు వేస్తున్నాం

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్, వీఎంసీ

ట్యాక్స్ ప్రాక్టీషనర్లకు పునఃశ్చరణ అవసరం

ఏపీ ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్ గిరజాశంకర్



సదస్సులో మాట్లాడుతున్న గిరజాశంకర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ట్యాక్స్ ప్రాక్టీషనర్లకు నిరంతర పునఃశ్చరణ ఎంతో అవసరమని ఏపీ ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ గిరజాశంకర్ అన్నారు. మారుతున్న పన్నుల విధానంపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పరోక్ష పన్నుల అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరిజా శంకర్ మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులకు, అధికారులకు మధ్య వారధిగా ట్యాక్స్ ప్రాక్టీషనర్లు పనిచేయాలన్నారు. ముఖ్యంగా పన్ను ఎగవేతదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పన్నుల విధానంపై ఎప్పటికప్పుడు పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. నిజమైన పన్ను చెలిలపుదారులకు ఇబ్బంది కలుగకుండా చూడటంతో పాటు అదే సమయంలో పన్ను ఎగవేతదారుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన అధ్యక్షుడు ఎం.వి.జె.కె.కుమార్, ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్స్ అధ్యక్షుడు పి.షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ ట్యాక్స్ ప్రాక్టీషనర్లకు ఉన్న ఇబ్బందులపై చర్చించి తమకు వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఈ తరహా సదస్సులు ఉపకరిస్తాయన్నారు. సమస్యల వలన ట్యాక్స్ ప్రాక్టీషనర్లు మానసిక ఒత్తిడికి గురై అకాల మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లింపుదారుల సమస్యలపై చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ సానుకూలంగా స్పందించారని వివరించారు. అనంతరం చీఫ్ కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు.

రోబోటిక్ సర్జరీతో కిడ్నీలో క్యాన్సర్ గడ్డ తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ దీరజ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోనే తొలిసారిగా రోబోటిక్ ఎక్స్ సర్జరీ ప్లాట్‌ఫామ్‌పై కిడ్నీలో ఉన్న ఐదు సెంటీమీటర్ల క్యాన్సర్ గడ్డను తొలగించినట్లు యూరాలజిస్టు డాక్టర్ కె. ప్రశాంత్‌కుమార్, డాక్టర్ దీరజ్‌కుమార్ తెలిపారు. లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పిటల్స్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాధారణంగా ఈ శస్త్ర చికిత్సకు మూడు గంటల సమయం పడుతుందన్నారు. కానీ రోబోట్‌తో చేయడంతో 1.15 గంటల్లోనే పూర్తి చేసినట్లు తెలిపారు. రోబోట్ ఆపరేషన్ అంటే చాలా మంది భయపడుతున్నారని, అలాంటి భయం ఏమీ అవసరం లేదన్నారు. ఆపరేషన్ అప్పుడు మన చేయి కొన్నిసార్లు తిప్పవలసి వస్తుందని, కానీ రోబోట్ వలన 360 డిగ్రీలు ఎటైనా సరే మనచేతిని తిప్పవచ్చన్నారు. రోబోట్ ఆపరేషన్ వలన వారం రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుని తన పనులు తాను చేసుకోగలుగుతాడని పేర్కొనారు. సమావేశంలో డాక్టర్ ప్రియతమ్, సీఈఓ డీఎస్ చక్రవర్తి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించేందుకు అప్రమత్తంగా ఉండాలి



వైద్యులకు సూచనలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం ఆస్పత్రిలోని పలు వార్డుల్లో తనిఖీ చేశారు. ఆదివారం కావడంతో సిబ్బంది, వైద్యులు అందరూ విధుల్లో ఉన్నారా, సేవలు ఎలా అందిస్తున్నారో తెలుసుకునేందుకు వార్డుల్లో సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులను సైతం రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవల అందించడమే తమ లక్ష్యం అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. నర్సులు సైతం అలసత్వం వహించకుండా రోగులకు సేవలు అందించాలని సూచించారు.

● దీక్షల విరమణలకు పక్కా ఏర్పాట్లు









విజయవాడ ఇంద్రకీలాద్రీపై భవానీ దీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కెనాల్ రోడ్డుపై నుంచి ఘాట్‌రోడ్డు వరకు క్యూలు, దుర్గగుడికి లైటింగ్ ఏర్పాటు చేశారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చట్టాలను అమలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు సంబంధించి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో 51వ డివిజన్ కొండ ప్రాంతంలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళా నేతలు స్వప్న, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించరు'



సాక్షి, అమరావతి: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని, మెమో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆ మెమో కేవలం డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ శాఖలో పదేళ్ల లోపు పనిచేసే ఉద్యోగులకు మాత్రమేనని.. అది కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఇచ్చామని ఉన్నతాధికారులు చెప్పినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర శాఖలకు ఇది వర్తించదని పేర్కొన్నారు. అందువల్ల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బొప్పరాజు, వైవీ రావు చెప్పారు.

రాయల్టీ కాదు.. నువ్వే పెనాల్టీ కట్టాలి బాబూ..

మంత్రులు ముత్యాల నాయుడు, వేణు, ఎమ్మెల్సీ జంగా



సాక్షి, విజయవాడ ప్రతినిధి: 'బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారు. మీ 14 ఏళ్ల పాలనలో బీసీలకు మీరుచేసిన ద్రోహాలు అనంతం. ఐటీ రంగానికి, పాలనావ్యవస్థకు బీసీలను దూరంచేసి కేవలం కులవృత్తులకే పరిమితం చేశారు..' అంటూ చంద్రబాబుపై మంత్రులు బూడి ముత్యాల నాయుడు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నిప్పులు చెరిగారు. ఈ నెల 7న విజయవాడలో నిర్వహించే 'జయహో బీసీ మహాసభ' ఏర్పాట్లను వారు ఆదివారం పరిశీలించారు. అనంతరం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో అమలవుతున్న సంక్షేమం సింహభాగం బీసీలకే దక్కుతోందన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఐటీ రంగంలో బీసీలను ఎదగనివ్వకుండా చంద్రబాబు తన సామాజికవర్గానికే పెద్దపీట వేశారని చెప్పారు. ఐటీ రంగం ద్వారా ఎంతోమందిని విదేశాలకు పంపానని.. అందుకు రాయల్టీ కట్టాలని చంద్రబాబు కోరడం సిగ్గుచేటన్నారు. బీసీలకు ద్రోహం చేసి, బీసీల వెనుకబాటుకు కారణమయిన చంద్రబాబే పెనాల్టీ కట్టాలని డిమాండ్ చేశారు.



నంద్యాల పట్టణం 3వ వార్డులో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



పార్వతీపురం మన్యం జిల్లా తామరకండిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

గడప గడపకు మన ప్రభుత్వం



కాకినాడ జిల్లా రమణక్కపేటలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఏలూరు జిల్లా చానమిల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

'స్కిల్' స్కాంపై ఈడీ కొరడా

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహరించారు. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన వారికి ఆదివారం ఈడీ నోటీసులు జారీచేసింది. చంద్రబాబు స్నేహితుడు, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీగా చేసిన కే లక్ష్మీనారాయణ, ప్రత్యేక కార్యదర్శి గంటా సుబ్బారావు, ఓఎస్డీ నిమ్మగడ్డ వెంకట కృష్ణప్రసాద్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కే ప్రతాప్‌కుమార్‌లతోపాటు ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన షెల్ కంపెనీల ప్రతినిధులతో సహా మొత్తం 26మందికి నోటీసులు జారీచేశారు. ఆ జాబితాలో డిజైన్ టెక్, స్కిల్లర్, ఇన్‌వెబ్ సర్వీసెస్, అలైడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్, ప్రతీక్ ఇన్ఫో సర్వీసెస్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్, నాలెడ్జ్ పోడియం, ట్యాలెంట్ ఎడ్జ్ మొదలైన షెల్ కంపెనీలున్నాయి. ఈ కేసులో ఇప్పటికే ఏపీ సీఐడీ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తూ కీలక ఆధారాలు సేకరించి ఎనిమిది మందిని అరెస్టుచేశారు. మరోవైపు.. ఈడీ కూడా నాలుగైదు నెలలుగా ఈ కుంభకోణంపై గుట్టుచప్పుడు కాకుండా దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించింది. ప్రధానంగా షెల్ కంపెనీల పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టి సింగపూర్ కంపెనీలకు తరలించి.. తిరిగి తమ ఖాతాల్లో వేసుకున్న వైనాన్ని ఈడీ పూర్తి ఆధారాలతో గుర్తించింది. తద్వారా చంద్రబాబు సన్నిహితులు మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించింది. అనంతరమే ఈ కేసులో వారిని విచారించేందుకు నిర్ణయించి నోటీసులు జారీచేసింది. మరోవైపు.. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు సోమవారం హాజరుకావాలని వారిని ఆదేశించింది.

కాగితాలపై ప్రాజెక్టు..

బాబు బినామీల ఖాతాల్లో రూ.241 కోట్లు

ఇక టీడీపీ ప్రభుత్వ పెద్దలు జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీతో ఓ ప్రాజెక్టు అంటూ కేవలం కాగితాలపై చూపించి ఏకంగా రూ.241 కోట్లు కొల్లగొట్టారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పిస్తామని చెప్పి పన్నాగం పన్నారు. అందుకోసం చంద్రబాబు కనుసన్నల్లోనే ఎలాంటి శాస్త్రీయ మదింపు లేకుండానే ఏకంగా రూ.3,300 కోట్లతో ప్రాజెక్టును రూపొందించారు. ఆ పన్నాగంలో భాగంగానే 2014–15లో అప్పటి సీఎం చంద్రబాబును సీమెన్స్ ఇండియా లిమిటెడ్ ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ కన్విల్కర్ కలిశారు. ప్రభుత్వం 10శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ సంస్థలు 90శాతం నిధులు పెట్టుబడి పెడతాయని ఒప్పందం కుదుర్చుకున్నారు. నిజానికి.. అసలు సీమెన్స్ కంపెనీకి ఈ ఒప్పందం గురించే తెలీదు. భారత్‌లో గతంలో ఆ కంపెనీ ఎండీగా వ్యవహరించిన సుమన్ బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తోపాటు టీడీపీ పెద్దలు డిజైన్ టెక్‌తో కలిసి కథ నడిపించారు. చంద్రబాబు ఆదేశాలతో అప్పటి ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కుంభకోణంలో ఏపీఎస్ఎస్‌డీసీ'కి అప్పట్లో ఎండీగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కే లక్ష్మీనారాయణ, ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ఇక ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓగా డిప్యూటీ ఐఏఎస్ అధికారి అపర్ణ ఉపాధ్యాయను నియమించారు. ఈమె సీమెన్స్ కంపెనీ కమిటీలో సభ్యుడైన జీవీఎస్ భాస్కర్ సతీమణి. ఈ విధంగా పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు నిబంధనలను ఉల్లంఘిస్తూ మరీ ఆమెకు పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. కనీసం ఆ రెండు సంస్థల నుంచి బ్యాంకు గ్యారంటీ కూడా తీసుకోలేదు. ఇక ప్రాజెక్టు పనులు మొదలు పెట్టకుండానే ప్రభుత్వం తరఫున 10 శాతం వాటాగా జీఎస్టీతో కలుపుకుని రూ.371 కోట్లను ఆ సంస్థలకు చెల్లించేశారు. ఇందులో సీమెన్స్ కంపెనీ సరఫరా చేసిన రూ.56 కోట్ల సాఫ్ట్‌వేర్, మరికొన్నింటికి చెల్లింపులు చేసి కథ ముగించారు. మిగిలిన రూ.241 కోట్లను నకిలీ ఇన్‌వాయిస్‌తో పలు షెల్ కంపెనీలు, బినామీ కంపెనీ డిజైన్‌టెక్ ఖాతాలోకి మళ్లించారు. ఇక ఢిల్లీలోని ఇన్‌వెబ్ సర్వీసెస్, పూణేకు చెందిన స్కిల్లర్ అనే షెల్ కంపెనీలకు నిధులు మళ్లించి ఆ నిధులను సింగపూర్‌లోని కంపెనీలకు తరలించి అక్కడి నుంచి టీడీపీ పెద్దల ఖాతాల్లోకి బదిలీ చేశారు. అందుకుగాను షెల్ కంపెనీలకు కేవలం కమీషన్లు చెల్లించి టీడీపీ పెద్దలు రూ.241కోట్లు కొల్లగొట్టారు.

కీలక ఫైళ్లు గల్లంతు..

వాస్తవానికి ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణాన్ని 2018లోనే కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర జీఎస్టీ అధికారులు 2018లో పూణేలో కొన్ని సంస్థలపై నిర్వహించిన తనిఖీల్లో నకిలీ ఇన్వాయిస్‌లు వెలుగు చూశాయి. అవి ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టుకు సంబంధించినవిగా గుర్తించి ఆ సమాచారాన్ని ఏపీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి తెలిపాయి. దాంతో ఈ వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు చేయాల్సి ఉంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో ఇందుకు అనుమతించలేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చింది. అంతేకాదు.. వెంటనే సీమెన్స్ కంపెనీతో ఒప్పందానికి సంబంధించి ఏపీఎస్ఎస్‌డీసీలో కీలకమైన ఫైళ్లను మాయం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర జీఎస్టీ అధికారులు ఏసీబీ దృష్టికి తీసుకువచ్చిన విషయం వెలుగుచూసింది. దీంతో టీడీపీ పెద్దలు లేని ప్రాజెక్టు ముసుగులో రూ.241 కోట్లు దోచుకున్న అవినీతి బాగోతం బట్టబయలైంది.

● తెలంగాణ

మా ప్రభుత్వాన్ని మోదీ కూల్చేస్తామన్నారు

- ఎన్నో కలలతో సాధించుకున్న తెలంగాణపై కుట్రలు చేస్తే ఊరుకోం
- ప్రధాని మోదీపై కేసీఆర్ ఫైర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చేస్తానని స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇది ఎంతవరకు సమంజసం? పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ 40 మంది ఎమ్మెల్యేలు వారితో టచ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఈ విధానాలు ఎటువైపు దారితీస్తున్నాయి? దేశంలో ఎక్కడో ఓ చోట తిరుగుబాటు రావాలనే.. మా ఎమ్మెల్యేలను చీల్చే ప్రయత్నం చేసిన వారిని జైల్లో వేశాం' అని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. ఎన్నో కలలతో సాధించుకున్న తెలంగాణపై కుట్రలు చేస్తే ప్రజలు ఎలా ఊరుకుంటారని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేనితనంతో అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనం ఒక్కరమే బాగుపడితే చాలదని, దేశం కూడా బాగుపడాలని.. అందుకోసం తెలంగాణ తరఫున జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం టీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని, జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం ఎంవీఎస్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు.

'దేశం కష్టాల్లో ఉంది'

అనేక దౌర్జన్యాలు, ఉద్వేగాలు, అబద్ధాలు, కుట్రలు, బాధలతో దేశం కష్టాల్లో ఉందని సీఎం కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మహనీయుల పోరాటాలతో సాధించిన స్వాతంత్ర్యం ఇందుకేనా అని ప్రశ్నించారు. భారత జీవనాడి కలుషితమవుతోందని, దీనిపై మేధావులు, విద్యార్థులు, యువత ఆలోచించాలని కోరారు. ప్రజా సంక్షేమానికి సంబంధించి వారు చేయరు, మమ్మల్ని చేయనివ్వరు. ఇదేం పద్ధతి అని కేసీఆర్ ప్రశ్నించారు.

సీబీఐ స్పందన తర్వాతే.. దర్యాప్తు అధికారులను కలిసే తేదీ ఖరారు

కేసీఆర్‌తో మరోమారు కవిత భేటీ

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ విషయంలో తాను కోరిన డాక్యుమెంట్లు సీబీఐ నుంచి అందిన తర్వాతే సంస్థ అధికారులను కలిసే తేదీని ఖరారు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్ణయించుకున్నారు. సీబీఐ నోటీసులు, ఇతర పరిణామాలపై శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సుదీర్ఘంగా భేటీ అయిన కవిత.. ఆదివారం మరోమారు సీఎంను కలిశారు. సీబీఐ నుంచి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అంది, న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే తేదీపై ఒక నిర్ణయానికి రావాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. కాగా కవిత రాసిన లేఖకు ఆదివారం రాత్రి వరకు సీబీఐ నుంచి ఎలాంటి తిరుగు సమాధానం రాలేదని టీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేసీఆర్‌తో భేటీ తర్వాత కవిత.. ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ రవిరంజన్ రిమాండ్

సంగారెడ్డి జైలుకు తరలించిన పోలీసులు

గచ్చిబౌలి(హైదరాబాద్): విద్యార్థినిపై అత్యాచారయత్నానికి పాల్పడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రవిరంజన్‌ను గచ్చిబౌలి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. హెచ్‌సీయూలో విద్యార్థినిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ప్రొఫెసర్ రవిరంజన్‌ను యూనివర్శిటీ అధికారులు సస్పెండ్ చేయగా, విద్యార్థిని ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొన్న విషయం తెలిసిందే. అనంతరం ఆదివారం రాత్రి కూకట్‌పల్లిలోని 11వ ఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ ముందు గచ్చిబౌలి పోలీసులు హాజరు పరిచారు. దీంతో ఆయన 14 రోజులపాటు రిమాండ్‌కు తరలించాలని మేజిస్ట్రేట్ ఆదేశించగా...రవిరంజన్‌ను పోలీసులు సంగారెడ్డిలోని జైలుకు తరలించారు.

బొద్దు.. కాదు ముద్దు !

'పటమటకు చెందిన రాకేష్ (పేరుమార్చాం) 8వ తరగతి చదువుతున్నాడు. ఊబకాయం కారణంగా యాక్టివ్‌గా ఉండకపోవడంతో పాటు, ఇటీవల నీరసంతో స్కూల్లో పడిపోయాడు. తల్లిదండ్రులు బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు పరీక్షించగా మధుమేహం స్థాయిలు ఎక్కువగా ఉన్నట్లు తేల్చారు'.

'విద్యాధరపురానికి చెందిన 9వ తరగతి విద్యార్థి యశ్వంత్ (పేరుమార్చాం) చిన్నప్పుడు బాగానే ఉన్న, నాలుగేళ్లుగా ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడంతో ఒకేసారి బరువు పెరిగాడు. ఆటలు ఆడేందుకు కూడా వీలు లేని విధంగా మారాడు. దీంతో మానసికంగా కుంగుబాటుకు గురై చదువులో సైతం రాణించలేకపోతున్నాడు. ఇలా వీరిద్దరే కాదు అనేక మంది పిల్లలు ఒబెసిటీ కారణంగా శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు'.

- పిల్లల్లో పెరుగుతున్న ఊబకాయం
- వారిలో మానసిక , శారీరక ఆరోగ్య సమస్యలు
- చిన్న వయస్సులోనే పొంచి ఉన్న బీపీ, షుగర్
- డిప్రెషన్‌తో చదువులో రాణించలేకపోతున్న వైనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు పిల్లలు బొద్దుగా ఉంటే ముద్దుగా ఉన్నారని అనేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. బొద్దు ముద్దు కాదంటున్నారు. వారిలో చలాకీతనం లేకపోవడంతో పాటు, చిన్న వయస్సులోనే అనేక మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వయస్సుకు తగిన బరువు ఉంటే చాలని, అధిక బరువు అనర్థాలకు దారి తీస్తుందంటున్నారు. ప్రస్తుతం ప్రతి వంద మంది పిల్లల్లో 18 మంది అధిక బరువుతో ఉంటున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. అలాంటి వారు బరువు తగ్గేందుకు తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

● ఒబెసిటీకి కారణాలివే..

- జంక్‌ఫుడ్ , బయట ఆహారం ఎక్కువగా తీసుకోవడం. అంటే పిజ్జా, బర్గర్, న్యూడిల్స్ లాంటివి.
- జంక్‌ఫుడ్ టేస్ట్ డిఫరెంట్‌గా ఉండటంతో ఎక్కువ మోతాదులో తీసుకోవడం
- సెకండరీ లైఫ్ (కదలిక లేని జీవన విధానం)
- సెల్‌ఫోన్, టీవీ చూస్తూ భోజనం చేసే వారు తగిన మోతాదు కంటే ఎక్కువ తినేస్తారు.
- అమెరికన్ స్టడీస్‌లో నిర్ధారణ ప్రకారం ఎక్కువ సేపు టీవీ చూసే వారిలో ఒబెసిటీ వస్తుంది
- తల్లిదండ్రులు ఊబకాయులైన పిల్లలకు రావచ్చు.
- జన్యుపరమైన కారణాలతో కూడా ఒబెసిటీ వచ్చే అవకాశం ఉంది.

● ఊబకాయుల్లో సమస్యలివే..

- ఒబెసిటీ ఉన్న పిల్లలు సహచర పిల్లల నుంచి తరచూ అవహేళనకు గురవుతుంటారు. దీంతో సైకాలజికల్‌గా డిప్రెషన్‌కు గురవుతారు.
- ఒబెసిటీ ఉన్న పిల్లలు సరిగా ఆడరని క్రీడల్లోకి రానివ్వరు.
- చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఆయాసం వస్తుంది.
- మానసిక ఒత్తిడితో చదువులో కూడా రాణించలేరు.
- టీనేజ్‌లోకి వచ్చే సరికి డిప్రెషన్ ఎక్కువ అవుతుంది.
- ప్రీ డయాబెటీస్, హైపర్‌టెన్షన్ చిన్న వయస్సులోనే దరిచేరతాయి.
- స్కిన్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ రావచ్చు.

● ఏమి చేయాలి..

- సెల్‌ఫోన్, టీవీ చూసే టైమ్ తగ్గించాలి
- రెగ్యులర్‌గా వాకింగ్, వ్యాయామం చేయాలి. అవసరమైతే తల్లిదండ్రులే వారిని వెంట తీసుకుని చేయించాలి.
- జంక్‌ఫుడ్‌ను వీలైనంత వరకూ తగ్గించాలి. వీకెండ్స్‌లో వారానికి ఒకసారి తినొచ్చు.
- ఒబెసిటీ పిల్లలు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలి.

వ్యాయామం చేయించాలి



జంక్‌ఫుడ్ టేస్ట్ డిఫరెంట్‌గా ఉండటంతో పిల్లలు ఎక్కువగా దానిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు జంక్‌ఫుడ్, బయట ఆహారం తీసుకోవడం, సెకండరీ లైఫ్‌తో ఊబకాయులుగా మారుతున్నారు. ఊబకాయులు సహచర విద్యార్థుల నుంచి తరచూ అవహేళనకు గురవుతూ డిప్రెషన్‌కు లోనవుతుంటారు. పిల్లలు బరువు పెరుగుతున్నట్లు గుర్తించి, తల్లిదండ్రులు వారిని వాకింగ్, వ్యాయామం వంటివి చేయిస్తే మంచిది. తరచూ వైద్య పరీక్షలు చేయించాలి.

– డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు,
ప్రిన్సిపాల్ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి



ఊబకాయంతో ఉన్న పిల్లలు మానసిక, శారీరక సమస్యలను అధిగమించేందుకు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అందులో భాగంగా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, వ్యాయామం చేయడం లాంటివి రెగ్యులర్‌గా చేయాలి. తోటి వారు అవహేళన చేశారని డిప్రెషన్‌కు గురైతే చదువుపై శ్రద్ధ పెట్టలేరు. ఒబెసిటీని తగ్గించుకునే మార్గాలను అన్వేషించాలి. ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమే...

– డాక్టర్ కాజ మానస, చైల్డ్ సైకియాట్రిస్ట్

ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సూర్యారావుపేటలోని సహకార భవన్‌లో కమిటీ ఎన్నికకు ఆదివారం నామినేషన్లు స్వీకరించారు. కమిటీకి ఒకే ప్యానల్ నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.వి. ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శిగా భావనరుషి, కోశాధికారిగా వై.వి.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా టి.నాగరామయ్య, ఉపాధ్యక్షుడిగా కె.రవిశంకర్, కె.సుధీంద్రరావు, ఎస్.శ్రీనివాసులరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, పి.దుర్గాప్రసాద్, ఎ.వి. హనుమంతరావు, ఎం.బాబ్జీరావు, జోనల్ కార్యదర్శులుగా సూర్యత్రినాథరావు, ఎం.మోహన్‌బాబు, శాంతిభూషణ్‌రెడ్డి, ఏడుగురు కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అభినందించారు. ఫణిపేర్రాజు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత అన్ని జిల్లాల కమిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.



ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువ

ప్రయోగాత్మకంగా హైడెన్సిటీ పత్తి సాగు

- తక్కువ సమయంలోనే పంట చేతికి
- తెగుళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువ
- ఏడాదిలో రెండు సార్లు సాగుచేసే అవకాశం



గంపలగూడెం మండలం అనుముల్లంకలో ప్రయోగాత్మకంగా సాగు చేసిన హైడెన్సిటీ పత్తిని పరిశీలిస్తున్న ఏఓ సాయిశ్రీ

అనుముల్లంక(గంపలగూడెం): హైడెన్సిటీ (అధిక సాంద్రత) పత్తి సాగుతో రైతాంగానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ మేలు చేకూరుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. గంపలగూడెం మండలం అనుముల్లంకలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రయోగాత్మకంగా రైతు అత్తునూరు పద్మారెడ్డికి చెందిన 1.50 ఎకరాల్లో ఈ రకం పత్తిని సాగు చేశారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని రైతు అంటున్నాడు. పంట కాలం తక్కువ, ఎరువులు, పురుగు మందుల వినియోగం తక్కువగా ఉంది. సాధారణ రకానికి చెందిన మూడు ఎకరాల విస్తీర్ణంలో వేసే మొక్కలను ఒకే ఎకరం విస్తీర్ణంలో ఈ రకం పత్తి సాగు చేయవచ్చు. ప్రతి చెట్టుకు ఎక్కువగా కాయలు, పెద్ద సైజులో కాచి దిగుబడి అధికంగా లభిస్తుంది. పత్తి రైతులు ప్రధానంగా ఎదుర్కొనే గులాబీ రంగు పురుగు ఆశించే సమయానికి (డిసెంబర్ మాసాంతానికి) ఈ రకం పంట కాలం పూర్తవుతుంది. తెగుళ్లు తక్కువగా ఆశిస్తాయి. తెగుళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువ. ఇతర రకం పత్తి వలే ఎక్కువ పర్యాయాలు కాకుండా రెండు లేదా మూడు తీతల్లో పూర్తి పంట చేతికి వస్తుంది. దీంతో కూలీల వ్యయం తగ్గుతుంది. పంట కాలం తక్కువ కావడంతో రెండవ పంటగా మొక్కజొన్న, జొన్న, ఏదైనా అపరాలు సాగు చేసుకోవచ్చు. లేదా ఒకే పొలంలో ఏడాదికి పత్తి రెండు పర్యాయాలు సాగుచేయవచ్చని మండల వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ తెలిపారు. మొక్కలు 30 రోజుల వయస్సు నుంచి ప్రతి 15 రోజులకు అంతరకృషి ఐదు పర్యాయాలు నిర్వహించాల్సి ఉంటుంది అధిక సాంద్రత పత్తి విషయమై రైతాంగం అవగాహన పొంది వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి తగిన లాభాల్ని ఆర్జించాలని ఏఓ సూచించారు. ఈ విషయమై ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి అనుముల్లంకలో క్షేత్రపదర్శన నిర్వహించి అవగాహన కల్పించామన్నారు.

ఆశాజనకంగా దిగుబడి

అధిక సాంద్రత పత్తి సాగుచేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. అధికారులు సూచించిన మేర తనకు చెందిన 1.50 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగు చేశాను. సాగులో ఖర్చు తక్కువగా ఉంది. ఎరువులు, పురుగు మందుల వినియోగం సైతం తక్కువ అయింది. పంట రెండు లేదా మూడు తీతల్లోనే చేతికి వస్తుంది. ఇప్పటికే రెండు తీతలు పూర్తయ్యాయి. మరో తీతతో పైరు తొలగించి మరో పైరు వేసుకొనేందుకు అవకాశం ఉంది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది.

– అత్తునూరు పద్మారెడ్డి,
రైతు, అనుముల్లంక

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



విద్యుద్దీపాలంకరణతో వేంకటేశ్వర స్వామివారి ఆలయం



పుష్పాలంకరణతో స్వామివారి ఉత్సవమూర్తులు

నేటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ

గుడ్లవల్లేరు: డోకిపర్రు మహాక్షేత్రం శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల చేతుల మీదుగా స్వామివారి బ్రహ్మోత్సవాల్ని ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఆదివారం తెలిపారు. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని తరించాల్సిందిగా కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించామన్నారు. బ్రహ్మోత్సవాలకు అత్యధికంగా విచ్చేసే భక్తుల మానసికోల్లాసానికి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. మహాక్షేత్ర ప్రాధాన్యత, శ్రీ వేంకటేశ్వరుని మహిమలను ఆధ్యాత్మిక వేత్తలు వివరించనున్నారని చెప్పారు. అత్యధిక సంఖ్యలో వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వామివారి ప్రసాదాన్ని అందించేందుకు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఏర్పాట్లు చేపట్టారన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారిని ప్రత్యేక వాహనాల్లో ఊరేగించనున్నామని తెలిపారు. నిత్యం తొమ్మిది గంటల పాటు స్వామిని దర్శనం చేసుకుని భక్తులు తరించవచ్చునన్నారు. తొలుత అంకురారోహణం, తిరుచ్చి (పల్లకీ) సేవను వేద పండితులు నిర్వహిస్తారన్నారు. అనంతరం ధ్వజారోహణ ఉత్సవం, సూర్యప్రభ వాహనోత్సవం, శేష వాహనోత్సవం, సాయంత్రం ఊంజల సేవ, హంస వాహన సేవను వేద పండితులు చేపట్టనున్నారని పేర్కొన్నారు. గజ వాహనోత్సవం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గరుడ వాహనోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, విశేష శ్రీనివాస కల్యాణం, సాయంత్రం ధ్వజావరోహణ ఉత్సవం, చంద్రప్రభ వాహనోత్సవంతో బ్రహ్మోత్సవ వేడుకలు ముగియనున్నాయని వివరించారు.

గురువాణి

ఒరులేయవి యొనరించిన...

భారతం అందరం అంగీకరించే గ్రంథం. పంచమ వేదం. వ్యాసులవారు చేసింది. దానిలో ఒక సందర్భం. నెత్తురోడుతూ అంపశయ్య మీద పడుకొని ఉన్నారు భీష్మాచార్యుల వారు...ధర్మసూక్ష్మాలు తెలుసుకోవడానికి ధర్మరాజు ఎదురుగా నిలబడి ఉన్నాడు. మనం కూడా మృత్యుశయ్యమీద పడుకొని చెప్పిన మాటలను తిరుగులేని సాక్ష్యంగా పరిగణిస్తాం. కారణం– ఊపిరి విడిచిపెట్టేముందు దైవాన్ని తలచుకుంటూ, నిర్భయంగా చెప్పే మాటలయినందువల్ల వాటిని పరిగణనలోకి తీసుకొంటాం. అందుకే మరణ వాంగ్మూలమ్.. అని కూడా అంటాం. భీష్ముడు కూడా శరీరాన్ని వదిలిపెట్టే ముందు లోక కళ్యాణం కోరి ధర్మరాజు ద్వారా మనకు చాలా ధర్మ సూక్ష్మాలను బోధించారు.. తిక్కన చాలా సులభమైన తెలుగులో వాటిని మనకందించారు... అందులో అందరం ఇప్పటికాలంలో కూడా అనుసరించవలసిన అసలు ధర్మాన్ని ఒక పద్యంగా మనకందించారు.

ఒరులేయవి యొనరించిన/నరవర యప్రియము తన మనంబున కగు? దా/నొరులకు నవి సేయకునికి/ పరాయణము పరమ ధర్మపథములకెల్లన్...అన్నారు. ధర్మం అన్నది ఎప్పుడూ ఒక స్థితిలో ఉండేది కాదు. దేశాన్నిబట్టి, కాలాన్నిబట్టి, ఆశ్రమాన్నిబట్టి, మీరున్న స్థితినిబట్టి మారిపోతుంటుంది. అటువంటప్పుడు అసలు ధర్మాన్ని ఎలా తెలుసుకోవడం? ఒకవేళ తెలుసుకొన్నా ఎలా ఆచరించడం? అన్న ధర్మరాజు సందేహాన్ని గమనించి భీష్మాచార్యులవారు ..'ధర్మరాజా! నీవెప్పుడయినా ఇతరులను ఉద్దేశించి పరుషంగా మాట్లాడావనుకో..

అలాటి స్థితిలో ఒక్కసారి గుండెలమీద చేయి వేసుకొని నిన్ను నీవు పరీక్షించుకో... ఈ మాటలే అవతలి వారు నిన్ను కానీ, నీ కుటుంబ సభ్యులను కానీ, నీ బంధు మిత్ర పరివారాన్ని కానీ ఉద్దేశించి మాట్లాడితే నీకు ఎంత బాధ కలుగుతుందో ఆలోచించు... నీ మనసును కష్టపెట్టే మాటలు, చేష్టలవల్ల నీకు కలుగుతున్న బాధను నీవు నీ మాటలతో కానీ, చేష్టలతో కానీ ఇతరులకు కలిగించక





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పోవడమే ధర్మాలలోకెల్లా ఉత్తమ ధర్మం.

ధర్మం అనేది ఎప్పుడూ మనవైపు నుంచే ప్రవహిస్తూ ఉంటుంది. అవతలివారు అలా అన్నారు కాబట్టి నేనిలా అంటానంటే అది ధర్మమెలా అవుతుంది? పుత్రధర్మం అన్నమాట ఎప్పుడు అన్వయం అవుతుందంటే.. కొడుకుగా నువ్వు చేయవలసింది నీవు చేసినప్పుడు. పితృధర్మం అంటే.. తండ్రిగా నీవు చేయవలసింది నీవు చేసినప్పుడు అన్వయం అవుతుంది. నాకు అనుకూలంగా ఉండి నేను చెప్పినట్లు వింటేనే నేను వాడికి తండ్రిగా చేయవలసింది చేస్తాను.. అంటే అది ధర్మం ఎందుకవుతుంది! వాడెలా ఉన్నాడన్నదానితో నాకు సంబంధం లేదు, తండ్రిగా నేను చేయవలసింది చేసా.. చాలు. అదే ధర్మం..అందుకే కర్తవ్యమ్..అన్నారు.

ఏదయినా చేసే ముందు, ఏ మాటయినా మాట్లాడే ముందు, ప్రవర్తించే ముందు నిన్ను నీవు పరీక్షించుకో... ఇవే మాటలను చేతలను ఇతరులు నీ మీద ప్రయోగిస్తే నీకు బాధ కలుగుతుందని నీకు తెలిసినప్పుడు అవతలి వారిని బాధపెట్టకు... ఈ ధర్మమే...పరాయణము పరమ ధర్మపథములకెల్లన్.

సూక్తి సుధ

జీవితంలో ఏదైనా మనం గెలవడానికి చేసే ప్రయత్నంలో ఓడిపోతే సిగ్గు పడకూడదు. కానీ, అసలు ప్రయత్నమే చేయకపోతే సిగ్గు పడాలి.

తొలి అడుగులో తప్పటడుగు ఉండొచ్చు. కానీ, ప్రతి అడుగులో తప్పటడుగు వేయడం తప్పు.

మనం చేసే ప్రతి ఆలోచన, ఆచరణలో సాధ్యం కాకపోవచ్చు. కానీ, ఆలోచనే చేయకపోవడం మూర్ఖత్వం.

జీవితంలో ప్రతి నిమిషం నీదే. నీ సొంతమే. దానిని సరిగ్గా చూసి నిర్ణయం తీసుకోవడం నీ బాధ్యత.

కఠోరమైన పరిశ్రమ లేకుండా కలలు ఎన్నటికీ నిజం కావు. కష్టపడి పనిచేయడం వల్లనే పనులు జరుగుతాయి. లక్ష్యాలు సాధించబడతాయి.

నిద్రపోతున్న సింహం నోటిలోకి జింక వచ్చి దూరదు కదా. స్వ ప్రయత్నం ద్వారానే మనం అనుకున్నవి సాధించగలుగుతాము.



మంచి మాట

సత్యం ఉన్నది ఉన్నట్లుగానే

ఉన్నది ఉన్నట్టుగా తెలియకపోతే ఉన్న మనకు లేనిపోని నష్టం జరుగుతుంది. మనకు కష్టం కలుగుతుంది. సత్యం లేదా నిజం తెలియకపోవడం వల్లా, లేకపోవడం వల్లా, మనకు ఎంతో హాని జరుగుతుంది, జరుగుతోంది, జరుగుతూ ఉంటుంది... ప్రతి ఒక్కరికీ సత్యం అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ సత్యమే అవసరం అవుతుంది.

ఏదో అనుకోవడం, ఏదో అభిప్రాయపడడం ఈ రెండిటినీ వీలైనంత తొందరగా మనం వదిలేసుకోవాలి. కొన్ని సందర్భాల్లో, కొన్ని విషయాల్లో మన ఇష్ట, అయిష్టాల్లో సత్యం లేకపోవచ్చు; మనకు నచ్చిన, నచ్చని వాటిల్లో సత్యం లేకపోవచ్చు. కాబట్టి మనం మనల్ని దాటుకుని లేదా మనల్ని మనం మార్చుకుని సత్యంలోకి వెళ్లవలసి ఉంటుంది. ఆ పని ఎంత తొందరగా జరిగితే మనకు అంత మేలు జరుగుతుంది. క్షేత్ర వాస్తవాన్ని తెలుసుకోగలగడం, ఆపై సత్యాన్ని అవగతం చేసుకోగలగడం మనిషి జీవితంలో తప్పకుండా నేర్చుకోవలసినవి.

మనకు ముందు వచ్చిన వాళ్లు చెప్పారు కాబట్టి, మనకు ముందే కొందరు నమ్మారు కాబట్టి, కొందరు చెబుతున్నారు కాబట్టి, కొందరు అనుకుంటున్నారు కాబట్టి, ప్రచారంలో ఉన్నాయి కాబట్టి, వాడుకలో ఉన్నాయి కాబట్టి ఉన్నవి సరైనవే అని స్వీకరించే ధోరణి వాంఛనీయం కాదు. అది నాసిరకం పోకడ. అది ఆదర్శనీయమైనది కాదు.

ఏదో అనుకోవడం, దేన్నో ఊహించుకోవడం సరైనవి కాకపోవడమే కాదు, అత్యంత హానికరమైనవి కూడా. ఒక రోగి తనకు రోగం ఉంది అన్న వాస్తవాన్ని తెలుసుకుంటే దానికి తగిన వైద్యం చేసుకుని లాభపడడం జరుగుతుంది. ఏ విషయంలో అయినా ఎంత తెలుసుకుంటే అంత లాభం ఉంటుంది. తెలివిడిలోకి వెళ్లేందుకు అభిప్రాయాలవల్ల ఏర్పడ్డ నమ్మకం అడ్డంకిగా ఉంటూనే ఉంటుంది. మనం ఆ అడ్డంకిని వీలైనంత వేగంగా తొలగించుకోవాలి.

చలామణిలో ఉన్నవాటిని నమ్మడం మనిషి బలహీనతల్లో బలమైంది. ఆ బలమైన బలహీనత మనిషిని ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద దెబ్బలు కొడుతూనే ఉంటుంది. మనిషి ఆ దెబ్బల నొప్పిని అనుభవిస్తూనే ఉన్నాడు. 'నమ్మడంపై నాకు నమ్మకం లేదు, తెలుసుకోవడమే నా విధానం' అని ఓషో ఒక సందర్భంలో అన్నారు. తెలుసుకునే విధానానికి మనం అలవాటు పడాలి.'ఏది సత్యం?' ఈ ప్రశ్నకు 'దేని ప్రభావం మంచి చేస్తుందో అది సత్యం' అని మనుస్మృతిలోని మాటల్ని ఉటంకిస్తూ బుద్ధుడు తెలియజెప్పాడు. అమెరికా దేశపు తత్త్వవేత్త విలియమ్ జేమ్స్ కూడా ఈ మాటల్ని చెప్పారు. ఒక ప్రయత్నానికి వచ్చిన ప్రభావంవల్ల జరిగిన మంచి సత్యం. మనకు మంచి కావాలి కనుక మనకు సత్యం కావాలి.

నమ్మడం, అభిప్రాయపడడం ఇవి అర్థంలేనివి. ఆపై అనర్థదాయకమైనవి. అధ్యయనం చేస్తే కానీ అవగాహన రాదు. ఏది ఉందో, ఏది లేదో, ఏది అవునో, ఏది కాదో మనం తెలుసుకోవాలి. ఇకనైనా, ఇపుడైనా నిజానిజాలను తేల్చుకుందాం. కళ్లు తెరిస్తే కానీ దృశ్యం కనిపించదు. నిద్రలేస్తే కానీ నడక మొదలవదు. మనం నిద్రలేచి నడక మొదలుపెడదాం. 'నా భావన', 'నేనేం అంటానంటే' అన్న మధ్యతరగతి మాంద్యాన్ని వదిలించుకుందాం; ఉన్న మిథ్యలను విదిలించుకుని ముందుకెళదాం. ప్రయత్నించి సత్యాన్ని సాధిద్దాం; సత్యంతో మనుగడను సాగిద్దాం.

'సత్యాన్ని అమృతంలా సేవించు' అని అష్టావక్రగీత చెబుతోంది. సత్యాన్ని సేవించడానికి అలవాటు పడదాం. సత్యం రుచిగా ఉంటుంది. ఆ రుచిని తెలుసుకుందాం. ఆ తరువాత సత్యం రుచికి మాలిమి అయిపోయి జీవితాన్ని మనం రుచికరం చేసుకుందాం. సత్యం జ్ఞానాన్ని ఇస్తుంది. 'జ్ఞానం స్వేచ్ఛకు ఆధారం' అని తెలియజెప్పారు ఆది శంకరాచార్య. సత్యం ద్వారా జ్ఞానాన్ని, జ్ఞానం ద్వారా స్వేచ్ఛను పొంది మనం సరిగ్గా, ఉన్నతంగా జీవిద్దాం; జీవితాన్ని విలువైందిగా చేసుకుందాం.

> అభిప్రాయాలు, అనుకోవడాలు, నమ్మకాలు వీటిని మనలో పేర్చుకుని మనల్ని మనం మోసుకోవడం జీవనం కాదు; వాటివల్ల మనలో మనం కూరుకు పోవడం జీవితం కాకూడదు. ఎరుకను అనుసరిద్దాం; ఎదుగుతూ ఉందాం.

– రోచిష్మాన్

సువార్త

సింహంలాంటి ధైర్యం

నీతిమంతులు సింహం వలె ధైర్యంగా ఉందురు. (సామె. 28:1). జ్ఞానియైన సొలొమోను పరిశుద్ధాత్మ ప్రేరేపణతో రచించిన సామెతల గ్రంథానికి ఉన్న ప్రాముఖ్యత మనకందరికి విదితమే. అడవిలో సింహం ఆకలి వేసినప్పుడు గర్జన చేస్తుంది. చిన్న చిన్న జంతువులు ఆ గర్జనకు భయపడి దానిముందుకే వస్తాయట. నచ్చినదాన్ని తిని ఆకలిని తీర్చుకుంటుంది.

దేవుని నీతితో తన జీవితాన్ని నింపుకున్నవాడు కూడా అంతకన్నా ఎక్కువ ధైర్యంతో నివసిస్తాడనేది లేఖన సత్యం. ఎవ్వరును తరుమకుండానే దుష్టుడు పారిపోతాడు. ప్రతి మనిషిని పాపం తరుముతుంది. పాపాలు క్షమించబడకపోతే మానవుడు దేవుని రాజ్యంలో నివసించలేడు. ఒకడు కొత్తగా జన్మించితేనేగాని దేవుని రాజ్యాన్ని చూడలేడని ప్రభువైన యేసుక్రీస్తు నీకొదేముతో చెప్పారు. క్షమించబడని పాపాలే మనిషిని నిత్య నాశనం లోనికి ఈడ్చుకొని పోతున్నాయి. లోకంలో చాలా మంది దుర్నీతితో నింపబడి సత్యాన్ని అడ్డగిస్తున్నారు. మరికొందరు తాము మంచివారమని తలస్తూ స్వనీతితో నింపబడి దేవుని మహిమ పరచలేకపోతున్నారు. దైవికసత్యాన్ని అంగీకరించకుండా మనిషి చేసే ప్రతి మంచి కార్యం దేవుని దృష్టిలో మురికి గుడ్డల వంటిదే. బల్ల చాలా మురికిగా ఉంది... మసిగుడ్డతో తుడువు అన్నాట్ట ఎవరో! మురికితో నింపబడిన జీవితాన్ని మసిగుడ్డ అనే పైపై భక్తికార్యాలతో తుడవడం ద్వారా ప్రయోజనం ఏమిటి?



విశ్వాసం ద్వారా మానవుడు ఉచితంగా నీతిమంతుడుగా తీర్చబడుతున్నాడు. దేవుని నీతి హృదయాలలో నింపబడుట ద్వారా అనేక ఆధ్యాత్మిక ఆశీర్వాదాలను మానవుడు స్వంతం చేసుకోవచ్చు. వాటిలో ప్రధానమైనది 'ధైర్యం'. పాపం మనిషిలో భయాన్ని పుట్టిస్తే దేవుని ఆత్మ మనిషిలో ధైర్యాన్ని పుట్టిస్తుంది. దేవుని మాటతో సృష్టించబడిన సింహానికే అంత ధైర్యం ఉంటే దేవుని పోలికలో సృష్టించబడిన మనిషికి ఇంకెంత ధైర్యం ఉండాలి?

ప్రియ మిత్రమా! చీటికిమాటికి భయపడి ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు ఎందుకు ముందుకు సాగలేకపోతున్నావు? చూడుము నా అరచేతిలో నిన్ను చెక్కుకున్నానని సెలవిచ్చిన దేవుని మాటను ఎన్నడును మరిచిపోవద్దు. నా దేవుడు నాకు వెలుగు రక్షణగా ఉన్నాడు గనుక నేను ఎవ్వరికి భయపడను అని దావీదులా ఎప్పుడు చెప్పగలవు? (కీర్తన 27:1). దేవుని నీతితో సమృద్ధిగా నింపబడి దేవుని చిత్తానుసారంగా నడుచుకో! ప్రపంచంలో దేనికి నీవు భయపడవు. ధైర్యంతో నీవు నిలబడితే భయమే భయపడదా? విశ్వాసంతో సాగిపోతే విశ్వమే నీదవదా? భయకంపితమైన బతుకు నుంచి విడుదల చేయడానికే దేవుడు రక్షకునిగా ఈ లోకానికి వచ్చారు. గత జీవితాన్ని గురించిన లేదా భవిష్యత్తును గూర్చి భయమైనా దేవుని పాదసన్నిధిలో ఆనందించడం ద్వారా జయించవచ్చు.

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్‌పీఎస్సీ.. 9,168 గ్రూప్-4 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. గ్రూప్–4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 9,168
» పోస్టుల వివరాలు: వ్యవసాయం, సహకార శాఖ-44, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి-మత్స్య శాఖ-2,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ-307,వినియోగదారుల వ్యవహారాలు ఫుడ్-పౌర సరఫరా శాఖ-72,ఎనర్జీ డిపార్ట్‌మెంట్-2,పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం-23, ఆర్థిక శాఖ-255, సాధారణ పరిపాలన విభాగం-05, ఆరోగ్య, వైద్య-కుటుంబ సంక్షేమశాఖ-338, ఉన్నత విద్యా శాఖ-742, హోం శాఖ-133, పరిశ్రమలు, వాణిజ్య శాఖ-07, నీటిపారుదల, కమాండ్ఏరియా అభివృద్ధి-51, కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ-128, మైనారిటీ సంక్షేమ శాఖ-191, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్-2701, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి-1245, ప్రణాళికా విభాగం-02, రెవెన్యూ శాఖ-2077, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ-474, మాధ్యమిక విద్యా విభాగం-97, రవాణా, రోడ్లు, భవనాల శాఖ-20, గిరిజన సంక్షేమ శాఖ-221, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ విభాగం-18, యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్-13.
» ఎంపిక విధానం: రాతపరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 23.12.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: 12.01.2023
» పరీక్ష తేదీ: ఏప్రిల్/మే 2023.
» వెబ్‌సైట్: https://www.tspsc.gov.in

ఏపీ వైద్య కళాశాలల్లో 631 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా సుపత్రుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన డైరెక్ట్/లేటరల్ ఎంట్రీ విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 631
» అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం, ఎండీ, ఎంఎస్సీ) పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: 07.12.2022
» వెబ్‌సైట్: dme.ap.nic.in

తెలంగాణ గ్రూప్స్ ఉద్యోగార్థులకు శుభవార్త! రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గ్రూప్ 4 నోటిఫికేషన్ విడుదల చేసింది. అదేవిధంగా గ్రూప్ 2, గ్రూప్ 3 రెండు సర్వీసుల్లోనూ కొత్తగా మరి కొన్ని ఉద్యోగాలను చేర్చింది. దీంతో పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది! మరోవైపు గ్రూప్ 2, 3 నోటిఫికేషన్‌ల విడుదలకు కసరత్తు ప్రారంభించింది. దీంతో ఈ మూడు నోటిఫికేషన్లకు ప్రిపేర్ అవ్వాలా.. లేదా ఏదో ఒకదానిపైనే పూర్తిగా దృష్టిపెట్టడం మంచిదా అనే సందిగ్ధంలో ఎంతో మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం...

ఇప్పటికే 9,168 పోస్టులతో గ్రూప్ 4 ప్రకటన వచ్చేసింది. పోస్టుల సంఖ్య భారీగానే ఉంది. కాబట్టి ముందు గ్రూప్ 4పై దృష్టిపెట్టి దీన్ని సొంతం చేసుకుందామనే ఆలోచన చేస్తారు. వాస్తవానికి గ్రూప్1, గ్రూప్2, 3కి సన్నద్ధమయ్యే అభ్యర్థులు కూడా గ్రూప్ 4 రాసే అవకాశం ఉంది. వీరితో పాటు పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు, టీచర్ పోస్టుల కోసం ప్రిపేర్ అవుతున్న వారు కూడా పోటీ పడతారు. పోటీ తీవ్రంగానే ఉంటుంది. కాబట్టి గ్రూప్ 4నే లక్ష్యంగా చేసుకుందాం.. అనే ఆలోచన సరికాదు. త్వరలో గ్రూప్ 2, 3 నోటిఫికేషన్ కూడా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి గ్రూప్ 4లో ఉన్న ప్రత్యేక సిలబస్ కోసం రోజుకు కొంత సమయం కేటాయిస్తూ.. మిగతా సమయంలో గ్రూప్2, 3లకు ఏకకాలంలో ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. గ్రూప్ 4లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1 జనరల్ స్టడీస్ 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటుంది. పేపర్ 2 సెక్రటేరియల్ ఎబిలిటీస్ 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటుంది. పేపర్ 1లోని సిలబస్ అంశాలు దాదాపు అన్ని గ్రూప్ పరీక్షల్లో ఉంటాయి. పేపర్ 2కు మాత్రం అభ్యర్థులు కొంత ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది.

గ్రూప్-2 మరో 100 పోస్టులు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం– గ్రూప్–2లో అదనంగా మరో 100 పోస్టుల వరకు పెరిగే వీలుంది. వాస్తవానికి ఈ ఏడాది ఆగస్టు 31న జారీ చేసిన జీఓ ప్రకారం–గ్రూప్–2లో 16 హోదాల్లో మొత్తం 663 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. తాజాగా జీఓ ప్రకారం–కొత్తగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఇతర శాఖలు), డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్(జువెనైల్ కరెక్షనల్ సర్వీసెస్), అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(బీసీ వెల్ఫేర్ సబ్ సర్వీస్), అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్(ట్రైబల్ వెల్ఫేర్ సబ్ సర్వీస్), అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(ఎస్.సి.డి.డి. సబ్ సర్వీస్) హోదాలను చేర్చారు. దీంతో.. గ్రూప్–2 పోస్టులు మరో 100 వరకు పెరిగే అవకాశం ఉంది.

గ్రూప్స్.. కామన్‌గా జాబ్ కొట్టేలా!

» తెలంగాణలో వెలువడిన గ్రూప్ 4 నోటిఫికేషన్
» త్వరలో గ్రూప్–2, 3 ప్రకటన వెలువడే అవకాశం
» రెండు సర్వీసుల్లోనూ పెరగనున్న పోస్టుల సంఖ్య
» ఒకే ప్రిపరేషన్‌తో గ్రూప్స్ సన్నద్ధత పొందే వీలు

గ్రూప్-3 కూడా ఇదే బాట

గ్రూప్–3 సర్వీసుల్లోనూ పోస్టుల సంఖ్య పెరగనుంది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం–ఎనిమిది హోదాల్లో 1,373 పోస్టులకు అనుమతులిచ్చారు. ఈ సర్వీసుకు సంబంధించి కూడా కొత్తగా అకౌంటెంట్, ఆయా హెచ్ఓడీల్లో సీనియర్ అసిస్టెంట్ /అకౌంటెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్/అకౌంటెంట్ లేదా తత్సమాన హోదాలను కొత్తగా కలిపారు. దీంతో.. గ్రూప్–3లోనూ మరో 200కు పైగా పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి.

నోటిఫికేషన్‌లు ఎప్పుడు?


గ్రూప్ 2, 3 ఈ రెండు సర్వీసులకు సంబంధించి ఈ నెలలో(డిసెంబర్‌లో)నే నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని సమాచారం. కాబట్టి అభ్యర్థులు నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా.. వెంటనే ప్రిపరేషన్ ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సర్వీసులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే ఒకే సమయంలో రెండింటికీ సన్నద్ధత లభిస్తుందని పేర్కొంటున్నారు.

గ్రూప్ 2, 3 సిలబస్ ఒకే రీతి

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–2, 3 సిలబస్ దాదాపు ఒకే రీతిలో ఉంటుంది. దీన్ని ఉద్యోగార్థులు తమకు అనుకూలంగా మలచుకోవాలి. రెండు పరీక్షల సిలబస్‌ను బేరీజు వేసుకుంటూ..అభ్యసనం సాగిస్తే ఒకే సమయంలో రెండు సర్వీసులకు సన్నద్ధత పొందొచ్చు. గ్రూప్–2ను నాలుగు పేపర్లుగా, గ్రూప్–3ను మూడు పేపర్లుగా నిర్వహించనున్నారు. గ్రూప్–2లో మాత్రం నాలుగో పేపర్‌గా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం అనే అంశాలతో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ అంశాలను గ్రూప్–3లోని పేపర్–2, పేపర్–3 అంశాలతో సమ్మిళితం చేసుకునే అవకాశం ఉంది.

బేరీజు వేసుకుంటూ

గ్రూప్–2, 3 అభ్యర్థులు రెండు సర్వీసులకు సంబంధించిన సిలబస్‌ను ముందుగా బేరీజు వేసుకోవాలి. రెండు పరీక్షల్లో పేర్కొన్న పేపర్లు, సబ్జెక్టులు, సిలబస్ అంశాలపై పూర్తి స్పష్టత తెచ్చుకోవాలి. ఒకే తరహాలో ఉన్న అంశాలను ఒకే సమయంలో చదివేలా.. వేర్వేరుగా ఉన్న అంశాలకు నిర్దిష్టంగా ప్రత్యేక సమయం కేటాయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. రెండింటిలోనూ ఒకే సిలబస్ అంశాలు ఉన్నాయి. కాబట్టి ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదనేది నిపుణుల అభిప్రాయం.



పుస్తకాల ఎంపిక

గ్రూప్–2, 3 అభ్యర్థులు రెండు పరీక్షల సిలబస్‌పై స్పష్టత తెచ్చుకున్న తర్వాత పుస్తకాల ఎంపికపై దృష్టిపెట్టాలి. పరీక్షలకు సంబంధించిన సిలబస్ అంశాలన్నీ ఉన్న పుస్తకాలను సేకరించుకోవాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి మార్కెట్లో పదుల సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి గందరగోళ పడకుండా ఏవైనా ఒకట్రెండు ప్రామాణిక పుస్తకాలను ఎంచుకోవాలి. అకాడమీ పుస్తకాలను చదవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

డిస్క్రిప్టివ్ విధానంలోనే

ప్రామాణిక పుస్తకాలు ఎంపిక చేసుకున్న అభ్యర్థులు వాటిని క్షుణ్నంగా చదివేలా వ్యవహరించాలి. ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాలకు వరకూ సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి. గ్రూప్–2,3 రెండు పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో,బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. కాని అభ్యర్థులు ప్రిపరేషన్‌లో మాత్రం డిస్క్రిప్టివ్ విధానం అనుసరించాలి. చదువుతూ ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరచుకునేలా నోట్స్ రాసుకోవాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

అనుసంధాన విధానం

గ్రూప్–2, 3 ప్రిపరేషన్‌లో అభ్యర్థులు అనుసంధాన దృక్పథం అనుసరించాలి. అంటే..రెండు పరీక్షల్లోని సిలబస్‌లో కామన్‌గా ఉన్న అంశాలను సమ్మిళితం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ ..ఇలా కామన్ అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది.

జాతీయం నుంచి స్థానికం వరకు

గ్రూప్–2, 3 అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో జాతీయ అంశాలు మొదలు స్థానిక అంశాల వరకూ అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి. తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి దశ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ సామాజిక ముఖచిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్

చదువుతున్నప్పుడే ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా సొంతంగా నోట్స్‌లో రాసుకోవాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనం, ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

ప్రభుత్వ విధానాలు

జాతీయ, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు; వాటి పరిష్కారానికి ప్రభుత్వాల విధానాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. మహిళా సాధికారత కోసం జాతీయస్థాయిలో పలు పథకాలు తెచ్చారు. మైనారిటీ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు రూపొందిస్తున్నారు. అదే విధంగా ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు నూతన పాలసీలు అమలు చేస్తున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఉదాహరణకు నూతన విద్యా విధానం ముఖ్యాంశాలతోపాటు ఇప్పటి వరకు తీసుకొచ్చిన విద్యా విధానాలు, ప్రస్తుత విధానానికి మధ్య ఉన్న వ్యత్యాసం, ఉద్దేశం, ప్రధానాంశాలు, లక్ష్యాలు.. ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.

తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న అంశాలపై పరీక్షలో ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి ముందుగా తెలంగాణ పాలసీలపై అవగాహన పెంచుకోవాలి. తెలంగాణ ఏర్పాటు, దానికి సంబంధించి ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు.. నిధులు.. నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారన్నది తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించిన విధానాలపై ఏ పథకాలు తెచ్చారో తెలుసుకోవాలి.

పేపర్-4 ప్రత్యేకంగా

గ్రూప్–2లో నాలుగో పేపర్‌గా పేర్కొన్న.. తెలంగాణ ఆలోచన(1948–1970), ఉద్యమ దశ(1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం–1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణకు కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

ప్రత్యేక అంశాలకు ఇలా

చరిత్రకు సంబంధించి తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు–రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

జాగ్రఫీలో.. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై అవగాహన కూడా అవసరం.

ఎకానమీలో.. తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు–ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన ఏర్పరచుకోవాలి. సిలబస్ పరిశీలన నుంచి పేపర్ వారీగా నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే.. ఒకే సమయంలో గ్రూప్–2, 3, 4 లకు సన్నద్ధత పొందే అవకాశం లభిస్తుంది.



పోరాడి ఓడిన భారత హాకీ జట్టు

ఆస్ట్రేలియా పురుషుల హాకీ జట్టుతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత జట్టు 1–4తో కోల్పోయింది. అడిలైడ్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 4–5తో ఓడింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (24వ, 60వ ని.లో) రెండు గోల్స్... అమిత్ రోహిదాస్ (34వ ని.లో), సుఖ్‌జీత్ (55వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున విఖామ్ (2వ, 17వ ని.లో) రెండు గోల్స్.. జలెవ్‌స్కీ (30వ ని.లో), అండర్సన్ (40వ ని.లో), వెటన్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.



రన్నరప్ ఉన్నతి హుడా

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్‌–17 బాలికల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణి ఉన్నతి హుడా రన్నరప్‌గా నిలిచింది. థాయ్‌లాండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో హరియాణాకు చెందిన టాప్ సీడ్ ఉన్నతి 18–21, 21–9, 14–21తో సారున్‌రక్ విటిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. అండర్‌–17 బాలుర డబుల్స్ ఫైనల్లో అర్ష్ మొహమ్మద్‌–సంస్కార్ (భారత్) జోడీ 13–21, 21–19, 22–24తో లాయ్ పో యు–లిన్ యి హావో (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

మెస్సీ గోల్... అర్జెంటీనా జిగేల్

సౌదీ అరేబియా చేతిలో అనూహ్యంగా ఓడిన అర్జెంటీనా ఆ తర్వాత ప్రతీ మ్యాచ్‌లోనూ జాగ్రత్త పడింది. ఆశించినట్లే నాకౌట్ చేరిన మెస్సీ జట్టు తాజాగా ఆస్ట్రేలియాను ఓడించింది. మెస్సీ సాధించి పెట్టిన క్లిష్టమైన గోల్ మ్యాచ్‌కే హైలైట్! గోల్‌పోస్ట్ వద్ద ముగ్గురు ఆసీస్ డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ మెస్సీ కొట్టిన గోల్‌తో అర్జెంటీనా ఖాతా తెరిచింది. ఆ తర్వాత అదే దూకుడు కొనసాగించి తొమ్మిదోసారి ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

- 2–1తో ఆస్ట్రేలియాపై గెలుపు
- తొమ్మిదోసారి క్వార్టర్ ఫైనల్లోకి
- ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీ



మెస్సీ గోల్ చేశాడిలా...





దోహా: తొలి అర్ధభాగంలో మెస్సీ కళ్లుచెదిరే గోల్... ఆఖరి క్షణాల్లో బంతిపై గోల్‌కీపర్ ఎమి మార్టినెజ్ పట్టు అర్జెంటీనాను క్వార్టర్స్ చేర్చాయి. కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ ఆడుతున్న అర్జెంటీనా స్టార్ లయోనెల్ మెస్సీ గట్టి పట్టుదలనే కనబరుస్తున్నాడు. కెరీర్‌లో 1000వ మ్యాచ్ ఆడిన ఈ సూపర్‌స్టార్ నాకౌట్ పోరులో అసాధారణ గోల్‌తో మెరిశాడు. అర్జెంటీనాను మురిపించాడు. శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో అర్జెంటీనా 2–1తో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం మూడు గోల్స్ నమోదయ్యాయి. కానీ వీటిలో మెస్సీ గోల్ మాత్రం అద్భుతం. అలాంటి కళ్లుచెదిరే గోల్‌తో జట్టు విజయానికి బాట వేశాడు. ఆట ఆరంభం నుంచే మాజీ చాంపియన్ అర్జెంటీనా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులకు పదును పెట్టింది. ఈ క్రమంలో ఆట 35వ నిమిషంలో మొదట సహచరుడు గోల్ చేసేందుకు మెస్సీ 'డి' ఏరియా వెలుపలి నుంచి ఇచ్చిన క్రాస్ పాస్‌ను ఆస్ట్రేలియన్లు అడ్డుకున్నారు. తిరిగి మెస్సీ 'డి' ఏరియాలోకి వచ్చి గోల్‌పోస్ట్‌కు సమీపంలో కొట్టిన షాట్ ముగ్గురు ఆస్ట్రేలియా ఆటగాళ్లను బోల్తా కొట్టిస్తూ లక్ష్యాన్ని చేరింది. దీంతో తొలి అర్ధభాగాన్ని అర్జెంటీనా 1–0తో ముగించింది.

ద్వితీయార్ధంలో ఆసీస్ గోల్ కీపర్ మాథ్యూ రియాన్ 'అతి'విశ్వాసం వల్ల అప్పనంగా గోల్‌ను సమర్పించుకుంది. తన గోల్‌పోస్ట్ వద్ద బంతిని చేతుల్లో బంధించకుండా ఓ స్ట్రయికర్‌లా కాలితో కిక్ షాట్ ఆడగా అది కాస్తా గతి తప్పింది. అక్కడే ఉన్న జులియన్ అల్వారెజ్ (57వ ని.లో) రెప్పపాటు కాలంలోనే దాన్ని సులువుగా గోల్‌పోస్ట్‌లోకి పంపించాడు. దీంతో అర్జెంటీనా ఆధిక్యం (2–0) రెట్టింపైంది. అయితే ఆస్ట్రేలియా తరఫున 77వ నిమిషంలో క్రెయిగ్ గుడ్‌విన్ గోల్ కోసం కొట్టిన షాట్‌ను హెడర్‌తో ఎంజో ఫెర్నాండెజ్ (అర్జెంటీనా) నిలువరించేందుకు యత్నించగా... అది కాస్తా గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో సెల్ఫ్ గోల్ నమోదైంది. ఆఖరి స్టాపేజ్ (ఇంజ్యూరి టైమ్ 90+7వ ని.లో) 30 క్షణాల్లో ముగుస్తుందనగా ఆస్ట్రేలియన్ సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ గరంగ్ కూల్ దాదాపు గోల్ చేసినంత పనైంది. అతని షాట్‌ను అర్జెంటీనా గోల్‌కీపర్ మార్టినెజ్ చేతులతో ఆపేందుకు ప్రయత్నించాడు. బంతి చేతిని తాకి నేలపై పడి లేచింది. వెంటనే టర్న్ తీసుకున్న మార్టినెజ్ రెండు చేతులతో బంధించి బోర్లా పడుకున్నాడు. ఈ హఠాత్పరిణాంతో ఊపిరి పీల్చుకున్న అర్జెంటీనా సహచరులు తమ గోల్‌కీపర్‌ను హత్తుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంతిపై ఎక్కువగా అర్జెంటీనానే ఆధిపత్యం కనబరిచింది. 53 శాతం తమ ఆధీనంలో ఉంచుకున్న మెస్సీ జట్టు గోల్ కోసం 14 సార్లు ప్రయత్నించింది. మరోవైపు 35 శాతం బంతిపై పట్టు సాధించిన ఆస్ట్రేలియా 5 సార్లు లక్ష్యంపై గురిపెట్టినా సఫలం కాలేదు. మెగా టోర్నీలో మెస్సీకిది మూడో గోల్. మొత్తం ప్రపంచ కప్‌లలో తొమ్మిదో గోల్. ఈ క్రమంలో మారడోనా (8) రికార్డును అతను అధిగమించాడు. ప్రపంచకప్ టోర్నీల్లో అత్యధిక గోల్స్ చేసిన అర్జెంటీనా ఆటగాళ్ల జాబితాలో మెస్సీ రెండో స్థానంలో నిలిచాడు. 10 గోల్స్‌తో బటిస్టుటా మొదటి స్థానంలో ఉన్నాడు. ఓవరాల్‌గా కెరీర్‌లో మెస్సీ 789 గోల్స్ సాధించాడు.

ప్రపంచకప్‌లో నేడు (ప్రిక్వార్టర్ ఫైనల్స్)

జపాన్ x క్రొయేషియా
రాత్రి గం. 8:30 నుంచి

బ్రెజిల్ x దక్షిణ కొరియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

ఫ్రాన్స్ జోరు...

క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్

దోహా: ఆద్యంతం దూకుడుగా ఆడిన డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ తొమ్మిదోసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పోలాండ్‌తో ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్ 3–1 గోల్స్ తేడాతో పోలాండ్ జట్టును ఓడించింది. ఫ్రాన్స్ తరఫున ఒలివియర్ జిరూడ్ (44వ ని.లో) ఒక గోల్ చేయగా... ఎంబాపె (74వ, 90+1వ ని.లో) రెండు గోల్స్ సాధించి ఫ్రాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పోలాండ్ జట్టుకు కెప్టెన్ లెవన్‌డాస్కీ (90+9వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఆరంభంలో ఫ్రాన్స్‌ను నిలువరించిన పోలాండ్ తొలి అర్ధభాగం చివర్లో తడబడింది. ఎంబాపె అందించిన పాస్‌ను జిరూడ్ లక్ష్యానికి చేర్చడంతో ఫ్రాన్స్ ఖాతా తెరిచింది. జిరూడ్ కెరీర్‌లో ఇది 52వ గోల్. ఈ గోల్‌తో ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా థియరీ హెన్రీ (51 గోల్స్) పేరిట ఉన్న రికార్డును జిరూడ్ బద్దలు కొట్టాడు. ఇంగ్లండ్, సెనెగల్ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్ ఆడుతుంది.



ఎంబాపె, జిరూడ్ సంబరం

'బ్లిట్జ్' చాంపియన్ అర్జున్

హారికకు మూడో స్థానం ● ముగిసిన టాటా స్టీల్ ఇండియా చెస్ టోర్నీ



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ అంతర్జాతీయ టోర్నీ బ్లిట్జ్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచాడు. పది మంది మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 18 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో వరంగల్‌కు చెందిన 19 ఏళ్ల అర్జున్ 12.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. చాంపియన్‌గా నిలిచిన అర్జున్‌కు 7,500 డాలర్ల (రూ. 6 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీతోపాటు ట్రోఫీ లభించింది. 10 గేముల్లో గెలిచిన అర్జున్ ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని మరో మూడు గేముల్లో ఓడిపోయాడు. 11.5 పాయింట్లతో నకమురా (అమెరికా) రెండో స్థానంలో, 9.5 పాయింట్లతో షఖ్రియార్ (అజర్‌బైజాన్) మూడో స్థానంలో నిలిచారు. ఇదే టోర్నీలో ర్యాపిడ్ ఈవెంట్‌లో అర్జున్ రన్నరప్‌గా నిలిచాడు.



బ్లిట్జ్ ఈవెంట్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మూడో స్థానంలో నిలిచింది. నిర్ణీత 18 రౌండ్ల తర్వాత హారిక 11 పాయింట్లు సాధించింది. ఎనిమిది గేముల్లో గెలిచిన హారిక, ఆరు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు గేముల్లో ఓడిపోయింది. ర్యాపిడ్ ఈవెంట్‌లోనూ హారికకు మూడో స్థానం లభించింది. భారత్‌కే చెందిన వైశాలి 13.5 పాయింట్లతో బ్లిట్జ్ ఈవెంట్‌లో టైటిల్ దక్కించుకోగా, మరియా (ఉక్రెయిన్) 12 పాయింట్లతో రన్నరప్‌గా నిలి చింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 9.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. విజేత వైశాలికి 7,500 డాలర్లు (రూ. 6 లక్షల 10 వేలు), మూడో స్థానంలో నిలిచిన హారికకు 3 వేల డాలర్లు (రూ. 2 లక్షల 44 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఆసీస్‌దే తొలి టెస్టు

నాథన్ లయన్‌కు 6 వికెట్లు



లయన్

పెర్త్: వెస్టిండీస్‌తో ఆదివారం ముగిసిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 164 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 498 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 333 పరుగులకు ఆలౌటైంది. ఆఫ్‌స్పిన్నర్ నాథన్ లయన్ (6/128) ఆరు వికెట్లతో విండీస్‌ను దెబ్బ తీశాడు. ఓవర్‌నైట్ స్కోరు 192/3తో ఆట కొనసాగించిన వెస్టిండీస్ తక్కువ వ్యవధిలో వరుస వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (110)ను లయన్ బౌల్డ్ చేయడంతోనే విండీస్ ఓటమి దిశగా పయనించింది. రెండు ఇన్నింగ్స్‌లలో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన లబుషేన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తర్వాతి టెస్టు గురువారం నుంచి జరుగుతుంది.

పాక్ లక్ష్యం 343

ప్రస్తుతం 80/2



బ్రూక్

రావల్పిండి: బ్యాటింగ్ పిచ్‌పై పాక్ జట్టుకు ఇంగ్లండ్ 343 పరుగుల ఊరించే లక్ష్యాన్ని నిర్దేశించింది. నాలుగో రోజు ఆటముగిసే సమయానికి పాక్ 2 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. ఇమాముల్ (43 బ్యాటింగ్; 7 ఫోర్లు), షకీల్ (24 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 8 వికెట్లుండగా... విజయానికి ఇంకా 263 పరుగులు చేయాలి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 499/7తో ఆట కొనసాగించిన పాక్ తొలి ఇన్నింగ్స్ 579 పరుగుల వద్ద ముగిసింది. ఇంగ్లండ్‌కు 78 పరుగుల ఆధిక్యం రాగా... అనంతరం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో ధనాధన్ ఆటతో 35.5 ఓవర్లలో 264/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ (87; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), రూట్ (73; 6 ఫోర్లు), క్రాలీ (50; 7 ఫోర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీలు సాధించారు.



మెహదీ

'ఆఖరి వికెట్'కు అప్పగించారు

- తొలి వన్డేలో భారత్ అనూహ్య ఓటమి
- ఒక వికెట్ తేడాతో బంగ్లాదేశ్ విజయం
- గెలిపించిన మెహదీ హసన్ మిరాజ్
- రెండో వన్డే బుధవారం

బంగ్లాదేశ్ లక్ష్యం 187 పరుగులు... ఒకదశలో 136/9... మరో వికెట్ తీస్తే తొలి వన్డే భారత్‌దే. కానీ మెహదీ హసన్, ముస్తఫిజుర్ టీమిండియాకు షాక్ ఇచ్చారు. 41 బంతుల్లోనే అభేద్యంగా 51 పరుగులు జోడించి తమ జట్టును గెలిపించారు. బౌలర్లు చివరి వికెట్ తీయలేకపోయినా... బ్యాటింగ్ వైఫల్యమే భారత్ పరాజయానికి కారణం. పేలవ ఆటతో పూర్తి ఓవర్లు కూడా ఆడలేక 186 పరుగులకు కుప్పకూలడంతో ఓటమికి బాట పడింది. కేఎల్ రాహుల్ మినహా ఏ ఒక్కరూ ప్రభావం చూపలేకపోగా, షకీబ్ 5 వికెట్లతో, ఇబాదత్ 4 వికెట్లతో భారత జట్టును పడగొట్టారు.



మిర్పూర్: ఆసక్తికరంగా సాగిన తొలి వన్డేలో చివరకు బంగ్లాదేశ్‌దే పైచేయి అయింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఒక వికెట్ తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 41.2 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (70 బంతుల్లో 73; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం బంగ్లాదేశ్ 46 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసి గెలిచింది. లిటన్ దాస్ (63 బంతుల్లో 41; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెహదీ హసన్ మిరాజ్ (39 బంతుల్లో 38 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టును గెలిపించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే బుధవారం జరుగుతుంది.

రాహుల్ మినహా...

అటు స్పిన్‌కు, ఇటు బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై బంగ్లా బౌలర్లు షకీబ్, ఇబాదత్ పండగ చేసుకున్నారు. ముస్తఫిజుర్ వేసిన 'మెయిడిన్'తో భారత ఇన్నింగ్స్ మొదలు కాగా, శిఖర్ ధావన్ (7) వైఫల్యం కొనసాగింది. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ (31 బంతుల్లో 27; 4 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో భారత్ స్కోరు 48 పరుగులకు చేరింది. అయితే షకీబ్ తన తొలి ఓవర్లోనే రోహిత్, కోహ్లి (9)లను అవుట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టాడు. ఈ దశలో జట్టును రాహుల్ ఆదుకున్నాడు. అయ్యర్ (39 బంతుల్లో 24; 2 ఫోర్లు), సుందర్ (19) కొద్దిసేపు అతనికి సహకరించారు. మిరాజ్ ఓవర్లో వరుస బంతుల్లో 4, 6 బాదిన రాహుల్, ఇబాదత్ వేసిన తర్వాతి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టి 49 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే వరుస ఓవర్లలో సుందర్, షహబాజ్ (0) వెనుదిరగ్గా, ఆ తర్వాత షకీబ్ మరోసారి ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. ఇబాదత్ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన అనంతరం 9వ వికెట్‌గా రాహుల్ అవుట్ కావడంతో భారత్ 200 పరుగుల మార్క్‌ను కూడా చేరలేకపోయింది.

రాహుల్ క్యాచ్ పట్టి ఉంటే...



గాయంలాంటి విషయంపై స్పష్టత ఇవ్వకున్నా, వైద్యుల సూచనల మేరకు రిషభ్ పంత్‌ను వన్డే సిరీస్ జట్టు నుంచి తప్పించినట్లు బీసీసీఐ ప్రకటించింది. ఫలితంగా ఈ మ్యాచ్‌లో రాహుల్ కీపర్‌గా వ్యవహరించాడు. బ్యాటింగ్‌లో అందరికంటే మెరుగైన ఇన్నింగ్స్ ఆడిన అతను కీపింగ్‌లో ఒక తప్పుతో విమర్శలపాలయ్యాడు. బంగ్లా మరో 32 పరుగులు చేయాల్సిన దశలో మెహదీ కొట్టిన షాట్ గాల్లోకి బాగా పైకి లేచింది. రాహుల్ వెనక్కి పరుగెడుతూ దాదాపు డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ వరకు వెళ్లినా... క్యాచ్‌ను అందుకోవడంలో విఫలమయ్యాడు. తర్వాతి బంతి కూడా ఇలాగే పైకి లేవగా డీప్ థర్డ్‌మ్యాన్ వద్ద సుందర్ కనీసం క్యాచ్ కోసం ప్రయత్నం కూడా చేయకపోవడం రోహిత్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

రాణించిన సిరాజ్...

ఇన్నింగ్స్ తొలి బంతికే నజ్ముల్ (0)ను అవుట్ చేసి చహర్ శుభారంభమిచ్చాడు. అయితే తర్వాతి బ్యాటర్లు తలా ఓ చేయి వేయడంతో బంగ్లా సులువుగానే లక్ష్యం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. దాస్, షకీబ్ (38 బంతుల్లో 29; 3 ఫోర్లు) బాధ్యతగా ఆడారు. వీరిద్దరిని సుందర్ అవుట్ చేసినా... ఒకదశలో 128/4తో బంగ్లా సురక్షిత స్థితిలోనే ఉంది. చేతిలో 6 వికెట్లతో మరో 91 బంతుల్లో 59 పరుగులు మాత్రమే చేయాల్సి ఉంది. అయితే ఈ దశలో సిరాజ్, శార్దుల్, కుల్దీప్ సేన్ ఒక్కసారిగా విజృంభించడంతో బంగ్లాదేశ్ 26 బంతుల వ్యవధిలో 8 పరుగులు మాత్రమే చేసి 5 వికెట్లు కోల్పోయింది.

అద్భుత భాగస్వామ్యం...

బంగ్లా 9వ వికెట్ కోల్పోయాక గెలుపు సమీకరణం 63 బంతుల్లో 51 పరుగులుగా ఉంది. చివరి వికెట్ కాబట్టి భారత్ గెలుపు లాంఛనమే అనిపించింది. అయితే మెహదీ అపార పట్టుదలను కనబర్చాడు. కీలక సమయంలో ముస్తఫిజుర్ (11 బంతుల్లో 10 నాటౌట్; 2 ఫోర్లు) నుంచి అతనికి సరైన సహకారం లభించింది. సేన్ ఓవర్లో రెండు సిక్సర్లతో ఆశలు పెంచిన మెహదీ, చహర్ ఓవర్లోనూ 3 ఫోర్లు కొట్టి లక్ష్యానికి చేరువ చేశాడు. చహర్ తర్వాతి ఓవర్ చివరి బంతికి సింగిల్ రావడంతో బంగ్లా శిబిరం సంబరాల్లో మునిగిపోయింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) షకీబ్ 27; ధావన్ (బి) మెహదీ 7; కోహ్లి (సి) దాస్ (బి) షకీబ్ 9; శ్రేయస్ (సి) ముష్ఫికర్ (బి) ఇబాదత్ 24; రాహుల్ (సి) అనాముల్ (బి) ఇబాదత్ 73; సుందర్ (సి) ఇబాదత్ (బి) షకీబ్ 19; షహబాజ్ (సి) షకీబ్ (బి) ఇబాదత్ 0; శార్దుల్ (బి) షకీబ్ 2; చహర్ (ఎల్బీ) (బి) షకీబ్ 0; సిరాజ్ (సి) మహ్ముదుల్లా (బి) ఇబాదత్ 9; కుల్దీప్ సేన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (41.2 ఓవర్లలో ఆలౌట్) 186. **వికెట్ల పతనం:** 1–23, 2–48, 3–49, 4–92, 5–152, 6–153, 7–156, 8–156, 9–178, 10–186. **బౌలింగ్:** ముస్తఫిజుర్ 7–1–19–0, హసన్ 7–1–40–0, మెహదీ హసన్ 9–1–43–1, షకీబ్ 10–2–36–5, ఇబాదత్ 8.2–0–47–4.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నజ్ముల్ (సి) రోహిత్ (బి) చహర్ 0; లిటన్ దాస్ (సి) రాహుల్ (బి) సుందర్ 41; అనాముల్ (సి) సుందర్ (బి) సిరాజ్ 14; షకీబ్ (సి) కోహ్లి (బి) సుందర్ 29; ముష్ఫికర్ (బి) సిరాజ్ 18; మహ్ముదుల్లా (ఎల్బీ) (బి) శార్దుల్ 14; అఫీఫ్ (సి) సిరాజ్ (బి) సేన్ 6; మెహదీ (నాటౌట్) 38; ఇబాదత్ (హిట్‌వికెట్) (బి) సేన్ 0; హసన్ (ఎల్బీ) (బి) సిరాజ్ 0; ముస్తఫిజుర్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (46 ఓవర్లలో 9 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1–0, 2–26, 3–74, 4–95, 5–128, 6–128, 7–134, 8–135, 9–136. **బౌలింగ్:** దీపక్ చహర్ 8–1–32–1, సిరాజ్ 10–1–32–3, కుల్దీప్ సేన్ 5–0–37–2, షహబాజ్ 9–0–39–0, వాషింగ్టన్ సుందర్ 5–0–17–2, శార్దుల్ 9–1–21–1.

సినిమా

కొత్త కబురు

హీరోయిన్ కీర్తీ సురేశ్ కొత్త కబురు చెప్పారు. ఆమె ప్రధాన పాత్రలో నటించనున్న సినిమా ప్రకటన వచ్చింది. 'రఘుతథా' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ మూవీకి సుమన్ కుమార్ దర్శకుడు. హిట్ వెబ్‌సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్'కు రైటర్‌గా వర్క్ చేశారు సుమన్. 'కేజీఎఫ్, కాంతార' వంటి హిట్స్ అందించిన కన్నడ హోంబలే ఫిలింస్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ నిర్మాణ సంస్థకు తమిళంలో ఇదే తొలి మూవీ. ఓ గ్రామం, అక్కడి ప్రజల కోసం ఓ యువతి చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట.



● కీర్తీ సురేశ్

ఘనంగా హన్సిక వివాహం



● హన్సిక, సోహైల్

హీరోయిన్ హన్సిక మోత్వాని వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాతో హన్సిక ఏడడుగులు వేశారు. జైపూర్‌లోని ముండోతా కోట వీరి పెళ్లికి వేదికగా నిలిచింది. ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులు, సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వివాహానికి హాజరయ్యారు. అంతేకాదు.. ఎన్జీఓలకు చెందిన పలువురు పేద పిల్లలను, అనాథ పిల్లలను కూడా పెళ్లికి ప్రత్యేకంగా ఆహ్వానించారు హన్సిక. అలాగే వివాహం జరుగుతున్న ప్రాంతంలోని చుట్టుపక్కల ఉన్న చిన్నారులకు ఆదివారం ఆమె విందు ఏర్పాటు చేయించారు. దీనిపై అటు ఫ్యాన్స్, నెటిజన్లు హన్సికపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రేక్షకులు వాటికి కనెక్ట్ అవుతారు

– లక్ష్మీభూపాల్



''వేర్వేరు ఆలోచనలతో ప్రేక్షకులు థియేటర్‌కి వస్తుంటారు. 'ఆర్‌ఆర్‌ఆర్', 'కేజీఎఫ్', 'విక్రమ్' వంటి యాక్షన్ మూవీస్‌ని హిట్ చేసిన ప్రేక్షకులే 'సీతారామం' వంటి లవ్ స్టోరీ, 'కాంతార' వంటి సినిమాను ఆదరించారు. కథలోని ఎమోషన్ నిజాయతీగా ఉంటే ఆడియన్స్ కనెక్ట్ అవుతారు. అందుకే నేను కూడా ఎమోషన్‌ను నమ్ముతాను'' అన్నారు డైలాగ్ రైటర్ లక్ష్మీభూపాల్. సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'గుర్తుందా..శీతాకాలం'. నాగశేఖర్ దర్శకత్వంలో భావన రవి, నాగశేఖర్, చింతపల్లి రామారావు, ఎమ్‌ఎస్ రెడ్డి, చినబాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర డైలాగ్ రైటర్ లక్ష్మీ భూపాల్ మాట్లాడుతూ– ''గుర్తుందా..శీతాకాలం' ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ సీన్స్ మనసును హత్తుకుంటాయి. నందినీరెడ్డిగారి 'అన్నీ మంచి శకునములే' కి వర్క్ చేస్తున్నాను. నాకు దర్శకత్వ ఆలోచన ఉంది. నిర్మాతగా 'మరీచిక' అనే సినిమా తీశాను'' అన్నారు.

కాశీ ప్రయాణం



● చైతన్య రావు, ఖ్యాతిలీన్

చైతన్య రావు, అలెగ్జాండర్ సాల్నికోవ్, ప్రియా పాల్వాయి, ఖ్యాతిలీన్ గౌడ ముఖ్యపాత్రల్లో మునికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏ జర్నీ టు కాశీ'. వారణాసి క్రియేషన్స్‌పై దొరడ్ల బాలాజీ, శ్రీధర్ వారణాసి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలకానుంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్‌లో చైతన్య రావు మాట్లాడుతూ– ''పనోరమా ఫిలిం ఫెస్టివల్‌లో టాప్ 25లో మా మూవీ నిలిచింది. అలాగే కోలీవుడ్ ఫిలిం ఫెస్టివల్‌లో విన్నర్‌గా నిలిచింది'' అన్నారు. ''ఇది ఒక రోడ్ జర్నీ కథ. కాశీ యాత్ర వాళ్ల జీవితంలో ఎలాంటి మార్పు తీసుకువచ్చింది అనేది మా మూవీ కథ'' అన్నారు మునికృష్ణ. ''మంచి సినిమా నిర్మించామనే తృప్తి మాకుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి–శ్రీ సాయి, సంగీతం: ఫణి కల్యాణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: తిరుపతి రెడ్డి, సమర్పణ: కేపీ లోకనాథ.

ఓ శ్రామికుడి కథ

మంజునాథ్ హీరోగా నటిస్తూ, స్వీయదర్శకత్వంలో ఓ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇందులో నయామి హీరోయిన్. వర్ష–వర్షిణి సమర్పణలో లక్ష్మీదేవి, ఎస్వీ మహేంద్రనాథ్ నిర్మిస్తున్నారు. మంజునాథ్ మాట్లాడుతూ– ''ఒక శ్రామికుడి జీవితంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. విలేజ్ నుండి సిటీకి వచ్చిన ఆ యువకుడి జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది అనేది కథ'' అన్నారు మంజునాథ్. ''ఇందులో నాలుగు భారీ యాక్షన్ సన్నివేశాలు, ఐదు పాటలు ఉంటాయి'' అన్నారు నిర్మాత లక్ష్మీదేవి. ఈ సినిమాకు సంగీతం: హరీష్, సహ–నిర్మాత: యు. గోవింద రాజులు.



● మంజునాథ్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
416	116
62,869	18,696

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	11,462	▽	21
డోజోన్స్	34,430	△	35
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,556	▽	2
డాక్స్	14,529	△	39
షాంఘై	3,156	▽	9
నికాయ్	27,778	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	80.39	82.06
€	యూరో	83.96	86.94
£	బ్రిటన్ పౌండ్	97.86	101.14
¥	జపాన్ ఎన్ (100)	59.16	61.08
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.22	56.54
S$	సింగపూర్ డాలర్	59.43	61.42
SAR	సౌదీ రియాల్	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	21.24	23.04
¥	చైనా యువాన్	10.45	12.48

ఆరోగ్య బీమా.. ఆదుకునే నేస్తం



సరిపడా కవరేజీ

హెల్త్ ప్లాన్ తీసుకునే సమయంలో ఎంత మొత్తానికి తీసుకోవాలన్నది తెల్సుకోలేని విషయం. కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోతే రూ.10లక్షలకు బేసిక్ ప్లాన్ తీసుకుని, దీనికి సూపర్ టాపప్ కింద మరో రూ.25 లక్షలు తీసుకోవచ్చు. ఆరోగ్య సమస్యలు ఉంటే, సూపర్ టాపప్‌ను రూ.50 లక్షల మొత్తానికి తీసుకోవడం నయం.

క్రాంతి (40) ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగి. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితమే ఒక కంపెనీ నుంచి మరొక కంపెనీకి మెరుగైన ప్యాకేజీ కోసం మారాడు. కొన్ని నెలలు గడిచిన తర్వాతే, మెరుగైన ప్యాకేజీ ఎందుకిచ్చారో అతడికి బోధపడింది. ఉదయం 7 గంటలకు వెళితే రాత్రి ఇంటికొచ్చేసరికి 10 అవుతోంది. 'మనకొద్దురా బాబూ ఈ జాబు' అనుకుని ఉన్నట్టుండి రాజీనామా ఇచ్చేశాడు. మరో కంపెనీలో ఉద్యోగం కోసం వెతుకులాట మొదలు పెట్టాడు. కానీ, దురదృష్టం ప్రమాదం రూపంలో ఎదురైంది. బైక్‌పై వెళుతున్న సమయంలో ప్రమాదం కారణంగా తీవ్ర గాయాలయ్యాయి. కాలికి, చేతికి ప్లేట్లు వేయాల్సి వచ్చింది. ఆసుపత్రి బిల్లు సుమారు రూ.4 లక్షలు వచ్చింది. ఈ మొత్తాన్ని అతడు క్రెడిట్ కార్డుపై సర్దుబాటు చేయాల్సి వచ్చింది. కారణం పాత కంపెనీలో ఉన్న గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ.. రాజీనామా ఇచ్చిన నెలతోనే ముగిసిపోయింది. అది తప్ప అతడికి మరో ప్లాన్ లేదు. ఈ చిన్న తప్పిదం అతడి మూడేళ్ల పొదుపు సొమ్మును పట్టుకుపోయింది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యతను సరిగ్గా అర్థం చేసుకోవాలి. పనిచేస్తున్న కంపెనీలపై ఆధారపడకుండా, తమకంటూ మెరుగైన కవరేజీతో రక్షణ కల్పించుకున్నప్పుడే ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చూసుకోవచ్చు.

- భారీగా పెరుగుతున్న చికిత్సల వ్యయాలు
- సొంతంగా భరించడం సులభం కాదు
- హెల్త్ ప్లాన్‌తో ఆర్థికంగానూ రక్షణ
- మెరుగైన చికిత్సలకు అవకాశం
- ఆలస్యం చేస్తే ప్రీమియం భారం



మనిషి ప్రాణాలను కాపాడే విషయంలో, ఆయువును పెంచడంలో వైద్య రంగం ఎంతో ప్రగతి సాధించింది. కానీ, ఇందుకు అదనపు ఖర్చు అవుతుంది. నేడు జీవన శైలి వ్యాధులు పెరిగిపోయాయి. కేన్సర్ మహమ్మారి మన సమాజంలో వేగంగా విస్తరిస్తోంది. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, మూత్రపిండాలు, లివర్ వ్యాధులు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ మారిన జీవనశైలి కారణంగా ప్రబలుతున్నవే. వీటికయ్యే వ్యయం సామాన్యులు, మధ్య తరగతి ప్రజల వల్ల అయ్యే పనికాదు. పైగా ఏటేటా వైద్య చికిత్సల వ్యయాలు 10–15 శాతం మేర భారమవుతున్నాయి. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ఏటా కొంత ప్రీమియం చెల్లించడం ద్వారా కుటుంబం అంతటికీ రక్షణ కల్పించుకోవచ్చు. ఏటా తమ ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని ప్రీమియం రూపంలో చెల్లించడం అసాధ్యమేమీ కాదు. కానీ, ఆరోగ్య సమస్య లేదా ప్రమాదం కారణంగా హాస్పిటల్‌లోచేరితే వచ్చే బిల్లును పాకెట్ నుంచి చెల్లించడం నిజంగా తలకు మించిన భారం అవుతుంది. దీని కారణంగా అప్పుల పాలు అయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. కరోనా మహమ్మారి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఎన్నింటినో అప్పుల పాలు చేసింది. ఆస్తులున్న వారు అమ్ముకుని ఒడ్డెక్కాల్సి వచ్చింది. ఈ అనుభవాలు, వాస్తవలను చూసిన తర్వాత అయినా ప్రతి ఒక్క కుటుంబం ఏదో ఒక రూపంలో హెల్త్ కవరేజీ ఉండేలా చూసుకోవాలి.

ప్రయోజనాలు..

ఆరోగ్య అత్యవసర సమయాల్లో ఆదుకునే సాధనం హెల్త్ ఇన్సూరెన్స్. ఇది ఉంటే అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌లో చేరాల్సి వస్తే అక్కడ చికిత్సల చార్జీలు, వైద్యుల కన్సల్టేషన్, అంబులెన్స్ చార్జీలు, రూమ్ చార్జీలను బీమా కంపెనీలు చెల్లిస్తాయి. అంతేకాదు డిశ్చార్జ్ చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు ఔషధాలు, వైద్య పరీక్షలకు అయ్యే వ్యయాలను కూడా భరిస్తాయి. హాస్పిటల్‌లో చేరడానికి ముందు అదే సమస్య కోసం నిర్ణీత రోజులకు చేసిన వైద్య వ్యయాలను సైతం చెల్లిస్తాయి.

ఆర్థిక స్థిరత్వం

వైద్యం ఎప్పుడు అవసరపడుతుందన్నది ఎవరూ చెప్పలేరు. ఎలాంటి చికిత్స అవసరపడుతుంది? ఎంత ఖర్చవుతుందన్నది ఊహించడం కష్టం. అలాంటి పరిస్థితి వస్తే పొదుపు సొమ్ము అంతా కరిగిపోకుండా, అప్పుల పాలు కాకుండా, ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సిన అగత్యం రాకుండా హెల్త్ ఇన్సూరెన్స్ ఆదుకుంటుంది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ఆర్థికంగా ఆదుకునే సాధనం కూడా అవుతుంది.

మెరుగైన వైద్య చికిత్సలు/రక్షణ

తమతోపాటు, తమపై ఆధారపడిన వారికి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల.. వైద్యం అవసరమైన సందర్భంలో వెనుకాడాల్సిన పని ఉండదు. అదే హెల్త్ ప్లాన్ లేదనుకోండి.. తగినంత ఆర్థిక పొదుపుల్లేనప్పుడు, హాస్పిటల్‌కు వెళ్లే విషయంలో చికిత్సల వ్యయాల గురించి ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. అదే హెల్త్ ఇన్సూరెన్స్ ఉంటే మంచి హాస్పిటల్‌కు వెళ్లి, ఖర్చుకు వెనుకాడకుండా నాణ్యమైన వైద్యం పొందే ధైర్యం వస్తుంది. ఖర్చు గురించి కాకుండా, మంచి చికిత్స గురించి ఆలోచించే స్వేచ్ఛ హెల్త్ ప్లాన్‌తో వస్తుంది.

వైద్య చికిత్సల వ్యయాలు ఏటేటా పెరుగుతుంటాయి. ముఖ్యంగా నేడు వాతావరణ కాలుష్యం, జీవనశైలి వల్ల మధుమేహం, గుండె జబ్బులు, కేన్సర్ కేసులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. వీటికి పెద్ద మొత్తంలో ఖర్చవుతోంది. ఈ భారాన్ని తమపై పడకుండా చూసుకుంటే.. జీవితంలో ముఖ్యమైన పిల్లల విద్య, వారి వివాహాలు, సొంతిల్లు, రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేసుకోవడానికి వెసులుబాటు ఉంటుంది. హెల్త్ మాదిరిగా ఈ లక్ష్యాలకు ఎలాంటి కవరేజీ ఉండదని గుర్తు పెట్టుకోవాలి.

పన్ను ప్రయోజనాలు

హెల్త్ ఇన్సూరెన్స్ వల్ల పన్ను ప్రయోజనాలు కూడా ఉన్నాయి. సెక్షన్ 80డీ కింద 60 ఏళ్లలోపు వ్యక్తులు, తాను, తన జీవిత భాగస్వామి, పిల్లల కోసం చెల్లించే హెల్త్ ఇన్సరెన్స్ ప్రీమియం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 వరకు ఉంటే, ఈ మొత్తంపై

జీవిత లక్ష్యాలకు మిగులు

పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు రూ.50వేల ప్రీమియంపై ఆదాయపన్ను మినహాయింపు ఉంది.

సొంతంగా ఉండాల్సిందే

ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి ఆయా సంస్థలు గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని అందిస్తుంటాయి. దీంతో వారు విడిగా హెల్త్ ప్లాన్ ఎందుకు లేనని అనుకుంటుంటారు. కానీ, ప్రైవేటు రంగంలో ఉద్యోగాలకు భద్రత ఉండదని తెలుసు. కంపెనీలు ఇచ్చే గ్రూప్ హెల్త్ కవరేజీ.. ఉద్యోగం మానివేయడంతో నిలిచిపోతుంది. అందుకని విడిగా ఒక ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తప్పకుండా తీసుకోవాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి మెరుగైన కవరేజీ లేకపోయినా, ఇది ఆదుకుంటుంది. తక్కువ కవరేజీకి తీసుకుని, దానికి సూపర్ టాపప్ జోడించుకోవచ్చు.

ఎంత ముందు అయితే అంత మంచిది

వైవాహిక జీవితం ఆరంభించినప్పుడు లేదా ఉద్యోగ జీవితం ఆరంభించినప్పుడే హెల్త్ కవరేజీ ఉండాలి. 20ప్లస్‌లోనే ఆరోగ్య బీమా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్లెయిమ్‌ల తిరస్కరణ సమస్య ఎదురుకాదు. ఎందుకంటే 20ప్లస్‌లో ఆరోగ్య సమస్యలు దాదాపుగా ఉండవు. కానీ, నేడు 30 దాటిన దగ్గర్నుంచి రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, శ్వాసకోస సమస్యలు వేధిస్తున్నాయి. ఆలస్యం చేసినకొద్దీ, ఇవన్నీ పూర్వం నుంచి ఉన్న ఆరోగ్య సమస్యల కిందకు వస్తాయి. కనుక వీటిని పాలసీ డిక్లరేషన్‌లో తప్పకుండా వెల్లడించాలి. అలా చేసినప్పుడు అధిక ప్రీమియం చెల్లించుకోవాల్సి వస్తుంది. పైగా అప్పటికే ఉన్న వాటికి కవరేజీ కోసం 3–4 ఏళ్లు వేచి చూడాల్సి రావచ్చు.

పలు రకాల ప్లాన్లు..

వ్యక్తిగత ఆరోగ్య బీమా, ఫ్యామిలీ ఫ్లోటర్, క్రిటికల్ ఇల్‌నెస్, టాపప్, సూపర్ టాపప్ ఇలా పలు రకాల పాలసీలు ఉన్నాయి. బేసిక్ ప్లాన్ ఏదైనా కానీ, కాంప్రహెన్సివ్ అయి ఉండాలి. అంటే అన్ని రకాల కవరేజీలతో కూడి ఉండాలి. వివాహం అయిన వారు కుటుంబం అంతటికీ ఫ్యామిలీ ఫ్లోటర్ తీసుకోవాలి. వృద్ధులైన తల్లిదండ్రులు ఆధారపడి ఉంటే, వారికి విడిగా మరో ప్లాన్ తీసుకోవడం వల్ల ప్రీమియం భారం తగ్గించుకోవచ్చు. ఇక క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్లు అనేవి.. కేన్సర్, మూత్ర పిండాల సమస్యలు, గుండె జబ్బులు, లివర్ ఫెయిల్యూర్, స్ట్రోక్ ఇలా దీర్ఘకాలిక సమస్యలు నిర్ధారణ అయినప్పుడు బీమా మొత్తాన్ని ఒకే విడత చెల్లించే ప్లాన్లు. టాపప్ ప్లాన్లు అనేవి.. బేసిక్ హెల్త్ కవరేజీ మించి వైద్య చికిత్సల వ్యయాలు అయినప్పుడు.. బేసిక్ కవరేజీ పోను అదనపు మొత్తాన్ని చెల్లించేవి.

వీటిని దృష్టిలో పెట్టుకోవాలి..

- ఎంపిక చేసుకునే బీమా కంపెనీ జాబితాలో ఎన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఉన్నాయనేది చూడాలి. ముఖ్యంగా మీరు నివాసం ఉంటున్న పట్టణంలో ఎన్ని హాస్పిటల్స్ బీమా కంపెనీ నెట్‌వర్క్ కింద ఉన్నాయో చూడాలి. నెట్‌వర్క్ హాస్పిటల్ అయితే నగదు రహిత వైద్యం పొందొచ్చు. లేదంటే చికిత్సల ఖర్చు అంతా సొంతంగా భరించి, తర్వాత క్లెయిమ్ చేసుకోవాల్సి వస్తుంది. ఇది కొంచెం శ్రమతో, సమయంతో కూడుకున్నది అవుతుంది.
- బీమా కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియోను చూడాలి. తనవద్దకు వచ్చే క్లెయిమ్‌లలో ఎన్నింటికి చెల్లింపులు చేస్తుంది.. అలాగే వచ్చిన క్లెయిమ్ అమౌంట్‌లో, ఎంత మొత్తానికి చెల్లింపులు చేసిందనే విషయాన్ని ముందే తెలుసుకోవాలి. కొన్ని బీమా కంపెనీలు పూర్తిగా తిరస్కరిస్తే, కొన్ని కంపెనీలు క్లెయిమ్‌లో కోతలు పెడుతుంటాయి. కనీసం 90 శాతానికి పైనే సెటిల్‌మెంట్ రేషియో ఉన్న వాటిని ఎంపిక చేసుకోవడం మంచిది.
- హాస్పిటల్‌లో చేరడానికి ముందు, డిశ్చార్జ్ అయిన తర్వాత ఎన్ని రోజులకు కవరేజీ ఉంటుందో (ప్రీ అండ్ పోస్ట్ హాస్పిటలైజేషన్) చూడాలి. సాధారణంగా 30–180 రోజుల వరకు ఈ కాలం ఉంటుంది. గరిష్ఠ కాలానికి చెల్లింపులు చేసే ప్లాన్లు అయితే అనుకూలం. ఎందుకంటే కొన్ని సమస్యలకు డిశ్చార్జ్ తర్వాత కూడా చాలా కాలం పాటు ఔషధాలు తీసుకోవాల్సి రావడం, మళ్లీ, మళ్లీ వైద్యుల రివ్యూలు అవసరపడతాయి.
- ఎంపిక చేసుకునే ప్లాన్‌కు తప్పకుండా రీస్టోరేషన్ సదుపాయం ఉండాలి. అంటే ఒక పాలసీ సంవత్సరంలో ఎవరైనా హాస్పిటల్‌లో చేరి కవరేజీ మొత్తం ఖర్చయిపోతే ఈ ఫీచర్ అక్కరకు వస్తుంది. కొన్ని ఒకటి నుంచి మూడు సార్లు రీస్టోరేషన్ ఇస్తుంటే, కొన్ని అన్‌లిమిటెడ్ రీస్టోరేషన్ ను కూడా ఆఫర్ చేస్తున్నాయి. దీనివల్ల అదే ఏడాది తదనంతరం హాస్పిటలైజేషన్‌కూ కవరేజీ ఉంటుంది.



- రూమ్ రెంట్ పరిమితులు, కోపే ఆప్షన్ లేని ప్లాన్ తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు ఉండవు. కోపే ఆప్షన్‌లో క్లెయిమ్ ఎదురైన ప్రతి సందర్భంలోనూ పాలసీదారు తనవంతు కొంత భరించడం. రూమ్ రెంట్ పరంగా షేరింగ్, సింగిల్ రూమ్ అనే పరిమితులు ఉంటే, హాస్పిటల్‌లో చేరినప్పుడు ఆయా రూమ్‌ల్లోనే చేరుతున్నామా? అన్నది జాగ్రత్త పడాలి. లేదంటే ఈ రూపంలోనూ పాలసీదారుపై అదనపు భారం పడుతుంది.
- నో క్లెయిమ్ బోనస్ ఫీచర్ కూడా ఉపయోగకరం. దీనికింద క్లెయిమ్ చేయని ప్రతీ సంవత్సరానికి నిర్ణీత శాతం మేర కవరేజీని బీమా కంపెనీలు పెంచుతాయి. క్లెయిమ్ వస్తే అంతే మేర తగ్గిస్తాయి.
- డైలీ క్యాష్ బెనిఫిట్‌ను చాలా బీమా కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. ఆసుపత్రిలో ఎక్కువరోజుల పాటు ఉండాల్సి వస్తే, పేషెంట్‌కు సాయంగా ఉండేవారికి అయ్యే వ్యయాలకు ఇది పనికొస్తుంది.
- అదనపు సభ్యులను చేర్చుకునే ఫీచర్ ఉండాలి.
- డేకేర్ చికిత్సలకు కవరేజీ ఇచ్చే ప్లాన్ మంచిది. కొత్త టెక్నాలజీలు, పరిశోధనలతో కొన్ని సమస్యలకు చికిత్సలు తేలిగ్గా మారుతున్నాయి. వీటికి ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం పడదు. కానీ, బీమా కంపెనీలు ఆఫర్ చేసే ఇండెమ్నిటీ ప్లాన్లలో కవరేజీ కోసం కనీసం 24 గంటల పాటు అడ్మిట్ కావాల్సి ఉంటుంది. డేకేర్ చికిత్సలకు ఇది వర్తించదు.
- అంబులెన్స్ చార్జీలను చెల్లించేలా ఉండాలి.
- ఆధునిక, రోబోటిక్ చికిత్సలకు, అవయవ మార్పిడి చికిత్సలకు కూడా కవరేజీ ఉండాలి.
- పెళ్లయి, పిల్లలు ఇంకా లేని వారు అయితే తప్పకుండా మేటర్నిటీ కవరేజీ ఉండే ప్లాన్‌కు వెళ్లాలి.
- ఏడాదికోసారి ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలను బీమా కంపెనీ ఉచితంగా ఆఫర్ చేస్తుందా? అన్నది చూడాలి.
- పాలసీ తీసుకునే నాటికే ఉన్న వ్యాధులకు కవరేజీ కోసం సాధారణంగా 4 ఏళ్ల వరకు వేచి ఉండాల్సి రావచ్చు. ఆ కాలంలో ముందు నుంచి ఉన్న వాటికి క్లెయిమ్ చేసుకోలేరు. కొన్ని ప్లాన్లు 1–2 ఏళ్ల వెయిటింగ్ పీరియడ్‌తో ఉంటున్నాయి. కాకపోతే వీటి ప్రీమియం అధికంగా ఉంటుంది.
- తీసుకున్న ప్లాన్ జీవిత కాలం పాటు రెన్యువల్ చేసుకునే ఫీచర్‌తో ఉండాలి.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకునే ముందు కంపెనీ సేవల నాణ్యత, ఎంత వేగంగా చెల్లింపులు చేస్తుంది? ఇతర కంపెనీల ప్లాన్లతో పోలిస్తే ప్రీమియం వ్యత్యాసం ఎంతన్నది తెలుసుకోవాలి.
- కొన్ని రకాల చికిత్సలకు కవరేజీ ఉండదు. పైగా కొన్ని రకాల చికిత్సలకు 2 ఏళ్లపాటు వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. వీటి వివరాలను పాలసీ వర్డింగ్ డాక్యుమెంట్ చదివి తెలుసుకోవాలి.

ఎల్‌ఐసీ వాట్సాప్ సేవలు

ఎల్‌ఐసీ తన పాలసీదారుల కోసం వాట్సాప్ సేవలను తీసుకొచ్చింది. సెలక్ట్ ఇంటరాక్టివ్ సేవలను సంస్థ చైర్‌పర్సన్ ఎంఆర్ కుమార్ ప్రారంభించారు. ఎల్‌ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న (అకౌంట్ కలిగిన) పాలసీదారులు ఈ సేవలను పొందొచ్చని సంస్థ తెలిపింది. 8976862090 అనే వాట్సాప్ నంబర్‌కు పాలసీదారులు ఎల్‌ఐసీ పోర్టల్‌లో నమోదై ఉన్న ఫోన్ నంబర్ నుంచి హాయ్ అని సందేశం పంపాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాట్సాప్ చానల్ ద్వారా అందుబాటులోని సేవలను ఎల్‌ఐసీ జాబితాగా పంపిస్తుంది. వాటిల్లో కావాల్సిన సేవకు సంబంధించి నంబర్‌ను నమోదు చేయడం ద్వారా సమాచారం పొందొచ్చు.

బరోడా బీఎన్‌పీ పారిబాస్ నుంచి మల్టీ అసెట్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పారిబాస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ 'బరోడా బీఎన్‌పీ పారిబాస్ మల్టీ అసెట్ ఫండ్'ను (ఎన్‌ఎఫ్‌వో/కొత్త పథకం) ప్రారంభించింది. ఈ నెల 12న ఈ ఎన్‌ఎఫ్‌వో ముగుస్తుంది. ఈ పథకం ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ), గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు పెడుతుంది. ఒకటికి మించిన సాధనాల్లో (మల్టీ అస్సెట్) ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం ప్రత్యేకత. విడిగా ఒక్కో సాధనంమధ్య పెట్టుబడులను వర్గీకరించుకునే నిర్వహణ ఇబ్బంది ఈ పథకం ఎంపికతో ఉండదు. ఎన్‌ఎఫ్‌వోలో భాగంగా ఒక్క ఇన్వెస్టర్ కనీసం రూ.5,000 ఇన్వెస్ట్ చేయాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-12-2022	
విశాఖ	545–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	544–00
విజయవాడ	544–00
4-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	543–00

స్టాక్స్ వ్యూ

లా ఒపాలా ఆర్‌జీ | సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 417 టార్గెట్: రూ. 484

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో లా ఒపాలా ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో అమ్మకాలు 46 శాతం జంప్‌చేసి రూ. 135 కోట్లను తాకగా.. నిర్వహణ లాభం(ఇబిటా) 50 శాతం ఎగసి రూ. 53 కోట్లను అధిగమించింది. పన్నుకు ముందు లాభం సైతం 42 శాతం వృద్ధితో రూ. 52 కోట్లకు చేరింది. దేశీ మార్కెట్లలో నెలకొన్న పటిష్ట డిమాండు ఇందుకు దోహదపడగా.. ఒపల్‌వేర్ విభాగం ప్రొడక్టుల అమ్మకాలు జోరు చూపాయి. కంపెనీ ప్రొడక్టులకు నగరాలతోపాటు.. ద్వితీయ, తృతీయస్థాయి పట్టణాల నుంచి సైతం గిరాకీ కొనసాగుతోంది. అయితే ఎగుమతుల మార్కెట్ కొంతమేర మందగించింది. గత ఆర్థిక సంవత్సరం(2021–22) మొత్తం అమ్మకాలలో విదేశీ మార్కెట్ల వాటా 16–17 శాతంకాగా.. ఈ ఏడాది



క్యూ2 ఆదాయంలో ఎగుమతులు 13–14 శాతానికి పరిమితమయ్యాయి. ప్రస్తుత మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్)లోనూ వివిధ ప్రొ డక్టులకు డిమాండు కొనసాగుతున్నట్లు యాజమాన్యం ఇటీవల పేర్కొంది. వెరసి క్యూ3 ఫలితాలు కనీసం జులై–సెప్టెంబర్ స్థాయిలో నమోదయ్యే వీలున్నట్లు భావిస్తున్నాం. నిజానికి ప్రతీ ఏడాది.. ద్వితీయార్థం (అక్టోబర్–మార్చి) అమ్మకా లే టర్నోవర్‌లో 55 శాతం వాటాను ఆక్రమిస్తుంటాయి. సెప్టెంబర్‌కల్లా చేపట్టిన లిక్విడ్ పెట్టుబడులు, రూ. 390 కోట్ల చేతిలోని నగదు బలాన్నిస్తున్నాయి.

వినతీ ఆర్గానిక్స్ | ఆనంద్ రాఠీ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,147 టార్గెట్: రూ. 2,600

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) తొలి అర్ధభాగంలో వినతీ అంచనాలు మించిన పనితీరు చూపింది. ఏప్రిల్–సెప్టెంబర్‌లో మొత్తం ఆదాయం 41 శాతం జంప్‌చేసి రూ. 1,070 కోట్లను తాకింది. ఇందుకు ఏటీబీఎస్, ఐబీబీ అమ్మకాల్లో వృద్ధి దోహదం చేసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 38 శాతం ఎగసి రూ. 280 కోట్లకు చేరింది. ఇందుకు 26 శాతం మార్జిన్లు దన్నునిచ్చాయి. పరిశ్రమలో పట్టున్న కంపెనీ దీర్ఘకాలిక అవకాశాలపై ఆశావహ అంచనాలున్నాయి. ఏటీబీఎస్‌కు గల భారీ డిమాండ్, బ్యుటిల్ ఫినాల్ వినియోగం, వీరల్ ఆర్గానిక్స్(యాంటీఆక్సిడెంట్స్) విలీనం ద్వారా భారీ వృద్ధి కొనసాగే వీలుంది. అంతేకాకుండా ఎంఈహెచ్‌క్యూ గువాయాకోల్, ఐసోఅమిలీన్(ఐబీ డెరివేటివ్స్) తయారీలోకి ప్రవేశించడం ఇందుకు సహకరించనుంది. కంపెనీకి కీలకమైన ఏటీబీఎస్, ఐబీబీ, ఐబీ విభాగాలలో పటిష్ట డిమాండు కొనసాగనున్నట్లు యాజమాన్యం అంచనా వేస్తోంది. యూరప్‌లో ప్రస్తుత మందగమన పరిస్థితులు ప్రభావం చూపబోవని పేర్కొంటోంది. గతేడాది ప్రారంభమైన బ్యుటిల్ ఫినాల్ ప్లాంటు 65 శాతం సామర్థ్యంతో పనిచేస్తోంది. వచ్చే ఏడాది(2023–24)కల్లా 85 శాతానికి చేర్చే ప్రణాళికల్లో ఉంది. 50 శాతం విస్తరణలో నున్న ఏటీబీఎస్ అమ్మకాలు భవిష్యత్ వృద్ధికి భరోసా ఇవ్వనున్నాయి. వచ్చే ఏడాది నుంచి యాంటీఆక్సిడెంట్ ప్లాంటు ద్వారా మరింత ఆదాయం జత కలవనుంది.



గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

ఒకే పథకంలో ఇన్వెస్ట్ చేయొచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పోర్ట్‌ఫోలియోలో ఒక్కటే మ్యూచువల్ ఫండ్, అది కూడా ఫ్లెక్సీక్యాప్‌ను కలిగి ఉండొచ్చా? ఎందుకంటే ఒక పథకం సైతం కనీసం 30 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది కనుక వైవిధ్యం ఉన్నట్టు అవుతుందిగా?
– అలోక్ జోషి

పెట్టుబడుల విషయానికొస్తే వైవిధ్యం ఎంతో ముఖ్యమైనది. అన్ని గుడ్లను ఒక్కటే పెట్టెలో పెట్టడం సరికాదన్నట్టు.. పెట్టుబడులు అన్నింటినీ ఒక్కటే సాధనంలో ఇన్వెస్ట్ చేయడం కూడా సరైనది అనిపించుకోదు. అనుకున్న విధంగా సంబంధిత సాధనం పనితీరు లేకపోతే అప్పుడు పరిస్థితి ఏంటి? అది ప్రతికూలంగా మారిపోతే? అందుకే వైవిధ్యం అన్నది ఈ రిస్క్‌ను తగ్గించేస్తుంది. వివిధ సాధనాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి. కొన్ని రకాల కంపెనీలు కొన్ని సమయాల్లో మంచిగాను, ప్రతికూలంగాను పనితీరు చూపిస్తుంటాయి. వివిధ కంపెనీలనేవి, వివిధ రంగాల నుంచి ఉండాలి. అలాగే, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందినవి అయి ఉండాలి. మెరుగ్గా నిర్వహించే ఏ మ్యూచువల్ ఫండ్ పథకంలో అయినా ఈ విధమైన వైవిధ్యం ఉంటుంది. వివిధ కంపెనీలు, వివిధ రంగాలు, వివిధ పరిమాణాలతో కూడిన కంపెనీల (మార్కెట్ క్యాప్ ఆధారింగా సైజు) మధ్య పెట్టుబడులు విస్తరించి ఉంటాయి. అందుకే తగినంత భద్రత ఉంటుంది. కాకపోతే పెట్టుబడులు పెట్టే వారు ఫండ్ మేనేజర్ల పరంగా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే? ఒక మ్యూచువల్ ఫండ్ పథకం 20–30 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల తగినంత వైవిధ్యం ఉంటుంది. కానీ, ఒక్కటే ఫండ్ మేనేజర్ పరిధిలో పెట్టుబడులను పరిమితం చేయడం వల్ల అది రిస్క్‌కు దారి తీస్తుంది. ఒక్కటే మ్యూచువల్ ఫండ్స్ సంస్థ పరిధిలోని వివిధ పథకాల మధ్య పెట్టుబడులు కేటాయించినా కానీ, పెట్టుబడుల శ్రేణి ఒక్కటే ఉండడం వల్ల రిస్క్ ఉంటుంది. అందుకని వివిధ ఫండ్స్ సంస్థల పరిధిలో వివిధ ఫండ్ మేనేజర్ల మధ్య మన పెట్టుబడులను విభజించుకోవాలి. మా నిర్ణయం ప్రకారం నాలుగు లేదా ఐదు పథకాలు ఈ విధమైన వైవిధ్యానికి సరిపోతాయి. ఇంతకుమించిన పథకాల మధ్య పెట్టుబడులు కేటాయించుకోవడం వల్ల అదనంగా వచ్చే వైవిధ్యం కానీ, రిస్క్ తగ్గడం కానీ ఉండదు. మరీ ఎక్కువ పథకాలు అయినా, పెట్టుబడుల సౌలభ్యం తగ్గుతుంది. నాణ్యమైన ఎంపికే రాబడులను నిర్ణయిస్తుంది.

నా దగ్గర 1995లో కొనుగోలు చేసిన యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా యూనిట్లు ఉన్నాయి. వాటిని ఎలా విక్రయించాలి.
– వాణి

ఈక్విటీల్లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయాలంటూ మేము మొదటి నుంచి సూచిస్తున్నాం. మీరు 25 ఏళ్లకు పైగా ఈ పెట్టుబడులను కొసాగించినందుకు అభినందనలు. ఫండ్ హౌస్ కస్టమర్ కేర్‌ను సంప్రదించడం ద్వారా మీ పెట్టుబడుల తాజా విలువ ఎంతన్నది తెలుసుకోవచ్చు. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్ నుంచి అయినా ఈ వివరాలు తెలుసుకోవచ్చు. అకౌంట్ తెరిచి, మై ఇన్వెస్ట్‌మెంట్స్ ట్యాబ్ కింద యాడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంపిక చేసుకోవాలి. మీ పెట్టుబడుల వివరాలను నమోదు చేయడం ద్వారా ఏ రోజుకారోజు వాటి విలువ ఎంతో చూసుకోవచ్చు. మీ దగ్గరున్న పెట్టుబడులను విక్రయించుకోవాలంటే, అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నుంచి చేసుకోవాలి. లేదంటే మీ మ్యూచువల్ ఫండ్ సంస్థ (ఏఎంసీ) పంపిణీదారు అయిన క్యామ్స్ లేదా ఫిన్‌టెక్ ద్వారా కూడా రిడెంప్షన్ చేసుకోవచ్చు. ఇందుకోసం రిడెంప్షన్ ఫామ్‌ను పూరించి సమర్పించాలి. యూనిట్లను డీమెటీరియలైజ్ చేసుకుంటే, బ్రోకర్ ద్వారా విక్రయించుకోవచ్చు.

కెనరా బ్యాంక్‌కు ప్రతిష్టాత్మక ఐబీఏ అవార్డులు

ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్‌కు ప్రతిష్టాత్మక ఐబీఏ అవార్డులు లభించాయి. ''బెస్ట్ టెక్నాలజీ టాలెంట్'' కేటగిరీ అవార్డుతోపాటు బెస్ట్ టెక్నాలజీ బ్యాంక్, బెస్ట్ డిజిటల్ ఎంగేజ్‌మెంట్, బెస్ట్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కేటగిరీల్లోనూ బ్యాంక్‌కు అవార్డులు లభించాయి. ముంబైలో జరిగిన ఐబీఏ 18వ బ్యాంకింగ్ టెక్నాలజీ సదస్సు, ఎక్స్‌పో అండ్ అవార్డులు– 2022 అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'డిజిటల్ లెండింగ్ ద్వారా రుణ వృద్ధి' అనే అంశంపై జరిగిన ఒక చర్చా గోష్టిలో అశోక్ చంద్ర పాల్గొని, ఈ విభాగంలో లభ్యమవుతున్న అవకాశాల గురించి మాట్లాడారు.



క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో మిగిలి ఉన్న సీట్లకు సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయి. 5 నుంచి 7వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన వివరాలను ఓఏఎండీసీ వెబ్‌సైట్ లో అప్ లోడింగ్ చేస్తారు. 8, 9 తేదీల్లో రూ.100 ఆలస్య రుసుంతో అభ్యర్థుల వివరాలు అప్ లోడ్ చేయాలని ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసింది.

150 మంది గిరిజన విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



నైపుణ్య శిక్షణ పొందిన గిరిజన విద్యార్థులు

సాక్షి, అమరావతి: సమాజంలో పోటీ పడి రాణించాలంటే విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రావీణ్యం సాధించాలని ఎన్‌టీఆర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి(డీటీడబ్ల్యూఓ) ఎం.రుక్మంగదయ్య చెప్పారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో 150 మంది గిరిజన విద్యార్థులకు 'నాయకత్వ లక్షణాలు, సాఫ్ట్ స్కిల్స్'పై ఆదివారం శిక్షణ ఇచ్చారు. విజయవాడ బావాజీపేట నవజీవన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో రుక్మంగదయ్య మాట్లాడుతూ నవజీవన్ బాలభవన్ ద్వారా 150 మంది బడి బయట ఉన్న గిరిజన పిల్లలను తిరిగి పాఠశాల్లో చేర్పించడంతో పాటు వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. నవజీవన్ ప్రోగ్రాం మేనేజర్ శీలం జోసఫ్ డోనాల్డ్ మాట్లాడుతూ గిరిజన పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని నిరంతరం మెరుగుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ అలెగ్జాండర్ విలియమ్స్, కోఆర్డినేటర్స్ నజ్మా, పి.ఝాన్సీ రాణి, సుజాత పాల్గొని మాట్లాడారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో కోచ్‌ల నియామకం

- నియామక పత్రాలు అందజేసిన మంత్రి రోజా



ఎంపికైన కోచ్‌లతో మంత్రి రోజా

సాక్షి, అమరావతి: గిరిజనులు చాలా శక్తివంతులని, వారికి సరైన శిక్షణ అందిస్తే క్రీడల్లో అద్భుతాలు సృష్టిస్తారని క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. గిరిజన విద్యాసంస్థల్లోని విద్యార్థులకు క్రీడల్లో ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు శాప్ 23 మంది కోచ్‌లను నియమించింది. విజయవాడ శాప్ కార్యాలయంలో ఆదివారం కోచ్‌లకు మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఇందులో అథ్లెటిక్స్‌కు 6, ఆర్చరీ 4 , బాస్కెట్ బాల్ 1, వాలీబాల్ 2, జూడో 1 , హాకీ 2, వెయిట్ లిఫ్టింగ్ 2, బాక్సింగ్ 2, ఫుట్‌బాల్ 2, టేబుల్ టెన్నిస్‌కు ఒక కోచ్ చొప్పున నియమించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరు గిరిజన పాఠశాలల్లో 23 మంది కోచ్‌లను నియమించడం ఒక చరిత్ర అని, నియామకాలు చేపట్టిన శాప్‌ని, గిరిజన శాఖను ఆమె అభినందించారు. రాష్ట్రంలో 378 గిరిజన పాఠశాలలుంటే స్పోర్ట్స్ స్కూల్ ఒక్కటే ఉందని, ఇప్పుడు ఆరు పాఠశాలలను గుర్తించి 600 మంది గిరిజన పిల్లలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణ ఆరోగ్యానికి పటిష్ట కార్యాచరణ

- 185 గురుకులాల్లో 96,771 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు

సాక్షి, అమరావతి: గురుకులాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహిస్తోంది. దీన్లోభాగంగా రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గురుకులాల్లో చదివే పేదపిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు వైద్యసేవలను కూడా అందించేలా సాంఘిక సంక్షేమశాఖ వారికి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు తక్షణ చికిత్స అందిస్తోంది. ప్రధానంగా దృష్టి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. వైఎస్సార్ కంటి వెలుగు ప్రత్యేక వైద్యబృందాలతో ఇప్పటివరకు 71 గురుకులాల్లో నేత్రపరీక్షలు నిర్వహించారు. వారిలో కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన చికిత్స చేస్తున్నారు. విద్యార్థుల్లో దంతసమస్యలను గుర్తించేందుకు ఇప్పటివరకు 48 గురుకులాల్లో పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. రక్తహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 185 గురుకులాల్లో 91,548 మంది విద్యార్థులకు ఎనీమియాకు సంబంధించిన పలు పరీక్షలు చేశారు. పోషకాహారలోపంతో బాధపడేవారిని గుర్తించేందుకు 96,771 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.

రోజుకు సగటున 6.58 గంటలు టీవీ, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్లకే కేటాయింపు

గతంతో పోలిస్తే 49 నిమిషాల పాటు పెరిగిన స్క్రీనింగ్ సమయం

ఒక వ్యక్తి మేల్కొని ఉండే సమయంలో 40% ఇంటర్‌నెట్‌లోనే..

అత్యధికంగా దక్షిణాఫ్రికాలో 10.46 గంటలు, అమెరికాలో 7.04 గంటలు

భారత్‌లో టీనేజర్లు రోజుకు 8 గంటలు ఆన్‌లైన్‌లోనే..





స్మార్ట్‌గా.. అతుక్కుపోతున్నారు!

అధిక స్క్రీనింగ్‌తో తీవ్ర అనారోగ్య సమస్యలొస్తాయని వైద్య నిపుణుల హెచ్చరిక

సాక్షి, అమరావతి: ప్రస్తుతం మనిషి బాహ్య ప్రపంచానికి దూరంగా ఆన్‌లైన్‌లో గడుపుతున్నాడు. పక్కవాడిని కూడా చాటింగ్‌లోనే పలకరిస్తున్నాడు. సుఖదుఃఖాలన్నీ కూర్చున్నచోటునే అనుభవిస్తున్నాడు. గంటల కొద్దీ స్మార్ట్‌ఫోన్, టీవీ, ఇంటర్‌నెట్ స్క్రీనింగ్‌లో మునిగిపోతున్నాడు. దైనందిన జీవితంలో చాలామంది మేల్కొని ఉండే సమయంలో ఏకంగా 44 శాతం సమయాన్ని స్క్రీనింగ్ కోసమే కేటాయిస్తుండటం (40 శాతం ఇంటర్‌నెట్‌లో) ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటు స్క్రీనింగ్ రేటు 6.58 గంటలుగా ఉంది. ఇది 2013తో పోలిస్తే 49 నిమిషాలు పెరగడం గమనార్హం. అత్యధికంగా దక్షిణాఫ్రికాలో 10.46 గంటలు, అమెరికాలో అయితే 7.04 గంటలు, భారత్‌లో అయితే 7.18 గంటలుగా నివేదికలు చెబుతున్నాయి. ఇక్కడ తల్లిదండ్రులతో కలిసి 0–2 ఏళ్లలోపు పిల్లలు 49 శాతం మంది సెల్‌ఫోన్లలో ఉంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2019లో సగటున 2.56 గంటల పాటు మొబైల్ స్క్రీన్ చూసిన వాళ్లు ఇప్పుడు 4.12 గంటలు చూస్తున్నారు. దేశంలో టీనేజర్లు అయితే ఏకంగా 8 గంటలకు పైగా ఆన్‌లైన్‌లోనే బతికేస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా సగటు స్క్రీనింగ్ సమయం కంటే ఎక్కువ.

ప్రపంచవ్యాప్తంగా ఇలా.. (గంటల్లో)

సం.	స్క్రీనింగ్ సగటు		
		2017	6.46
		2018	6.48
2013	6.09	2019	6.38
2014	6.23	2020	6.54
2015	6.20	2021-22	6.58
2016	6.29	(ఇప్పటివరకు)	

కళ్లు పాడారిపోతాయి

ఎక్కువసేపు మొబైల్స్, టీవీ, కంప్యూటర్‌లు చూడటంవల్ల కళ్లు పొడారిపోతాయి. దీంతో కళ్లు ఎర్రగా మారి దురదలు, మంటలు వస్తుంటాయి. క్రమేణా నల్లగుడ్డు సమస్యలకు దారితీస్తాయి. వీటితో పాటు నిద్రలేమి, మానసిక సమస్యలకు దారితీస్తాయి. విద్యార్థులైతే చదువుపై దృష్టి సారించలేక పోవడం, చదివినవి మర్చిపోవడం వంటి సమస్యలకు గురవుతారు. అవసరమైన మేరకే టీవీలు, కంప్యూటర్, మొబైల్స్‌ను చూడాలి.

– ఈఎస్ఎన్ మూర్తి, నేత్ర వైద్య నిపుణులు, జీజీహెచ్, విజయవాడ




చిన్నారుల కోసం నిర్ణీత సమయం..

అమెరికన్ టీనేజర్లు అయితే కేవలం 3 గంటలు మాత్రమే టీవీ, వీడియోలు చూడటానికి సమయాన్ని కేటాయిస్తున్నారు. చైనాలో వారానికి మూడు గంటలు మాత్రమే చిన్నారులకు స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయాలని ఆ దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే రోజుకు 26 నిమిషాలు మాత్రమే నచ్చిన పరికరంలో నచ్చిన అంశాలను వీక్షించవచ్చు. ఇదే దారిలో జపాన్, రష్యా కూడా 30 నిమిషాలు, ఇజ్రాయెల్ 19 నిమిషాలు చాలంటూ పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నాయి.

చిన్నారుల స్క్రీనింగ్ ఇలా.. (శాతాల్లో)

వయసు	టీవీ	టాబ్లెట్	స్మార్ట్‌ఫోన్	కంప్యూటర్	గేమ్స్
0-2	74	35	49	12	9
3-4	90	64	62	21	25
5-8	93	81	59	54	58
9-11	91	78	67	73	68

తక్కువ ఆదాయం ఉన్నవాళ్లే ఎక్కువ సమయం



స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌టీవీలు.. స్క్రీనింగ్‌కు ఎక్కువగా కారణమవుతున్నాయి. అయితే, వార్షిక ఆదాయం తక్కువ ఉన్న వాళ్లే ఎలక్ట్రానిక్ స్క్రీనింగ్‌లో ఎక్కువసేపు లీనమవుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. దేశంలో 97.2 శాతం మంది టీవీ, 92 శాతం మంది వీడియో గేములు ఆడుతున్నట్లు సర్వేల్లో తేలింది. ఇక్కడ 74 శాతం తల్లిదండ్రులు ఏడేళ్ల వయసు పిల్లలతో కలిసి ఎక్కువగా టీవీలు చూస్తున్నారు.

రోజూ సగటున ఒక వ్యక్తి స్క్రీనింగ్‌లు ఇలా.. (గంటల్లో)

దేశం	ఫోన్	కంప్యూటర్	వీడియో గేమ్స్	సోషల్ మీడియా
దక్షిణాఫ్రికా	5.09	5.37	1.03	3.43
ఫిలిప్పీన్స్	5.47	4.40	1.34	4.06
బ్రెజిల్	5.25	4.54	1.10	3.41
కొలంబియా	5.09	4.54	1.06	3.46
మలేషియా	4.49	4.21	1.13	3.20
థాయిలాండ్	5.28	3.38	1.58	2.59
యూఏఈ	4.35	4.01	1.29	2.04
సౌదీ అరేబియా	4.35	3.30	1.53	3.24
రష్యా	3.39	4.11	0.30	2.27
సింగపూర్	3.38	3.50	1.11	2.31
భారత్	4.05	3.13	1.21	2.36

ఆరోగ్యానికి హానికరం



గంటల కొద్దీ తదేకంగా టీవీలు, ఫోన్లు, ఇంటర్‌నెట్‌కు అతుక్కుపోతే తీవ్ర అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారులు, యుక్త వయస్కులకు స్మార్ట్‌ఫోన్ వ్యసనంగా మారింది. దీనిని నోమోఫోబియాగా పిలుస్తారు. ఫోన్ లేకుండా వారు ఉండలేరు. చిన్నారుల్లో మానసికంగా, భావోద్వేగాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎలిమెంటరీ స్కూల్ స్థాయి పిల్లలు రెండు గంటలు అంతకంటే ఎక్కువసేపు స్క్రీనింగ్‌లో ఉంటే వారికి మెల్లగా స్థిరత్వాన్ని, నిర్ణయించుకునే శక్తి కోల్పోతారు. పలు దేశాల్లో 5–17 ఏళ్ల మధ్య వయసు చిన్నారుల్లో ఊబకాయం పెరిగింది. 9–10 ఏళ్ల వయసు పిల్లల్లో 3 గంటలకు పైగా స్క్రీన్‌ను చూస్తే టైప్–2 డయాబెటిస్ వచ్చినట్లు, గ్రహణశక్తిలో వెనుబడినట్లు గుర్తించారు. పెద్దల్లో అయితే నిద్రలేమికి దారితీస్తుంది. కంటి చూపును తీవ్రంగా దెబ్బతీస్తుంది. శరీరం పనితీరులో మార్పులొస్తాయి. వీటిని అరికట్టేందుకు సోషల్ మీడియా వాడకాన్ని ప్రతిఒక్కరూ రోజుకు 30 నిమిషాలకు పరిమితం చేయాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

రాస్తున్నది తక్కువ.. ఉత్తీర్ణత ఇంకా తక్కువ

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి..

నాలుగో వంతు మందికి మాత్రమే అర్హత మార్కులు



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంటోంది. అడ్వాన్స్‌డ్ రాసేందుకు జేఈఈ మెయిన్స్ నుంచి 2.50 లక్షల మంది వరకు అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నా.. అందులో 60 శాతం మంది మాత్రమే ఈ పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్ష రాసిన వారిలోనూ ఉత్తీర్ణులవుతున్న వారు తక్కువగానే ఉంటున్నారు. ఇందులో కటాఫ్ మార్కులతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా తగ్గుతూ వస్తోంది. జనరల్‌తో పాటు రిజర్వుడ్ కేటగిరీల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2022 ఫలితాలు పరిశీలిస్తే ఈ సంవత్సరం ప్రశ్నల తీరు కఠినంగా ఉండటం వల్ల ఉత్తీర్ణత శాతం, కటాఫ్ మార్కులు తగ్గాయి. ఉత్తీర్ణత శాతం 2021లో 29.54 శాతం ఉండగా.. 2022లో 26.17 శాతంగా నమోదైంది. 2021తో పోల్చితే 2022లో క్వాలిఫైయింగ్ మార్కులను కూడా తగ్గించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2022 ప్రవేశ పరీక్షలో 1,55,538 మంది అభ్యర్థులలో 40,712 మంది ఉత్తీర్ణులయ్యారు. జేఈఈ మెయిన్స్ నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు పంపేలా సంఖ్యను 2.50 లక్షలకు పెంచినా హాజరు శాతం తక్కువగానే ఉంటోంది. రెండేళ్ల పాటు కోవిడ్ ప్రభావం కారణంగా చదువులు సరిగా సాగకపోవడం కూడా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో హాజరు శాతం, ఉత్తీర్ణత శాతం పెరగకపోవడానికి కారణంగా పేర్కొంటున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మహిళల హాజరు, ఉత్తీర్ణత శాతం కూడా తక్కువగానే ఉంటోంది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరైన ఎస్సీ అభ్యర్థులు 31.67 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఎస్టీ అభ్యర్థులు 26.83 శాతం, ఓబీసీ అభ్యర్థులు 16.44 మంది అర్హత సాధించారు.

ప్రత్యేక కోచింగ్ ఉంటేనే అర్హత మార్కులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షలు అత్యంత కఠినమైన ప్రశ్నలతో జరుగుతాయని.. వాటిలో అర్హత సాధించాలంటే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా వల్ల విద్యార్థులు దాదాపు రెండేళ్లపాటు తరగతులకు దూరంగా ఉండటంతో వారిలో ఆయా తరగతులకు సంబంధించిన సామర్థ్యాలు దెబ్బతిని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలను ఎదుర్కొనలేకపోయారని విశ్లేషిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం, కటాఫ్ మార్కులు తగ్గడానికి ఇవే కారణమంటున్నారు. ఐఐటీలలో ప్రవేశం పొందాలంటే, అభ్యర్థులు తప్పనిసరిగా ఈ పరీక్షలో అత్యధిక స్కోరు మార్కులు సాధించాల్సి ఉంటుంది. కోవిడ్ విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను ప్రభావితం చేసిందని, ఈ ఇబ్బందులను అధిగమించడానికి కనీసం రెండేళ్లు పడుతుందని పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది కూడా ఉత్తీర్ణత శాతంలో తగ్గుదలే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

సంవత్సరం	అడ్వాన్స్‌డ్‌కు అర్హులు	హాజరు	అర్హత	మహిళా అర్హులు
2022	2,10,251	1,55,538	40,712	6,516
2021	2,50,597	1,41,699	41,862	6,452
2020	2,50,681	1,50,838	43,204	6,707
2019	2,45,194	1,74,432	38,705	5,356
2018	2,31,024	1,65,656	31,988	4,179
2017	2,21,834	1,71,000	51,000	7,259

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత మార్కులు తగ్గుతున్న తీరు..

కేటగిరీ	2022	2021	2020	2019	2018	2017
జనరల్	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	50	56	62	83	81	115
ఓబీసీ	50	56	62	83	45	64
ఎస్సీ	28	31	34	46	45	64
ఎస్టీ	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	28	31	34	46	45	64

60.99 లక్షల మందికి రూ.1,551.36 కోట్లు

97.89% పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: ఆదివారం సెలవు రోజున కూడా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60,99,891 మంది లబ్ధిదారులకు రూ.1,551.36 కోట్లు పంపిణీ చేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. ఇప్పటికే 97.89% పింఛన్ల పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారికి పింఛన్‌లను సోమవారం పంపిణీ చేస్తామని చెప్పారు.



గుంటూరులో చిన్న పిచ్చయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సునీత



విజయవాడలో తాడికొండ వాగ్దేవ్‌కు దివ్యాంగ పింఛను ఇస్తున్న వలంటీర్ పవన్‌కుమార్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేదారిలంకలో సత్యవతికి పింఛను ఇస్తున్న వలంటీర్ రామకృష్ణ

ఇం'ధన' పొదుపుపై విద్యార్థి ఉద్యమం

అవగాహన కోసం విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్, షార్ట్ ఫిల్మ్ పోటీలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యార్థులకు విద్యుత్ పొదుపు, ఇంధన వనరుల పరిరక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీ ఎస్‌ఈసీఎం) చర్యలు చేపట్టింది. విద్యా శాఖ సహకారంతో ఇప్పటికే 150కి పైగా ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్‌లను ప్రారంభించింది. ఎనర్జీ క్లబ్‌లలో చేరిన విద్యార్థులకు విద్యుత్, ఇతర సహజ ఇంధన వనరులపై అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం వ్యాసరచన, స్లోగన్, షార్ట్ ఫిల్మ్ (వీడియో) పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధులను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సౌజన్యంతో ఏపీ ఎస్ఈసీఎం ఆయా పాఠశాలలకు అందజేస్తోంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచన మేరకు ఎనర్జీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీ ఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు.

75 శాతం.. 65 శాతం లభ్యత తేల్చేదెవరు?

- కృష్ణా జలాల వినియోగంపై ప్రశ్నిస్తున్న న్యాయ, నీటిపారుదలరంగ నిపుణులు
- సుప్రీంకోర్టులో ఏపీ, తెలంగాణలు ఎస్సెల్పీల దాఖలుతో నిలిచిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమలు
- ట్రిబ్యునల్ అదనంగా కేటాయించిన నీటిలో 75 టీఎంసీలు వాడుకుంటామని కోరిన కర్ణాటక
- దీనిపై ఏపీ, తెలంగాణ అభ్యంతరం
- వీటన్నింటిపై 6న విచారించనున్న సుప్రీంకోర్టు
- అవార్డు అమలుకు కృష్ణా రివర్ అథారిటీని ఏర్పాటుచేయాలన్న ట్రిబ్యునల్
- ఆ అథారిటీకే 75 శాతం, 65 శాతం లభ్యత జలాలపై లెక్కతేల్చే అధికారం

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో 65% లభ్యతగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన 173 టీఎంసీల్లో 75 టీఎంసీలను వినియోగించుకోవడానికి అవకాశమివ్వాలని సుప్రీంకోర్టును తాజాగా కర్ణాటక సర్కార్ కోరడంపై న్యాయ, నీటిపారుదలరంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ట్రిబ్యునల్ అవార్డును సవాలు చేస్తూ దాఖలైన ఎస్సెల్పీల (స్పెషల్ లీవ్ పిటిషన్)పై తుది తీర్పునకు లోబడి వాటిని వినియోగించుకుంటామని కర్ణాటక కోరడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ట్రిబ్యునల్ అవార్డును కేంద్రం నోటిఫై (అమలు) చేస్తేనే.. ఆ ట్రిబ్యునల్ కేటాయించిన జలాలను రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి కృష్ణా రివర్ అథారిటీ అమల్లోకి వస్తుంది. ఆ అథారిటీకి మాత్రమే 75% లభ్యత జలాలు ఏవి? 65% లభ్యత జలాలు ఏవి? అన్నది తేల్చే అధికారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అథారిటీ ఏర్పాటు చేయకుండా.. కర్ణాటకకు 75 టీఎంసీలను వాడుకోవడానికి అనుమతిస్తే దిగువ రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ హక్కులను హరించడమే అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. కర్ణాటక తాజాగా దరఖాస్తు చేసిన ఇంటెరిమ్ అప్లికేషన్ (ఐఏ)తోపాటు.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డును అమలు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని మహారాష్ట్ర, కర్ణాటకలు దాఖలుచేసిన ఎస్సెల్పీలపై కూడా ఈనెల 6న సుప్రీంకోర్టు విచారించనుంది.

వివాదం తేలకుండానే..

- కృష్ణాలో 75% లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీలను మూడు రాష్ట్రాల (మహారాష్ట్ర 585, కర్ణాటక 734, ఉమ్మడి ఏపీ 811)కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. ఈ అవార్డు 2000, మే 31 వరకూ అమలులో ఉంది. తర్వాత కృష్ణా జలాలను పునఃపంపిణీచేయాలన్న మూడు రాష్ట్రాల ప్రతిపాదనతో 2004లో కేంద్రం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసింది.
- 'కృష్ణా'లో 65% లభ్యత ఆధారంగా 2,578 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తేల్చి.. 2010, డిసెంబర్ 30న కేంద్రానికి ప్రాథమిక నివేదిక ఇచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 2,130 టీఎంసీలలో ఎలాంటి మార్పుచేయడానికి వీల్లేదు కాబట్టి.. ఆపైన అంటే 65% లభ్యతగా ఉన్న నీటిని మూడు రాష్ట్రాలకు పంపిణీ చేసింది.
- ఆల్మట్టి ఎత్తును 519.5 నుంచి 524.256 మీటర్లకు పెంచుకోవడానికి కర్ణాటకకు అనుమతివ్వడం.. 65% లభ్యత ఆధారంగా కర్ణాటక, మహారాష్ట్రలకు అదనంగా కేటాయించడం, మిగులు జలాల వినియోగం.. క్యారీ ఓవర్ స్టోరేజీలలో మార్పులవల్ల అన్యాయం జరుగుతోందంటూ 2011లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేసింది.
- దీనిపై విచారణ జరిపిన 'సుప్రీం'.. తుది విచారణ జరపడానికి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అనుమతించింది. తుది నివేదిక తర్వాత అభ్యంతరాలుంటే తమను సంప్రదించవచ్చునని ఏపీకి సూచించింది. ఇక ప్రాథమిక నివేదికతో పోలిస్తే.. కర్ణాటకకు అదనంగా కేటాయించిన నీటిలో నాలుగు టీఎంసీలను కోతవేసి ఏపీకి కేటాయించడం తప్ప ఎలాంటి మార్పులు లేకుండానే 2013, నవంబర్ 29న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేంద్రానికి తుది నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం.. మహారాష్ట్రకు 666, కర్ణాటకకు 907, ఏపీకి 1,005 టీఎంసీలు దక్కుతాయి.
- తుది నివేదికను వ్యతిరేకిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేయడంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమలు నిలిచిపోయింది.
- రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్సెల్పీలో తెలంగాణ సర్కార్ కూడా భాగస్వామిగా చేరింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుది నివేదికను అమలు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని మహారాష్ట్ర, కర్ణాటకలు 2013లోనే ఎస్సెల్పీలు దాఖలు చేశాయి. వీటిపై సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఎస్సెల్పీలపై తుదితీర్పు ఇవ్వడంపైనే ట్రిబ్యునల్ అవార్డు ఆధారపడి ఉంటుంది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చేవరకూ బచావత్ ట్రిబ్యునల్ అవార్డే అమల్లో ఉంటుంది.

అదే జరిగితే దిగువ రాష్ట్రాలకు శరాఘాతమే..

బచావత్ ట్రిబ్యునల్ 75% లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీలను రాష్ట్రాలు వాడుకున్న తర్వాతే.. 65% లభ్యత కింద పంపిణీ చేసిన 448 టీఎంసీలను ఆయా రాష్ట్రాలు వాడుకోవాలని ట్రిబ్యునల్ తుది నివేదికలో స్పష్టంచేసింది. 75% లభ్యత నీటి వినియోగాన్ని లెక్కకట్టడానికి.. 65% లభ్యత నీటిని ఆయా రాష్ట్రాలు ఎప్పుడు వాడుకోవాలన్నది తేల్చడానికి కృష్ణా రివర్ అథారిటీని ఏర్పాటుచేయాలని కేంద్రానికి సూచించింది. కానీ.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డే అమల్లోకి రాలేదు. ఈ నేపథ్యంలో 75% లభ్యత.. 65% లభ్యత జలాలను ఎవరూ తేల్చలేరు. కర్ణాటక తాజాగా కోరిన మేరకు 75 టీఎంసీలను అదనంగా వాడుకోవడానికే అనుమతిస్తే.. దిగువ రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలకు శరాఘాతమేనని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. 65% లభ్యతగా కేటాయించిన 194 టీఎంసీల మాట దేవుడెరుగు.. నికర జలాలు 811 టీఎంసీలు కూడా దిగువన ఉన్న రెండు రాష్ట్రాలకు చేరే అవకాశం ఉండదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.